
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 42

గురువారం 4-5-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ముంబై మెరుపులు...

పంజాబ్ కింగ్స్‌పై ఆరు వికెట్లతో ఘనవిజయం. - 12లో



అవసరం నుంచి ఆకాంక్ష..

'కోవె'కు అధ్యక్షురాలిగా ఎదిగిన మహిళా పారిశ్రామికవేత్త ఆలూరి లలిత.. - 11లో



పుతిన్‌పై హత్యాయత్నం

డ్రోన్ల దాడులతో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను హత్య చేసేందుకు ఉక్రెయిన్ ప్రయత్నిస్తోందని రష్యా తీవ్ర ఆరోపణలు చేసింది.

- వివరాలు 6లో



ప్రపంచబ్యాంక్ అధ్యక్షునిగా బంగా

ప్రపంచ బ్యాంక్ కాబోయే అధ్యక్షునిగా భారతీయ అమెరికన్ అజయ్ బంగా ఖరారైనట్లు ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ప్రకటించారు.

- వివరాలు 6లో



టీనేజీ విద్యార్థి ఘాతుకం

ఐరోపా దేశం సెర్బియాలో ఓ విద్యార్థి జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో ఎనిమిది మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో



మనోబాల కన్నుమూత

అనారోగ్యం కారణంగా ప్రముఖ హాస్యనటుడు, దర్శకుడు మనోబాల చెన్నైలోని ఓ ఆస్పత్రిలో బుధవారం తుదిశ్వాస విడిచారు.

- వివరాలు 12లో

ఏటా మునక.. ముందే ఏరువాక?



వ్యవసాయ సీజన్‌ను ముందుకు జరిపే ప్రతిపాదనపై చర్చ

అకాల వర్షాలతో పంట నష్టం నుంచి బయటపడేందుకు సీఎం సూచన

- దీనిపై కసరత్తు మొదలుపెట్టిన వ్యవసాయశాఖ
- రైతులను సమాయత్తం చేయడంపై అధికారుల దృష్టి
- నేరుగా గింజలు వెదజల్లే సాగు పద్ధతి పాటించాలని విజ్ఞప్తి
- సీజన్‌ను ముందుకు జరపడంపై వ్యవసాయ శాస్త్రవేత్తల్లో భిన్నాభిప్రాయాలు
- దేశీ రకాలను ప్రోత్సహించడం వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టిపెట్టాలనే సూచనలు

సాక్షి, హైదరాబాద్: వరుసగా అకాల వర్షాలు.. వడగళ్ల వానలు.. ఈదురు గాలులు.. కోతకు వచ్చిన వరి రాలిపోయింది, కోసి పెట్టిన ధాన్యం నాని పోయింది. ఈ ఒక్కసారే కాదు.. ఏటా ఇదే పరిస్థితి. ఈ సమస్యను తప్పించుకునేందుకు వ్యవసాయ సీజన్‌నే ముందుకు జరిపే ఆలోచన చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించడంతో వ్యవసాయ శాఖ కసరత్తు మొదలుపెట్టింది. సాధ్యాసాధ్యాల పరిశీలనతోపాటు రైతుల్లో అవగాహన కల్పించేందుకూ ఏర్పాట్లు చేస్తోంది. వానాకాలం పంటను మే చివరి వారంలో, యాసంగిని అక్టోబర్ తొలి వారంలో ప్రారంభిస్తే.. అకాల వర్షాల ముప్పు నుంచి తప్పించుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. ఇక యాసంగి వరి కోతలను మార్చి నాటికే పూర్తిచేస్తే.. ధాన్యం మిల్లింగ్‌లో నూకలు పెరిగే సమస్య

మిగతా 2వ పేజీలో ▶

దేశీ రకాలతో ప్రయోజనం

➤ అన్నిరకాల కాలాలను తట్టుకునే దేశీ రకాల వరిని వేయడమే అకాల వర్షాల సమస్యకు పరిష్కారం. భారీ వర్షం, వడగళ్లతో పంట నేలకొరిగినా.. దేశీ వరి మళ్లీ నిలబడుతుంది. మొక్క గట్టిగా ఉంటుంది. వడగళ్లు, ఈదురుగాలులకు గింజలు రాలవు. ఇప్పుడు సాగుచేస్తున్న హైబ్రిడ్ రకాల్లో ఎరువులు ఎక్కువ వాడుతారు. మొక్కలు బలహీనంగా ఉంటాయి. నేలకొరుగుతాయి, గింజలు రాలిపోతాయి. స్థానిక వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా.. జిల్లా, మండలాల వారీగా వరి రకంపై నిర్ణయం జరగాలి.

– డి.నర్సింహారెడ్డి, జాతీయ వ్యవసాయ నిపుణుడు

నెలలో రెండు సార్లు దెబ్బ

గత నెల రోజుల్లో రెండుసార్లు కురిసిన భారీ వడగళ్ల వానల ధాటికి రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. తొలివానలకు 5 లక్షల ఎకరాల్లో, రెండోసారి ఏకంగా 12 లక్షల ఎకరాల్లో నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇంకా వ్యవసాయ శాఖ సర్వే కొనసాగుతోంది. పూర్తి అంచనాలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ అకాల వర్షాలపై మంగళవారం సమీక్షించిన సీఎం కేసీఆర్.. పంటల సీజన్లను కాస్త ముందుకు జరపాలని, యాసంగి సీజన్ వరి కోతలు మార్చిలోగా పూర్తయ్యేలా చూడాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. ఈ నేపథ్యంలో పలు అంశాలపై వ్యవసాయ శాఖ దృష్టిపెట్టింది.

పంట నష్టం సర్వే గడువు పెంపు..

ఈ నెల 12 వరకు నమోదు..

32 అంశాలతో నష్టం వివరాల సేకరణ

- వివరాలు 2లో

విచారిస్తేనే వెలుగులోకి!

చంద్రబాబు సర్కారు కుంభకోణాలపై 'సుప్రీం' కీలక తీర్పు

మంత్రివర్గ ఉపసంఘం, సిట్ ఏర్పాటు జీవోలపై హైకోర్టు ఉత్తర్వులు రద్దు

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను తీవ్రంగా ఆక్షేపించిన సుప్రీంకోర్టు
- అలాంటి ఉత్తర్వులు ఇచ్చి ఉండాల్సింది కాదన్న ధర్మాసనం
- ప్రభుత్వ జీవోలను హైకోర్టు తప్పుగా అన్వయించుకుంది
- గత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు, ఉల్లంఘనలపై దర్యాప్తు కోసమే ఆ జీవోలు
- గత ప్రభుత్వ నిర్ణయాలను తిరగరాసేందుకు కాదు
- కేంద్రం, ఈడీలను ప్రతివాదులుగా చేర్చకపోవడం సరికాదు
- రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాన్ని కొట్టేసి ఉండాల్సింది కాదు
- కేంద్రం,ఈడీలను ప్రతివాదులుగా చేర్చి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోండి
- 3 నెలల్లో ప్రధాన వ్యాజ్యాలను తేల్చాలని హైకోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం

10లో

"రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు తప్పుగా అన్వయించింది. గత సర్కారు నిర్ణయాలను రద్దు చేసినట్లుగా హైకోర్టు పరిగణించిందన్న రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ న్యాయవాది వాదనలు సమర్థనీయంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను పరిశీలిస్తే.. గత సర్కారు తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించటాన్ని రద్దు చేస్తున్నట్లుగా భావించలేం" - 'సుప్రీం' ధర్మాసనం



న్యూస్‌రీల్

ఇప్పటికైనా పాపపరిహారం చేసుకోండి: బండి



కొత్త సచివాలయంలోనైనా రైతులకు సాయం చేసి పాప పరిహారం చేసుకోవాలని సీఎం కేసీఆర్‌కు బండి సంజయ్ సూచించారు. గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో పంటనష్టాలను ఆయన పరిశీలించారు.

- వివరాలు 2లో

మేడారం మహాజాతర తేదీలు ఖరారు



తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర తేదీలు ఖరారయ్యాయి. ఈసారి 2024 ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు నిర్వహించాలని పూజారుల సంఘం నిర్ణయించింది.

- వివరాలు 14లో

నీరా కేఫ్, క్యాంటీన్ ప్రారంభం



నీరా పానీయంతోపాటు వాటి ఉప ఉత్పత్తులను విక్రయించేందుకు నీరా కేఫ్, క్యాంటీన్ హైదరాబాద్ వాసులకు అందుబాటులోకి వచ్చాయి. నగరంలోని నెక్లెస్ రోడ్డులో ఏర్పాటు చేసిన నీరా కేఫ్, క్యాంటీన్‌లను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు.

- వివరాలు 14లో

నేడు ఢిల్లీలో బీఆర్ఎస్ నూతన భవనం ప్రారంభం



దేశ రాజధాని ఢిల్లీలో బీఆర్ఎస్ నూతన కార్యాలయ భవనాన్ని గురువారం ప్రారంభించనున్నారు. పూజల అనంతరం కేసీఆర్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి పనులను మొదలుపెట్టనున్నారు.

- వివరాలు 10లో





కర్ణాటక..

జై బజరంగబలీ అంటూ ఓటేయండి



➤ అధికారంలోకి వస్తే నిర్ణయాత్మక చర్యల్లో భాగంగా బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నదని, ఇలా అవమానించే వారికి పోలింగ్ కేంద్రంలో మీట నొక్కేటపుడు జై బజరంగబలీ అని నినదించడం ద్వారా బుద్ధి చెప్పాలని మోదీ ఓటర్లకు పిలుపునిచ్చారు.

- వివరాలు 6లో

నేడు కర్ణాటకలో రోజంతా 'చాలీసా'

బెంగళూరు: బజరంగ్ దళ్ వివాదం కొత్త మలుపులు తిరుగుతోంది. కర్ణాటకలో అధికారంలోకి వస్తే బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీపై ఆ సంస్థ మండిపడింది. ఇందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం రోజంతా హనుమాన్ చాలీసా పఠించాలని పిలుపునిచ్చింది. ఇందుకోసం విస్తృత ఏర్పాట్లు చేసినట్టు తెలిపింది. ''ధర్మం ప్రమాదంలో పడింది. ఇలాంటి సమయంలో ఒక్కతాటిపై నిలిచి గొంతు విప్పడమే మన ముందున్న దారి. భేదాలన్నీ పక్కన పెట్టి అందరమూ ఒక్కటవుదాం'' అంటూ పిలుపునిచ్చింది. వీహెచ్‌పీ ఇందుకు మద్దతు ప్రకటించింది.

దిగ్గజ నేతల ఢీ



➤ ఉత్తర కర్ణాటకలో అంతర్భాగమైన 'హైదరాబాద్ కర్ణాటక'లోని బీదర్ జిల్లాలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. ఈ నెల 10న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. బీజేపీ, కాంగ్రెస్, జేడీ (ఎస్) నుంచి దిగ్గజ నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

- వివరాలు 2లో

మామిడికి 'కోటి' కాశాయ్..

మైసూరు: అసెంబ్లీ ఎన్నికల వేళ కర్ణాటకలో చెట్లకు డబ్బులు కాస్తున్నాయి! అది కూడా కోట్ల కొద్దీ!! పుత్తూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అశోక్‌కుమార్ రాయ్ సోదరుని ఇంట్లో ఐటీ అధికారులు బుధవారం సోదాలు జరిపారు. ఇంటి ఆవరణలోని మామిడి చెట్టుపై బాక్సులో భద్రంగా దాచిన కోటి రూపాయలు బయట పడటంతో ఆశ్చర్యపోయారు. అలాగే మరో ఉదంతంలో ఓ ఆటోలో తరలిస్తున్న కోటి రూపాయల మొత్తాన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.



భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్. చిత్రంలో జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు తదితరులు

అభివృద్ధికి చిరునామా

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు కిరీటం

శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

30 నెలల్లో ఇక్కడి నుంచి విమానాల రాకపోకలు 10లో

టైర్-1 సిటీగా విశాఖ

అదానీ డేటా సెంటర్‌కు భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్

రాజ్‌భవన్‌కు ప్రగతిభవన్ దూరం..

- దేశ, విదేశాల అధిపతులనైనా కలవగలం.. ఇక్కడి స్టేట్ చీఫ్‌ను మాత్రం కలవలేం
- ఇది మంచి ధోరణి కాదు..
- రాజ్యాంగ పదవిలో ఉన్నా సెక్రటేరియట్ ప్రారంభానికి పిలవలేదు
- గవర్నర్ తమిళిసై వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: 'దేశ, విదేశాల అధిపతులనైనా కలవగలం.. దురదృష్టవశాత్తు ఇక్కడి స్టేట్ చీఫ్‌ను మాత్రం కలవలేం.. కనీసం దగ్గరగా వెళ్లడానికి కూడా అవకాశం ఉండదు..రాజ్‌భవన్‌కు ప్రగతిభవన్ దూరంగా ఉంది. ఇది మంచి ధోరణి కాదు..'అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న తనను నూతన సచివాలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. సేవా ఇంటర్నేషనల్, సీ–20 వర్కింగ్ గ్రూప్, సేవా భారతి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గచ్చిబౌలిలో నిర్వహించిన సీ–20 సమావేశాల కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా

మిగతా 5వ పేజీలో ▶

'సీతారామ'పై సందేహాలు

- దిగువ ప్రాజెక్టులకు నష్టం జరగదని నిర్ధారించాలి
- సీడబ్ల్యూసీకి గోదావరి బోర్డు సూచన
- నీటి లభ్యతపై ఏపీ, తెలంగాణ భిన్న లెక్కలు
- ఆ లభ్యత లెక్కలనూ మించి పోయిన రాష్ట్రాల మొత్తం అవసరాలు

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతలు, సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుల ఉమ్మడి సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీ ఆర్)పై గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) పలు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. ఈ ప్రాజెక్టుతో దిగువన ఉన్న ప్రాజెక్టుల నీటి అవసరాలకు నష్టం జరగదని నిర్ధారించాలని కేంద్ర జల సంఘాన్ని (సీడబ్ల్యూసీ)కోరింది. ప్రధానంగా 141వ టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) ఖరారు చేసిన మేరకు పోలవరం ప్రాజెక్టు వద్ద 561 టీఎంసీల లభ్యతకు రక్షణ కల్పించాలని సూచించింది. ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియలో భాగంగా సీడబ్ల్యూసీ గతంలో డీపీఆర్‌ను గోదావరి బోర్డుకు పంపించింది. బోర్డు ఏమందంటే..



ఏపీ, తెలంగాణ మధ్య సమ్మతి లేదు..

రాష్ట్రాలు, ప్రాజెక్టుల వారీగా గోదావరి ట్రిబ్యునల్ అవార్డులో నీటి కేటాయింపులు జరపలేదు. ఉమ్మడి ఏపీకి

మిగతా 5వ పేజీలో ▶

'నెట్'స్పీడైతే.. బోధన 'వీఆర్' అవుద్ది!

- రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో 'వర్చువల్ రియాలిటీ'ల్యాబ్‌లకు అడ్డంకులు
- 'త్రీడీ' బోధన ప్రవేశపెట్టాలనుకున్న విద్యాశాఖ
- పాఠశాలల్లో పరిస్థితి, వనరులపై అధ్యయనం
- పాత కంప్యూటర్లు, స్లో ఇంటర్నెట్‌తో సమస్య ఉన్నట్టు గుర్తింపు..
- పరిష్కారం లభిస్తే.. విద్యార్థులకు అద్భుతమైన బోధనకు చాన్స్ - 14లో



క్లుప్తంగా...

టీడీపీ హయాంలో అవార్డులు ఎందుకు ఇవ్వలేదు?

అశ్వినీదత్ అప్పుడు బాబును ప్రశ్నించలేదేం?: నట్టి కుమార్



సాక్షి, హైదరాబాద్: 'రౌడీలకు, గూండాలకు అవార్డులు ఇచ్చుకోం డని ఇటీవల ఓ కార్యక్రమంలో అశ్వినీదత్ మాట్లాడటం తగదు. నేను సినిమా ఇండస్ట్రీ వాడిని. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడ్ని. అశ్వినీదత్ పొలిటికల్ మనిషిగా టీడీపీ తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడారు. అందుకే ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నా. టీడీపీ హయాంలో నంది అవార్డులు ఎందుకు ఇవ్వలేదని అప్పటి సీఎం చంద్రబాబును అశ్వినీదత్ ఎందుకు అడగలేదు?' అని నిర్మాత నట్టి కుమార్ ప్రశ్నించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగు సినిమా ఇండస్ట్రీని అగ్ర హీరోలు, నిర్మాతలే రోడ్డున పడేశారన్నారు. 'ఇండస్ట్రీ పెద్దలు అని చెప్పుకునే వాళ్లు టీడీపీ హయాంలో అమరావతిలో భూములు తీసుకున్నది వాస్తవం కాదా? తెలుగుదేశం ప్రభుత్వం రెండేళ్లకు కలిపి ఇచ్చిన నంది అవార్డులపై విమర్శలు వచ్చింది నిజం కాదా?' అని నిలదీశారు. చంద్రబాబు చేసిన తప్పును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయరని స్పష్టం చేశారు. 'తెలంగాణలో ఉంటూ ఆ ప్రభుత్వానికి పన్నులు కడుతున్న ఇండస్ట్రీ పెద్దలు తెలంగాణ ప్రభుత్వాన్ని అవార్డుల గురించి అడిగే దమ్ముందా? సినిమా రంగం విషయంలో పార్టీలకు అతీతంగా వ్యవహరించాలి. విభజన తర్వాత అనేక ప్రైవేట్ అవార్డులతో నంది అవార్డులకు విలువ లేకుండా పోయింది. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ అవార్డులను మరచిపోయాయి. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు, మంత్రులు కూర్చుని దీనిపై అనుకూల నిర్ణయం తీసుకుంటే బావుంటుంది' అని అన్నారు.

రాష్ట్రంలో రెండు రకాల పాలన

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్ రెండు రకాల పాలన సాగిస్తోందని, బయటకు కనిపించే పాలన ఒకటైతే రహస్యంగా సాగే పాలన మరోవైపు ఉందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. రూ.1,200 కోట్లతో నూతన సచివాలయం, రూ.లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు, బతుకమ్మ చీరలు, బందీ అయిన బతుకుల తెలంగాణ ఒక వైపు ఉంటే, మరోవైపు రహస్య జీవోలు, అక్రమ అగ్రిమెంట్లు, లీకేజీలు, అసైన్డ్ భూముల అమ్మకం, బినామీలు, కమీషన్లు, లిక్కర్ ఇసుక మాఫియా మరోవైపు ఉందని ఆయన ఆరోపించారు. గత నాలుగేళ్లుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తామని హామీ నిచ్చి, వెట్టి చాకిరీ చేయించుకుని, ఇపుడు వారి జీవితాలు రోడ్డు పాలు చేశారని మండిపడ్డారు. అందుకే ఈ ప్రభుత్వాన్ని వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం 1974 కింద అరెస్టు చేయాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మెకు బీఎస్పీ మద్దతు ఉంటుందని తెలిపారు.


రైతుల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదు

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



సాక్షి, హైదరాబాద్: రైతుల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. పంట నష్టంపై బండి వ్యాఖ్యలు అర్థరహితం, హాస్యాస్పదమన్నారు. బీఆర్‌ఎస్ ఎల్పీ కార్యాలయంలో బుధవారం బాజిరెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బండి సంజయ్‌కు పిచ్చి లేచింది.. తక్షణమే పిచ్చి ఆస్పత్రిలో చేర్పించాలని బాజిరెడ్డి సూచించారు. పంట నష్టానికి సంబంధించి రూ.151 కోట్లను మంత్రి హరీశ్‌రావు విడుదల చేశారని, కానీ వాట్సాప్ యూనివర్సిటీల్లో అబద్ధాలు ప్రచారం చేస్తూ బీజేపీ పబ్బం గడుపుతోందని మండిపడ్డారు. ఎంపీ గుండు అర్వింద్ కూడా నయా పైసాకు పనికి రాడని బాజిరెడ్డి ధ్వజమెత్తారు. అబద్ధాలు మాట్లాడటం తప్ప అర్వింద్‌కు ఏదీ రాదని ఎద్దేవా చేశారు.

బెదిరింపు కాల్స్ వస్తున్నాయి: రఘునందన్



సాక్షి, హైదరాబాద్: తనకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నందున, ప్రస్తుతం కల్పిస్తున్న పోలీస్ భద్రతను రెట్టింపు చేయాలని బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజాపయోగ అంశాలపై తాను చేస్తున్న విమర్శలు, వ్యాఖ్యలతో గతేడాది నుంచి బెదిరింపు ఫోన్లు వస్తున్నాయన్నారు. పోలీస్‌శాఖలో వాహనాల కొనుగోలు, నిర్వహణ సమాచారం కోరుతూ ఆర్టీఐ కింద రఘునందన్ దరఖాస్తు చేశారు. ఆ వివరాల కోసం బుధవారం ఆయన డీజీపీ ఆఫీస్‌కు వచ్చారు. డీజీపీ అందుబాటులో లేకపోవడంతో శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ జోషిని కలిశారు. ఈ సందర్భంగా తనకు భద్రత పెంచాలని లేఖ అందజేశారు.

దిగ్గజ నేతల ఢీ

సమీపిస్తున్న కర్ణాటక ఎన్నికల తేదీ

- బీదర్ జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల ముమ్మర ప్రచారం
- హోరాహోరీగా తలపడుతున్న సీనియర్లు
- మెజారిటీ స్థానాల్లో బీజేపీ కాంగ్రెస్ నడుమ ముఖాముఖి
- బీదర్ దక్షిణ, ఉత్తర, హుమ్నాబాద్‌లో జేడీఎస్ గట్టి పోటీ
- 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలన

బీదర్ నుంచి కల్వల మల్లికార్జున్ రెడ్డి

ఉత్తర కర్ణాటకలో అంతర్భాగమైన 'హైదరాబాద్ కర్ణాటక'లోని బీదర్ జిల్లాలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. ఈ నెల 10న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. ప్రధాన రాజకీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, జేడీ (ఎస్) నుంచి దిగ్గజ నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వరుస విజయాలు సాధిస్తూ వస్తున్న జేడీ (ఎస్) అభ్యర్థి బందెప్ప కాశెంపూర్ (బీదర్ దక్షిణ), కాంగ్రెస్ అభ్యర్థులు రహీమ్ ఖాన్ (బీదర్ ఉత్తర), ఈశ్వర్ ఖండ్రే (బాల్కి), రాజశేఖర పాటిల్ (హుమ్నాబాద్), బీజేపీ అభ్యర్థి ప్రభు చౌహాన్ (ఔరాద్- ఎస్సీ) నుంచి తమ రాజకీయ అనుభవానికి పదును పెడుతున్నారు. మరోవైపు సూర్యకాంత నాగమరపల్లి (జేడీఎస్- బీదర్ ఉత్తర), విజయ్ సింగ్ (కాంగ్రెస్- బసవకళ్యాణ్), సిద్ధూ పాటిల్ (బీజేపీ- హుమ్నాబాద్), సీఎం ఫైజ్ (జేడీ ఎస్- హుమ్నాబాద్), భీంసేన్‌రావు సింధే (కాంగ్రెస్- ఔరాద్) వంటి కొత్తతరం నేతలు కూడా సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ధీటైన సవాలు విసురుతున్నారు. బీఎస్పీ, ఆమ్ ఆద్మీ, కళ్యాణరాజ్య ప్రగతిపక్ష, కర్ణాటక రాష్ట్ర సమితి వంటి పార్టీలు అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నా ఓటర్లపై పెద్దగా ప్రభావం చూపించక పోవచ్చని 'సాక్షి'క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది.



కాంగ్రెస్‌కు పట్టు ఉన్న బీదర్ ఉత్తర నియోజకవర్గంలో ప్రస్తుతం కాంగ్రెస్, జేడీ (ఎస్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. 2009, 2016 ఉప ఎన్నికలతో పాటు 2018 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన రహీమ్‌ఖాన్ ప్రస్తుత ఎన్నికలోనూ బీదర్ (ఉత్తర) నియోజకవర్గం నుంచి వరుసగా ఐదోసారి బరిలో నిలిచారు.

బీదర్ ఉత్తర

అయితే రెండు పర్యాయాలు బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సూర్యకాంత నాగమరపల్లికి ఈసారి టికెట్ నిరాకరించడంతో చివరి నిమిషంలో జేడీ(ఎస్) నుంచి బరిలోకి దిగారు. ఆర్‌ఎస్‌ఎస్ నుంచి బీజేపీలోకి వచ్చిన ఈశ్వర్ సింగ్ ఠాకూర్‌కు బీజేపీ అభ్యర్థిగా టికెట్ దక్కింది. కాంగ్రెస్‌కు చెందిన శేషి పాటిల్ చాప్లీ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

బీదర్ దక్షిణ

2008, 2018 ఎన్నికల్లో జేడీ (ఎస్) నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ మంత్రి బందెప్ప కాశెంపూర్ మరోమారు అదే పార్టీ నుంచి బరిలోకి దిగారు. బీజేపీ అభ్యర్థిగా వరుసగా రెండుసార్లు పోటీ చేసి ఓడిన డాక్టర్ శైలేంద్ర బెల్దాలే, కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే అశోక్ ఖేనీ పోటీలో ఉన్నారు.

బాల్కీ

కాంగ్రెస్ కంచుకోటగా పేరొందిన బాల్కీలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ నడుమ సాగుతోంది. బాల్కీ నుంచి వరుసగా నాలుగోసారి విజయం కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈశ్వర్ ఖండ్రే పోటీ చేస్తున్నారు. ఈశ్వర్ ఖండ్రే తండ్రి భీమన్న ఖండ్రే 1962, 1967, 1978, 1983లో, సోదరుడు విజయ్ ఖండ్రే 1989, 1994లో గెలుపొందారు. ఇక ఈశ్వర్ ఖండ్రే 2008, 2013, 2018లో వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. గతంలో ఐదుసార్లు ఓటమి పాలైన ప్రకాశ్ ఖండ్రే బీజేపీ నుంచి, రవూఫ్ పటేల్ జేడీ(ఎస్) నుంచి పోటీ చేస్తున్నారు.

ఔరాద్ (ఎస్సీ రిజర్వుడు)

బీజేపీ కంచుకోట ఔరాద్‌లో వరుసగా నాలుగో విజయం కోసం పశు సంవర్ధక శాఖ మంత్రి ప్రభు చౌహాన్ శ్రమిస్తున్నారు. కాంగ్రెస్, జేడీ (ఎస్) పార్టీలు కొత్త ముఖాలను బరిలోకి దింపాయి. విద్యావంతుడైన డాక్టర్ భీంసేన్‌రావ్ సింధే కాంగ్రెస్ నుంచి, జే సింగ్ రాథోడ్ జేడీ (ఎస్) నుంచి బరిలో ఉన్నారు.

బసవకల్యాణ్

బీజేపీ సిట్టింగ్ స్థానమైన బసవకళ్యాణ్‌లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా మాజీ సీఎం ధరమ్‌సింగ్ కుమారుడు, స్థానికేతరుడైన విజయ్ సింగ్‌ను బరిలోకి దించింది. 2018లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన బి.నారాయణరావు కరోనాతో మరణించడంతో 2021లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేసిన శరణు సలగర గెలుపొందారు. ప్రస్తుతం శరణు సలగర మరోమారు బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. రిటైర్డ్ ఆర్టీవో సంజయ్ వడేకర్ జేడీ (ఎస్) నుంచి పోటీ చేస్తున్నారు.

ఫలితాలను శాసించేది డబ్బే

పార్టీల కంటే వ్యక్తుల మీద ఆధారపడే ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ధన ప్రభావం బాగా పెరిగినట్లు కనిపిస్తోంది. రైతులు, పేదలకు మేలు చేసే ఉచిత పథకాలు పెద్దగా లేవు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో రైతులు అసంతృప్తితో ఉన్నారు.

– శ్రీనివాస్ భురే, ఆనంద్‌వాడీ, బాల్కీ

హుమ్నాబాద్

కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న హుమ్నాబాద్‌లో కాంగ్రెస్, బీజేపీ, జేడీ (ఎస్) నడుమ త్రిముఖ పోటీ నెలకొంది. 2013 ఉప ఎన్నికతో పాటు 2008, 2013, 2018లో వరుస విజయాలు సాధించిన మాజీ మంత్రి రాజశేఖర పాటిల్ మరోమారు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి వరుస ఓటములు పొందుతూ వచ్చిన సుభాష్ కల్లూర్ స్థానంలో తొలిసారిగా సిద్ధూపాటిల్ పోటీ చేస్తున్నారు. జేడీ (ఎస్) కర్ణాటక శాఖ అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి సీఎం ఇబ్రహీం కుమారుడు సీఎం ఫైజ్ జేడీ (ఎస్) అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

నియోజకవర్గం	బసవకళ్యాణ్	హుమ్నాబాద్	బీదర్ దక్షిణ	బీదర్	బాల్కీ	ఔరాద్ (ఎస్సీ)
ఓటర్లు	2,46,379	2,45,846	2,05,093	2,27,920	2,30,721	2,19,210
బరిలో ఉన్న అభ్యర్థులు	10	07	10	11	13	12

పంట నష్టం సర్వే గడువు పెంపు

- ఈనెల 12 వరకు నమోదు
- 32 అంశాలతో నష్టం వివరాల సేకరణ

సాక్షి, హైదరాబాద్: ఇటీవల వర్షాలు నిత్యం పడుతుండటం, రోజురోజుకూ పంట నష్టం పెరుగుతున్న నేపథ్యంలో దెబ్బతిన్న పంటల సర్వే గడువును రాష్ట్ర వ్యవసాయ శాఖ పొడిగించింది. ఈ నెల ఒకటో తేదీ వరకే సర్వే నివేదిక పంపించాలని తొలుత వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి క్షేత్రస్థాయికి ఆదేశాలు ఇచ్చారు. అయితే రానున్న రోజుల్లో వడగళ్లు, మరిన్ని అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పంట నష్టం సర్వే గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించారు. ఏఈవోలు పంటల వారీగా, సర్వే నంబర్లు, క్లస్టర్ల వారీగా పంట నష్టాన్ని అంచనా వేసి ఈనెల 12 వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కమిషనర్ రఘునందన్ రావు ఆదేశాలు జారీచేశారు. సమాచారం మొత్తం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా మండలాలు, డివిజన్లు, జిల్లాలవారీగా పంట నష్టం వివరాలను పరిశీలించి మొత్తంగా జరిగిన నష్టం వివరాలను తేల్చనున్నారు.

33 శాతం నష్టం జరిగితేనే నమోదు..

పంట నష్టం వివరాలను 32 అంశాలతో ఏఈవోలు సేకరిస్తున్నారు. సంబంధిత క్లస్టర్‌లో నష్టపోయిన రైతుల పేర్లు, సర్వే నంబర్లు, సాగుచేసిన పంటల వివరాలు, బాధిత రైతుకు సంబంధించిన బ్యాంకు అకౌంట్ల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. పంట నష్టంపై అంచనాకు గతంలో చేసిన క్రాప్ బుకింగ్ పోర్టల్ లెక్కలనే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఏ రైతు, ఏ సర్వే నంబరులో ఏ పంట వేశారనే వివరాలు క్రాప్ బుకింగ్‌లో నమోదై ఉంటేనే నష్టపరిహారం జాబితాలో రాస్తున్నారు. అలాగే 33 శాతానికి మించి పంట నష్టం జరిగితేనే పరిగణనలోకి తీసుకుంటున్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

అకాల వర్షాలపై పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలతో తడిచిన ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేస్తుందని ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆ సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ హామీనిచ్చారు. అకాల వర్షాలపై ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులు, ధాన్యం కొనుగోళ్లపై చైర్మన్ బుధవారం పౌరసరఫరాల భవన్‌లో అధికారులతో సమీక్షించారు. ధాన్యం కొనుగోలు, తరలింపు, తడిచిన ధాన్యం, గన్నీ సంచులు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు 1967, 180042 500333 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏటా మునక! ముందే ఏరువాక?

▶ మొదటి పేజీ తరువాయి

తప్పుతుందని సీఎం కేసీఆర్ సూచించడం గమనార్హం. అయితే సీజన్లను ముందుకు జరిపితే వచ్చే లాభనష్టాలపై నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇబ్బందికరమని కొందరు చెప్తుంటే.. ప్రత్యామ్నాయ వంగడాలను వాడటం వంటివి మేలని మరికొందరు సూచిస్తున్నారు.

మే చివరిలోనే సాగు మొదలైతే..

రాష్ట్రంలో నీటి వనరులు, భూగర్భ జలాలు పెరగడం వరి సాగుకు సానుకూలంగా మారిందని.. ఏటా మే నెలాఖరు, జూన్ తొలివారంలో వానాకాలం వరి సాగు మొదలయ్యేలా చూడాలని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల సెప్టెంబర్ చివర, అక్టోబర్ ప్రారంభానికల్లా వరి చేతికి వస్తుందని.. అక్టోబర్‌లో వచ్చే అకాల వర్షాల ప్రభావం నుంచి బయటపడొచ్చని అంటున్నారు. ఇక వానాకాలం వరి కోతలు పూర్తికాగానే, అక్టోబర్ తొలివారంలోనే యాసంగి సాగు ప్రారంభిస్తే.. ఫిబ్రవరి నెలాఖరు, మార్చి తొలివారం నాటికే పంట చేతికొచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. మార్చి మధ్య నుంచి అకాల వర్షాల ప్రభావం నుంచి తప్పించుకోవచ్చని పేర్కొంటున్నారు. ఈ మేరకు రైతులను సమాయత్తం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నాట్లు వేసే విధానానికి బదులు నేరుగా ధాన్యం వెదజల్లే పద్ధతి పాటించడంపై రైతుల్లో అవగాహన పెంచాలని నిర్ణయించారు.

క్లిష్టమైన వ్యవహారం!

- వానాకాలం సీజన్‌లో నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో జూన్ 15 నుంచి జూలై 15 వరకు నాట్లు వేస్తారు. నీటి వసతి లేని ప్రాంతాల్లో ఆగస్టు 15 వరకు కూడా నాట్లు కొనసాగుతాయి. జూన్–జూలైలో వేసిన పంట నవంబర్ చివరికి చేతికొస్తుంది. ఆగస్టులో వేసేవి డిసెంబర్‌కు చేతికొస్తాయి. వానాకాలం పంటలు కోశాక 20 రోజులు ఆరబెట్టాల్సి ఉంటుంది. ఇక యాసంగి సీజన్‌లో నవంబర్ 15 నుంచి నాట్లు వేయాలి. కానీ వానాకాలం పంట ఆలస్యం వల్ల యాసంగి ఆలస్యం అవుతోంది. డిసెంబర్, జనవరిలో కూడా నాట్లు వేస్తున్నారు. దీనివల్ల ఏప్రిల్, మే వరకు పంటలు చేతికి రావట్లేదు.
- మొత్తంగా నీటి వసతి, కాల్వల నుంచి విడుదల, వరి వంగడాల్లో రకాలు, మార్కెటింగ్ వంటి సమస్యలు ఉన్నాయి. ఈ పరిస్థితులే పంటలు చేతికి వచ్చే కాలాన్ని నిర్దేశిస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు.
- ఉదాహరణకు నల్లగొండ జిల్లా రైతులకు ఆగస్టులో కాల్వల నుంచి నీళ్లు విడుదల చేస్తారు. అదే నిజామాబాద్ రైతులకు జూన్, జూలై నెలల్లోనే నీళ్లు అందుతాయి. దీనివల్ల రాష్ట్రంలో ఒక్కోచోట ఒక్కో సమయంలో వరి చేతికి వస్తుంది.
- నిజామాబాద్ జిల్లాలో అనేక చోట్ల మేలోనే నారు పోస్తారు. కొన్నిచోట్ల ఆ నెల చివరి నాటికే నాట్లు కూడా వేస్తారు. ఇదే పరిస్థితి ఇతర జిల్లాల్లో ఉండదు.

ప్రాంతాలనుబట్టి వరి రకాలు వేసుకోవాలి

మార్చిలోగా వరి కోతలు పూర్తికావాలంటున్నారు. మార్చిలో కూడా వడగళ్ల వర్షాలు పడుతున్నాయి కదా.. దీనికి వరిలో అన్ని రకాల కాలాలను తట్టుకొనే దేశీ రకాలను వేయడమే పరిష్కారం. అదికూడా స్థానిక వాతావరణ పరిస్థితులను తట్టుకొనే వరి రకాలు వేసుకోవాలి. జిల్లా, మండలాల వారీగా నిర్ణయం జరగాలి. ఆ ప్రకారం రైతులను సిద్ధం చేయాలి. దేశీ రకాల్లో మొక్క గట్టిగా ఉంటుంది. భారీ వర్షం, వడగళ్లు పడినప్పుడు పంట నేలకొరిగినా మళ్లీ నిలబడుతుంది. వడగళ్లు, ఈదురుగాలులకు గింజలు రాలవు. హైబ్రిడ్ రకంలో మొక్క బలహీనంగా ఉంటుంది. సహజ వ్యవసాయం, దేశీ వరి రకాలు వేస్తే ఖర్చు తక్కువ వస్తుంది. దేశంలో 300–400 దేశీ వరి రకాలు ఉన్నాయి. దిగుబడి ఎక్కువ వస్తుంది. రైతులకు అవగాహన కల్పించకపోవడం వల్ల వీటి గురించి తెలియడంలేదు. తమిళనాడులో ఒక రైతు దేశీ రకం వరి వేస్తూ అక్కడి వ్యవసాయ వర్సిటీలో బోధన చేస్తున్నాడు. ఇక వెదజల్లే పద్ధతికి సంబంధించి జర్మినేషన్‌పై అనుమానాలు ఉన్నందున దానిపై రైతులు ఆసక్తి చూపరు. ప్రాంతాన్నిబట్టి ఒక్కో రకం వరి వేసుకోవాలి. గంపగుత్తగా ఒకే సమయంలో వేసుకోవాలని చెప్పడం సరికాదు.

– డి.నర్సింహారెడ్డి, జాతీయ వ్యవసాయ నిపుణుడు

ముందస్తు సీజన్లు సాధ్యంకాదు

సంక్రాంతికి అంటే జనవరి 15 సమయంలో యాసంగి పంట వేస్తారు. మార్చి చివరికి అంటే 120 రోజుల్లో పంట చేతికి వస్తుంది. డిసెంబర్‌లో చలి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి అప్పుడు నారు పెరగదు. మొక్క పెరగదు. అప్పుడు వరి వేయకూడదని రైతులకు చెప్పాలి. పైగా తెలంగాణ పీఠభూమి. పీఠభూమి మీద క్యుములోనింబస్ మేఘాల కారణంగా వడగళ్ల వర్షాలు పడతాయి. రైతులు జనవరి 15కు ముందు యాసంగి నారు వేయరు. అంతేకాదు ఫిబ్రవరిలోనూ రాళ్ల వర్షం వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. తర్వాత మార్చి, ఏప్రిల్ నెలల్లోనూ వస్తాయి. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. అంతేతప్ప ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటే రైతులు నష్టపోతారు.

– సారంపల్లి మల్లారెడ్డి, రైతు సంఘం జాతీయ నాయకుడు

తెలంగాణ అత్యుత్తమ గమ్యస్థానం

- టెక్నాలజీ, తయారీ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి
- స్వీడన్ కంపెనీలకు మంత్రి కేటీఆర్ ఆహ్వానం



స్వీడన్ రాయబారి జాన్ తెస్లెఫ్‌ను సత్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్ రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే స్వీడన్ కంపెనీలకు తెలంగాణ అత్యుత్తమ గమ్యస్థానం అని పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. తెలంగాణలో పెట్టుబడి పెట్టే స్వీడన్ కంపెనీలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. భారత్‌లోని స్వీడన్ రాయబారి జాన్ తెస్లెఫ్ ఆధ్వర్యంలో ఆ దేశ వ్యాపార, వాణిజ్య ప్రతినిధులు, పలు కంపెనీల అధిపతులతో బుధవారం సచివాలయంలో మంత్రి కేటీఆర్ సమావేశం అయ్యారు. రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, ప్రభుత్వ ఆలోచన విధానాన్ని తెలియజేశారు. పెట్టుబడి అవకాశాల గురించి వివరించారు. టెక్నాలజీ, తయారీ రంగాల్లో స్వీడన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని కోరారు. దేశంలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్న కంపెనీలను తెలంగాణకు కేటీఆర్ ఆహ్వానించారు. స్వీడన్ రాయబారితో కలిసి వచ్చిన ఆ దేశానికి చెందిన కంపెనీల ప్రతినిధులు హైదరాబాద్‌లో తమ సంస్థల కార్యకలాపాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా పారిశ్రామిక అనుకూల ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు. ఎనిమిదేళ్ల కాలంలో హైదరాబాద్ నగరం రూపురేఖలు సంపూర్ణంగా మార్చేలా తీసుకువచ్చిన మౌలిక వసతుల కల్పన విధానాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. హైదరాబాద్ నగరంలో ఉన్న వ్యాపార అనుకూల వాతావరణం ఆధారంగా తెలంగాణకు మరిన్ని పెట్టుబడులను రప్పించేందుకు ప్రయత్నం చేస్తానని స్వీడన్ రాయబారి జాన్ తెస్లెఫ్ హామీ ఇచ్చారు. భారత్‌లో పెట్టుబడులకు ముందుకొచ్చే కంపెనీల బృందంతో కలిసి పనిచేసేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటేషన్ మెకానిజం పేరుతో తాము ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ఇది స్వీడన్ వ్యాపార వాణిజ్య సంస్థలతో పాటు పలు కంపెనీలతోనూ కలిసి పని చేస్తుందన్నారు. తెలంగాణలో పెట్టుబడి అవకాశాలను తమ కార్యాలయం పరిశీలిస్తుందని తెలిపారు.

నిజమైన రైతు నాయకుడు.. సీఎం కేసీఆర్

మంత్రి హరీశ్‌రావు



మార్కెట్ యార్డులో మహిళా రైతుతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: రైతుల కోసం సకాలంలో ఎరువులు, కరెంట్, సాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని, దేశంలోనే ఆయన నిజమైన రైతు నాయకుడు అని మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. బుధవారం ఆయన సిద్దిపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు అన్ని రకాల సబ్సిడీలు ఇస్తోందని, ఇందు కోసం బడ్జెట్‌లో రూ1,000 కోట్లు కేటాయించామని చెప్పారు. అకాల వర్షాల వల్ల చేతికొచ్చిన వరి పంట తడిసిపోతున్న నేపథ్యంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని గింజ కూడా మిగలకుండా సేకరిస్తామని అన్నారు. సీఎం కేసీఆర్ దీనిపై భరోసా ఇచ్చారని తెలిపారు. తెలంగాణ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టి మన గౌరవాన్ని ముఖ్యమంత్రి పెంచారని పేర్కొన్నారు.

ఇప్పటికైనా పాపపరిహారం చేసుకోండి

- నష్టపోయిన రైతులను ఆదుకోండి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్
- రైతుబంధు ఇచ్చి.. సబ్సిడీలన్నీ ఎత్తి వేశారని విమర్శ... కేసీఆర్‌కు కౌంట్ డౌన్ మొదలైందని ధ్వజం



ఎల్లారెడ్డిపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న బండి సంజయ్

సిరిసిల్ల, హైదరాబాద్: కొత్త సచివాలయంలోనైనా రైతులకు సాయం చేసి పాప పరిహారం చేసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో పంటనష్టాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ రైతుబంధు ఒక్కటి ఇచ్చి అన్ని సబ్సిడీలను బంద్ చేశాడని విమర్శించారు. రైతుల రుణమాఫీ చేయలే.. పంటకు బోనస్ ఇవ్వలే.. పంట బీమాపథకం కూడా ఏమైందో తెలియదన్నారు. కనీసం ముందుగా కొనుగోళ్లు ప్రారంభిస్తే 30 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యేవని చెప్పారు. ఇది లీకేజీల ప్రభుత్వమని.. రూ.1600 కోట్లతో కడుతున్న కొత్త సచివాలయం లీక్ అవుతోందని, చివరికి గ్రూప్–1 పరీక్షలూ లీకేజీనే అని విమర్శించారు.

రెగ్యులరైజ్ చేయాలని సీఎంకు లేఖ

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ మాట తప్పారని, ఆయనకు కౌంట్ డౌన్ మొదలైందని బండి సంజయ్ హెచ్చరించారు. తంగళ్లపల్లిలో దీక్షలు చేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌ల శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. కార్యదర్శుల డిమాండ్ నెరవేర్చాలని సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు.

ఔటర్ లీజుపై రాష్ట్రపతికి లేఖ

- ఏజెన్సీకి అప్పగించడాన్ని కోర్టులో సవాల్ చేస్తాం
- 30 ఏళ్ల పన్నులు ఒకేసారి తీసుకుంటే రాబోయే ప్రభుత్వాలేంచేయాలి
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



దాతరుపల్లిలో మిరపకాయ బజ్జీలు వేస్తున్న భట్టి విక్రమార్క

సాక్షి, యాదాద్రి: రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడాన్ని కట్టడి చేయాలని కోరుతూ రాష్ట్రపతికి లేఖ రాస్తామని, కోర్టుకు కూడా వెళ్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చెప్పారు. నాలుగు నెలల్లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఓఆర్‌ఆర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించి 30 ఏళ్ల పన్నులను ఒకేసారి తీసుకుంటే రాష్ట్ర భవిష్యత్తు ఏం కావాలి? రాబోయే ప్రభుత్వాలు ఏం చేయాలని ప్రశ్నించారు. దీనిపై మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భట్టి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగుతోంది. బుధవారం ఆయన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. యాదగిరిగుట్టలో ఆటో కార్మికుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అనంతరం యాదగిరిగుట్ట మండలం గొల్లగుడెసెలు, దాతరుపల్లి గ్రామాల మీదుగా యాత్ర భువనగిరి నియోజకవర్గంలోకి ప్రవేశించింది. బస్వాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న నృసింహ సాగర్ రిజర్వాయర్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల సమస్యలను ఆలకించారు. రిజర్వాయర్ కట్టపై మీడియాతో మాట్లాడుతూ ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా ఎకరానికి రూ.50–60 లక్షల ధర ఉంటుందని పేర్కొన్న సీఎం కేసీఆర్.. ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.15 లక్షల చొప్పున పరిహారం ఎట్లా ఇస్తారని నిలదీశారు. భూసేకరణ చట్టం ప్రకారం ఎకరానికి కోటిన్నర పరిహారం ఇవ్వాలన్నారు.

వచ్చే రెండ్రోజుల్లో మోస్తరు వర్షాలు

బంగాళాఖాతంలో త్వరలో తుపాను వచ్చే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఆగ్నేయ బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈనెల 7న ఇదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఇది క్రమంగా బలపడి ఈ నెల 8న తీవ్ర అల్పపీడనంగా ఆపై 8న వాయుగుండంగా మారే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. ఆ వాయుగుండం మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి ఉత్తర దిశగా పయనిస్తూ తుపానుగా మారే అవకాశం ఉందని బుధవారం వెల్లడించింది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు తెలంగాణవ్యాప్తంగా అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరోవైపు రానున్న రెండ్రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని పేర్కొంది.

ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కేంద్రం	గరిష్టం
నల్లగొండ	34.5	హనుమకొండ	32.5
భద్రాచలం	34.2	హకీంపేట్	32.4
మెదక్	33.8	దుండిగల్	32.4
ఖమ్మం	33.6	హైదరాబాద్	32.4
నిజామాబాద్	33.3	మహబూబ్‌నగర్	32.0
రామగుండం	32.8	ఆదిలాబాద్	30.5

JEE (MAIN) 2023లో

నిరంతరం ఛాంపియన్లను తయారు చేస్తున్న ఏకైక సంస్థ

Aakash + BYJU'S

Name	Course	AIR	Percentile
Dhruv Sanjay Jain	4 Year Classroom	8	100 (100 Percentile in Physics & Maths)
Kamyak Channa	4 Year Classroom	21	100 (100 Percentile in Maths)
Anoop Singh	4 Year Classroom	46	99.99 (100 Percentile in Physics & Chemistry)
Aakarsh D Reja	4 Year Classroom	64	99.99 (100 Percentile in Chemistry)
Nikhilesh Joshi	4 Year Classroom	89	99.99 (100 Percentile in Maths)

12918# Aakashians Qualified for **JEE (ADV.) 2023**

(11473 Classroom + 1445 Distance & Digital)

#Still Counting

974* 99 Percentile & above

11* in Top 100 AIR (All India Rank)

45* in Top 500 AIR (All India Rank)

*Including Students from Classroom, Digital & DLP Courses across all Categories

Top Performers from Our Classroom Programs

Name	Course	AIR	Percentile
Aditya Neeraje	2 Year Classroom	125	99.99
Mozeel Vanwani	1 Year Classroom	127	99.99 (100 Percentile in Physics)
Adit Jindal	4 Year Classroom	130	99.99 (100 Percentile in Physics)
Tanishq M	4 Year Classroom	165	99.99 (100 Percentile in Maths)
Shivanshu Kumar	4 Year Classroom	167	99.99 (100 Percentile in Physics)
Aritra Ray	4 Year Classroom	178	99.99
Amritanshu Singh	2 Year Classroom	199	99.98
Shreyansh Solanki	4 Year Classroom	203	99.98 (100 Percentile in Physics)
Vaibhav Raj	4 Year Classroom	209	99.98
Kundan Maiti	2 Year Classroom	221	99.98
Shiv Narang	4 Year Classroom	229	99.98 (100 Percentile in Physics)
Priyanka Sar (Odisha Topper)	2 Year Classroom	243	99.98 (100 Percentile in Physics & Maths)
Md Sahil Akhtar	4 Year Classroom	261	99.98 (100 Percentile in Maths)
Aman Maloo	1 Year Classroom	264	99.98
Amber Agarwal	2 Year Classroom	274	99.98
V Mithun	4 Year Classroom	279	99.98 (100 Percentile in Maths)
Raktim Kundu	2 Year Classroom	299	99.98 (100 Percentile in Physics)

JEE అడ్వాన్స్‌డ్‌లో స్థిరమైన ఫలితాలను అందించడం మా ప్రాముఖ్యత

AIR 1 — Chirag Falor, 4 Year Classroom (2020, MIT, USA); Tanishka Kabra, 4 Year Classroom (Female Category 2022, IIT Bombay)

Scan code to check all the ranks & hear what the toppers have to say

Though every care has been taken to publish the result correctly, yet Aakash Educational Services Ltd. shall not be responsible for inadvertent error, if any.

and many more top performers across 300+ Branches in India

అత్యుత్తమ ప్రదర్శన చూపిన మన దక్షిణ భారత విద్యార్థులు

Name	Course	AIR	Percentile
Nikhilesh Joshi	4 Year Classroom	89	99.99 (100 Percentile Mathematics)
Aditya Neeraje	2 Year Classroom	125	99.99
Vaibhav Raj	4 Year Classroom	209	99.98

Topper Aakash Telangana: Gunje Manideep Ram, 4 Year Classroom — AIR 527, 99.96 Percentile

తెలంగాణ క్లాస్‌రూమ్ ప్రోగ్రామ్‌ల నుండి టాపర్స్

Name	Course	AIR	Percentile
Poorvie Sadagopan	2 Year Classroom	532	99.96
Sivapuram Siddharth	4 Year Classroom	659	99.95
B Siddaarth	4 Year Classroom	734	99.94

and many more...

అడ్మిషన్లు జరుగుచున్నవి

- CLASS 12th Appeared / Passed Students — Long Term Batch for NEET / JEE 2024
- CLASS 8th-10th Studying Students — Integrated Courses* for NTSE / Olympiad / School Boards
- CLASS 10th Moving to Class 11th — 2 Year Integrated Courses for NEET / JEE / EAMCET
- CLASS 12th Studying Students — 1 Year Integrated Courses for NEET / JEE / EAMCET

* Please Contact the nearest Branch for more details...

90% వరకు స్కాలర్‌షిప్ పొందండి*

iacst.aakash.ac.in

12 Branches in Telangana

HYDERABAD
(Himayat Nagar): 8800013001
(Kondapur): 8800897955
(Kothapet): 8800013004
(Kukatpally): 8800013003
(Shaikpet): 8800013006
(S R Nagar): 8800013002
(Trimulgherry): 8800013009
KARIMNAGAR: 8800013007
WARANGAL: 8800013016
NIZAMABAD: 8800857521

Aakash BYJU'S Information Centre: Mancherial: 9100078157.

Scan code to locate the nearest branch

Two more Aakash BYJU'S Branches in Hyderabad now Suchitra: 8800948902 & Habsiguda: 8800950201

Andhra Pradesh Branches: Kadapa: 8800898028, Kakinada: 8800789546, Kurnool: 8800013008, Nellore: 8800012982, Rajahmundry: 8800012983, Tirupati: 8800013010, Vijayawada: 8800013015, VISAKHAPATNAM: Dwarka Nagar: 8800013011, Gajuwaka: 8800013012, Madhurawada: 8800548130. Aakash BYJU'S Branch now in Guntur: 8800971868. Aakash BYJU'S Information Centre: Vizianagaram: 8448799006

Download Aakash App — Google Play | App Store

CALL (TOLL-FREE) 1800-102-2727

VISIT aakash.ac.in

Aakash + BYJU'S



అతి వేగంగా ఖర్చు పెట్టేవాళ్లు ఎప్పటికీ ధనవంతులుగా మారలేరు.
– హానొరే డె బాల్జాక్

సాక్షి
గురువారం, 4 మే 2023

మహా చాణక్యం

అన్నట్టే అయింది. పదిహేను రోజుల్లో రెండు రాజకీయ ప్రకంపనలు సంభవిస్తాయని జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ కుమార్తె – ఎంపీ అయిన సుప్రియా సులే రెండు వారాల క్రితం అన్నట్టే మొదటి ప్రకంపన మంగళవారం ఎదురైంది. రాజకీయ కురువృద్ధుడూ, 24 ఏళ్ళుగా ఎన్సీపీకి పెద్ద దిక్కూ అయిన శరద్ పవార్ తన సొంత పార్టీ అధ్యక్ష పదవి నుంచి వైదొలగుతున్నట్టు రాజకీయ బాంబు పేల్చారు. చుట్టూ పార్టీ నేతలు ఉండగా, ఆత్మకథ రెండో ముద్రణ ఆవిష్కరణ వేదికగా శరద్ చేసిన ఆకస్మిక ప్రకటన కొందరిని కన్నీరు పెట్టించింది. మనసు మార్చుకొమ్మంటూ మరికొందరు ప్రాథేయపడేలా చేసింది. అనేక నాటకీయ పరిణామాల మధ్య కొద్ది గంటల వ్యవధిలోనే పునరాలోచనకు తనకు రెండు, మూడు రోజుల సమయం కావాలని శరద్ అంగీకరించేలా చేసింది. అనూహ్య నిర్ణయాలతో అవతలివారిని ఆత్మరక్షణలో పడేయడంలో ఆరితేరిన ఈ అపర చాణక్యుడి తాజా నిర్ణయానికి కారణాలు, పర్యవసానాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. జాతీయస్థాయి ప్రతిపాదిత ప్రతిపక్ష కూటమిలోనూ మల్లగుల్లాలు సాగుతున్నాయి.

అయిదున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న 82 ఏళ్ళ శరద్ భావోద్వేగాలతో నిర్ణయాలు తీసుకొనే రకం కాదు. ఆలోచన నిండిన ఆచరణవాది. అందుకే, ఆయన తాజా ఎత్తుగడ ఆసక్తికరం. నాలుగు విడతల మాజీ డిప్యూటీ సీఎం, శరద్ అన్న కుమారుడైన అజిత్ పవార్ సీఎం పదవిపై కన్నేశారనీ, చివరకు బీజేపీ అండతో కోరిక నెరవేర్చుకునేలా పావులు కదుపుతున్నారనీ కొన్ని వారాలుగా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పైకి ఆ వాదనను అజిత్ సహా అందరూ కొట్టిపారేసినా, శరద్ హఠాత్ ప్రకటనతో ఒక్కొక్క పొర తొలగిపోతోంది. ఆ మధ్య ఎన్సీపీ ఎమ్మెల్యేలు బీజేపీతో జట్టు కట్టనున్నారని తెలిసిన వెంటనే శరద్ అదేమీ పట్టనట్టుగా దర్యాప్తు సంస్థల సమన్లను ఎదుర్కొనలేనివారు పార్టీ వదలిపోవచ్చంటూ ముందరి కాళ్ళకు బంధం వేశారు. తాజాగా పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా ద్వారా, ఒకరకంగా బీజేపీ అండతో అజిత్ సీఎం పీఠాన్ని అధిష్ఠించడానికి మార్గం సుగమం చేస్తూనే, కార్యకర్తలపై పట్టు బిగించారు.

నిజానికి, ఉద్ధవ్ ఠాక్రే, ఏక్నాథ్ శిందేల మధ్య శివసేన రెండుగా చీలి, కథ కోర్టుకెక్కిన 'సేన వర్సెస్ సేన' కేసులో సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగ ధర్మాసనం ఏ క్షణంలోనైనా తీర్పు ప్రకటించవచ్చు. వచ్చే తీర్పును బట్టి ఏం జరగవచ్చు, అప్పుడేం చేయాలని రాజకీయ పార్టీలన్నీ ఇప్పటికే లెక్కలు వేసుకుంటున్నాయి. ఉద్ధవ్పై తిరుగుబాటు చేసి, ముందుగా జట్టు కట్టిన ఏక్నాథ్ సహా 16 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటును సుప్రీం సమర్థిస్తే, సమీకరణాలు మారతాయి. ఆ పరిస్థితుల్లో సీఎం ఏక్నాథ్ అనర్హుడవడంతో పాటు ప్రస్తుత బీజేపీ – ఏక్నాథ్ శిందే ప్రభుత్వం మైనారిటీలో పడిపోతుంది. అప్పుడిక కొత్త మిత్రపక్షంగా అజిత్ను కలుపుకోవాలన్నది బీజేపీ వ్యూహం. దానికి తగ్గట్టే ఎన్సీపీని చీల్చి, శరద్కు రాజకీయ వారసుడిగా బీజేపీతో అజిత్ చేతులు కలుపుతారని గుప్పుమంది. అనివార్యతను అర్థం చేసుకున్న శరద్ గతంలో ఎన్టీఆర్, ములాయమ్ సింగ్ల లాగా వారసత్వ పోరులో బలికావడం ఇష్టం లేక వ్యూహాత్మకంగా రాజీనామా అస్త్రం సంధించినట్టుంది.

శరద్ రాజీనామాపై ఇతరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నప్పటికీ, వయసు, ఆరోగ్యరీత్యా శరద్ నిర్ణయాన్ని గౌరవించాలనీ, ఆయన రాజీనామాను వెనక్కి తీసుకోరనీ భవిష్యత్తు గురించి మాట్లాడుతున్నది ఒక్క అజితే. దీన్నిబట్టి సూక్ష్మం గ్రహించవచ్చు. రక్తసంబంధీకులతో శరద్ తన నిర్ణయాన్ని ముందే చర్చించారట. బాబాయ్ ప్రకటన తర్వాతా తొణకని, బెణకని అబ్బాయ్ అజిత్ అందరిలా రాజీనామా ఉపసంహరణకు అభ్యర్థించకపోగా, 'ఏదో ఒకరోజు ఇది జరగాల్సిందేగా' అనడం పవర్ పాలిటిక్స్కు పరాకాష్ఠ. సీఎం కావాలన్న అజిత్ ఆశతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐలను కీలుబొమ్మలుగా ఆడిస్తూ, ప్రత్యర్థులను వేధించే బీజేపీ ఘనచరితా దీనికి కారణమే. దర్యాప్తు సంస్థలు వెంటాడుతున్న ఎన్సీపీ నేతలు ప్రఫుల్ పటేల్ వగైరా సైతం శరద్తో అనివార్యత చర్చించి, ఒప్పించారట. ఎమ్మెల్యేలు బీజేపీతో నెయ్యానికి తొందరపడుతున్న వేళ ఈ సుదీర్ఘ లౌకిక రాజకీయవాది పార్టీని కాపాడుకుంటూనే, తన చేతికి మరక అంటని రీతిలో తాజా వ్యూహానికి తెర తీశారు.

మిగిలిన మూడేళ్ళ రాజ్యసభ సభ్యత్వంలోనూ బాధ్యతలేమీ తీసుకోకుండా, దేశం కోసం, మహారాష్ట్ర కోసం పనిచేస్తానని శరద్ ఉద్ఘాటించారు. అంటే, రేపు ఒకవేళ అజిత్ సారథ్యంలో ఎన్సీపీ కాషాయపార్టీతో అంటకాగినా పార్టీ వైఖరికి తాను కట్టుబడట్లేదని అనేందుకు ఆత్మరక్షణ సిద్ధం చేసుకున్నారు. ప్రతిపక్షాలేవీ తనను తప్పుబట్టే వీలు లేకుండా చూసుకున్నారు. పార్టీ అధినేత ఎంపిక బాధ్యతను పైకి 15 మంది సభ్యుల కమిటీకి అప్పగించినా, ఢిల్లీలో చక్రం తిప్పుతున్న కుమార్తె సుప్రియకు పార్టీ అధ్యక్ష బాధ్యతలు, సీఎం అభ్యర్థిగా అజిత్కు మహారాష్ట్ర కిరీటం కట్టబెడతారని కథనం. శరద్ రాజీనామాతో ఇప్పటికే పార్టీ జాతీయ కార్యదర్శి సహా పలువురు పక్కకు తప్పుకున్నారు. ఈ పరిణామాలతో ఎన్సీపీకి, మహారాష్ట్రలో మహావికాస్ ఆఘాడీ కూటమికి జరిగే నష్టం మాటేమో కానీ జాతీయస్థాయిలో కాంగ్రెస్కే మరింత కష్టం, నష్టం. ప్రతిపక్ష ఐక్యతపైనా, మాజీ కాంగ్రెస్ వాది శరద్ వ్యూహరచనపైనా హస్తం పార్టీ ఆశలు నీరుగారతాయి. 2024 ఎన్నికల వేళ బీజేపీకి ఇది లాభదాయకమే. అయితే, అజిత్కు దోవ ఇస్తున్నట్టు ఇస్తూనే, పార్టీపై పట్టు చూపుతున్న శరద్ పవార్ అంత తొందరగా కాడి కింద పడేస్తారా? ఇంతకీ, ముందుగానే జోస్యం చెప్పిన సుప్రియ పేర్కొన్న ఆ రెండో ప్రకంపన ఏమిటి? వేచి చూడాల్సిందే.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.10.55 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** చిత్త రా.9.02 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.2.43 నుండి 4.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.41 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** ప.2.18 నుండి 3.57 వరకు.

సూర్యోదయం : 5.37
సూర్యాస్తమయం : 6.15
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

అంతరిక్ష పరిశోధనలో నవ శకం

శాస్త్ర పరిశోధనల రంగంలో భారత్ గొప్ప ముందడుగు వేసింది. 'లిగో–ఇండియా' ఏర్పాటు సైన్స్ చరిత్రలో ఓ సువర్ణాధ్యాయం. విశాల విశ్వం మొత్తం పరచుకుని ఉన్న గురుత్వ తరంగాలను నేరుగా గుర్తించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. అమెరికా సహకారంతో మహారాష్ట్రలో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టు 2030 కల్లా పనులు ప్రారంభించవచ్చు. ఇప్పటివరకూ విశ్వాన్ని కేవలం విద్యుదయస్కాంత తరంగాల దృష్టిలోనే చూసేవారు. గురుత్వ తరంగాలకు న్యూట్రినోలు, ఖగోళ కిరణాలు కూడా తోడయితే అంతరిక్షంలో జరిగే సంఘటనలను భిన్న రీతుల్లో పరిశీలించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఎక్కడో కోటానుకోట్ల కిలోమీటర్ల దూరంలోని న్యూట్రాన్ స్టార్లు, కృష్ణబిలాలకు సంబంధించిన గురుత్వ తరంగ ఘటనలను కూడా పరిశీలించవచ్చు. విశ్వ రహస్యాల ఛేదనలో ఇదొక అద్భుతమైన ప్రయత్నం అవుతుంది.

శాస్త్ర పరిశోధనల రంగంలో భారత్ మరో మేలి ముందడుగు వేసింది. అంతర్జాతీయ సైన్స్ ప్రాజెక్టులో భాగంగా భారత్లో 'ద లేజర్ ఇంటర్ఫెరోమీటర్ గ్రావిటేషనల్–వేవ్ అబ్జర్వేటరీ' క్లుప్తంగా 'లిగో' ఏర్పాటు కానుండటం దీనికి కారణం. కేంద్ర కేబినెట్ ఇటీవలే ఈ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేయడం సైన్స్ చరిత్రలో ఓ సుదినమని చెప్పాలి. అంతేకాదు... అనేక ఇతర ప్రాథమ్యాలను పక్కనబెట్టి ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన సైన్స్ బృందం ఈ ప్రాజెక్టు అమలుకు పూనుకోవడం గొప్ప పరిణామం.

వందేళ్ల తర్వాత...

ఏమిటీ లిగో? దాని ప్రాధాన్యం ఏమిటి? మనకు, ప్రపంచానికి దీనివల్ల ఉపయోగమేమిటి? చాలా ఆసక్తికరమైన ప్రశ్నలివి. ఒక్కటొక్కటిగా సమాధానాలు తెలుసుకుందాం. అమెరికాలోని కాల్టెక్, మసాచూసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)ల ఆధ్వర్యంలో అమెరికా చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు ఈ లిగో! విశాల విశ్వం మొత్తం పరచుకుని ఉన్న గురుత్వ తరంగాలను నేరుగా గుర్తించడం దీని లక్ష్యం. 1916లో ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్స్టీన్ మొట్టమొదటిసారి ఈ గురుత్వ తరంగాల ఉనికిని అంచనా వేయడమే కాకుండా... దాని ఆధారంగా గురుత్వాకర్షణ శక్తిపై విప్లవాత్మకమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. విశాల విశ్వంలో ఎక్కడో కోటానుకోట్ల కిలోమీటర్ల దూరంలో నడిచే అత్యంత శక్తిమంతమైన ఘటనల కారణంగా పుట్టే గురుత్వ తరంగాలను 2015లో మొట్టమొదటిసారి గుర్తించారు. ఇంకోలా చెప్పాలంటే, వాటి ఉనికిని మొదటిసారి అంచనా వేసిన వందేళ్ల తరువాత గుర్తించారని చెప్పాలి. 2015లో గుర్తించిన తరంగాలు సుమారు 130 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో రెండు కృష్ణబిలాలు లయమైపోయిన కారణంగా పుట్టుకొచ్చాయి. ఆ ఆవిష్కరణకు 2017లో భౌతిక శాస్త్రంలో నోబెల్ అవార్డు కూడా దక్కింది.

లిగో ద్వారా గురుత్వ తరంగాల ప్రత్యక్ష పరిశీలన విశ్వ దర్శనానికి రెండు కొత్త కళ్లల్లా మారిందంటే అతిశయోక్తి కాదు. ఇప్పటివరకూ విశ్వాన్ని కేవలం విద్యుదయస్కాంత తరంగాల దృష్టిలోనే చూసే వారు. గురుత్వ తరంగాలకు న్యూట్రినోలు, ఖగోళ కిరణాలు కూడా తోడయితే అంతరిక్షంలో జరిగే సంఘటనలను భిన్న రీతుల్లో పరిశీలించేందుకు అవకాశం ఏర్పడుతుంది. మల్టీ మెసెంజర్ ఆస్ట్రానమీ అన్నమాట.

ప్రపంచ నెట్వర్కులా...

భారతదేశంలో లిగో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పనిచేయడం మొదలుపెట్టినప్పుడు ఈ ప్రపంచానికి ఆకాశం మొత్తాన్ని చూసేందుకు వీలవుతుంది. ఏ దిక్కున ఎప్పుడు రెండు కృష్ణబిలాలు ఢీకొంటాయి? లేదా రెండు భారీ నక్షత్రాలు లయమైపోతాయో నిర్ధారించు



కునే సామర్థ్యం లభిస్తుంది. అమెరికాతో కలిసి చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో భాగంగా మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతంలో భారీ డిటెక్టర్ ఒకదాన్ని ఏర్పాటు చేయనున్నారు. అమెరికాలోని లిగో కేంద్రాలతో కలిసి ఈ డిటెక్టర్ కూడా పనిచేస్తుందన్నమాట. న్యూట్రాన్ స్టార్లు, కృష్ణబిలాలకు సంబంధించిన గురుత్వ తరంగ ఘటనలను వీటిద్వారా పరిశీలించవచ్చు. అంతేకాకుండా... సుమారు 1,300 కోట్ల ఏళ్ల క్రితం మహా విస్ఫోటం కారణంగా పుట్టిందని నమ్ముతున్న విశ్వం తొలికాలం నాటి ప్రకంపనలనూ గుర్తించేందుకు బహుశా అవకాశం ఉంటుంది. యూరప్, జపాన్లలోనూ లిగో డిటెక్టర్లు ఏర్పాటైతే అది ఒక ప్రపంచ నెట్వర్క్లా మారిపోతుంది.

భారత్లోని లిగో డిటెక్టర్ పని మొదలు కాగానే... ఇప్పటికే అందుబాటులో ఉన్న రేడియో, ఆప్టికల్ టెలిస్కోపుల సాయంతో మరిన్ని అద్భుతమైన ఆవిష్కరణలకు నాంది పలకనుంది. ఖగోళ ఘటనలు జరిగేందుకు కొన్ని నిమిషాల ముందునాటి కాలానికి చేర్చడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. అమెరికా డిటెక్టర్లకు దూరంగా ఉన్న కారణంగా భారత్లోని డిటెక్టర్ ఇప్పటివరకూ చూడని ప్రాంతాలపై దృష్టి పెట్టవచ్చు.

భారత్లో లిగో డిటెక్టర్ ఏర్పాటు అంతర్జాతీయ దృష్టికోణంలోనూ చాలా ముఖ్యమైన ఘటనగా చెప్పుకోవాలి. ఎందుకంటే ఈ డిటెక్టర్ ఖగోళ ఘటనలను చూడగలిగే సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనుంది కాబట్టి! ఈ దేశ గడ్డపై ఓ అరుదైన పరిశోధనశాల ఏర్పాటైతే... మొదలైన తొలిరోజు నుంచి అంతర్జాతీయ స్థాయి మౌలిక పరిశోధనలు చేపడితే అది మనందరికీ గర్వకారణమైన అంశమే అవుతుంది. పైగా ఇదో అంతర్జాతీయ ప్రాజెక్టు. రియల్టైమ్లో పరస్పర సహకారం అవసరం అవుతుంది. ఈ క్రమంలో కొత్త ఆలోచనలు పురుడు పోసుకుంటాయి. కొంగొత్త ప్రాజెక్టులు పుట్టుకొచ్చే అవకాశం ఉంటుంది. భారతీయ శాస్త్రవేత్తలు ఈ రంగంలో తగిన అనుభవాన్ని గడించేందుకు సువర్ణావకాశమిది. (లిగో డిటెక్టర్ ప్రయోగాల ద్వారా సైన్స్ మరింత ముందుకు వెళ్లడం మాత్రమే కాదు... నోబెల్ అవార్డు అందుకోగల సత్తా ఉన్న అనేకానేక పరిశోధనలకు కేంద్రబిందువుగానూ మారుతుంది. భారతీయ శాస్త్రవేత్తలకూ నోబెల్ అవార్డులు దక్కే అవకాశం మరింత ఎక్కువవుతుందన్నమాట!)

పరిశోధకులకు అద్భుత అవకాశం

లిగో డిటెక్టర్ల నిర్మాణ దశలో అత్యాధునిక ఫ్యాబ్రికేషన్ పనులన్నీ భారత్లోనే జరగనున్నాయి. శక్తిమంతమైన లేజర్లు, అతిపెద్ద, భారీ వాక్యూమ్ పరికరాలు, అణుస్థాయిలో అత్యంత నున్నటి అద్దాలు... క్వాంటమ్ సెన్సింగ్, కంట్రోలింగ్ వ్యవస్థలన్నీ ఇక్కడే తయారైతే... దేశీ 'ప్రిసిషన్ ఇంజినీరింగ్' సామర్థ్యం పెరుగుతుంది. తద్వారా భవిష్యత్తులో మన పారిశ్రామిక ఉత్పత్తి, నాణ్యత రెండూ ఎక్కువవుతాయి. వీటిని అందిపుచ్చుకునేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు అందుబాటులో ఉండనే ఉన్నారు. ఇప్పటికే నడుస్తున్న కంపెనీలు కూడా హైటెక్ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించే అవకాశం ఉంటుంది. లిగో డిటెక్టర్ల నిర్మాణ బాధ్యతలు చేపట్టే డిపార్ట్మెంట్ ఆఫ్ అటామిక్ ఏజెన్సీ ఇప్పటికే ఈ దిశగా తన ప్రయత్నాలు ముమ్మరం చేసింది కూడా. లిగో– ఇండియా యువ భారతీయ శాస్త్రవేత్తలకు ఓ స్ఫూర్తిగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఈ స్ఫూర్తితోనే చాలామంది విశ్వం దాచుకున్న అనేకానేక రహస్యాలను ఛేదించేందుకు ముందుకొస్తారు.

సైన్స్ రంగంలో లిగో–ఇండియా ఏర్పాటు ఓ అద్భుతం. ఈ ప్రయత్నాలకు నేతృత్వం వహిస్తున్న శాస్త్రవేత్తలు వీలైనంత వేగంగా డిటెక్టర్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు సర్వశక్తులు ఒడ్డాలి. సైన్స్ అంటే ఆసక్తి ఉన్నవారు... సైన్స్ వ్యాప్తికి కృషి చేస్తున్న వారు లిగో–ఇండియా ప్రాముఖ్యత, అవసరం, లక్ష్యాల గురించి ఈ తరం యువతకు తెలియజేయాల్సిన సందర్భం కూడా ఇదే.

భౌతికశాస్త్రం, దాని అనుబంధ రంగాల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ఇదో అత్యద్భుతమైన అవకాశం. స్నాతకోత్తర విద్యలో గురుత్వ తరంగాలపై పరిశోధనలను ఎంచుకోవడం ద్వారా లిగో– ఇండియా నిర్మాణంలో భాగస్వాములయ్యే అవకాశం లభిస్తుంది. అన్నీ సవ్యంగా సాగితే లిగో– ఇండియా నిర్మాణం మొత్తం పూర్తయ్యి సమాచార సేకరణ మొదలుపెట్టేందుకు ఇంకా ఏడేళ్ల సమయం(2030) ఉంది.

రాణా అధికారి, కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధ్యాపకులు; కె.విజయ్ రాఘవన్, కేంద్ర మాజీ ప్రధాన శాస్త్రీయ సలహాదారు; శివాజీ సోంధీ, ఆక్స్ఫర్డ్ వర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్సైట్లు ఫేస్బుక్, ట్విట్టర్లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మనకన్నా నయం



ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచిలో, ఇండియా 11 స్థానాలు దిగజారింది. 2022లోని 150 నుంచి 2023లో 161కి వచ్చింది. సోకాల్డ్ ప్రజాస్వామ్య తల్లి అనే మోదీ ఇండియా కన్నా ఈ సూచీ తాలిబన్ల పాలనలో ఉన్న అఫ్గానిస్తాన్లోనూ(152), సైనిక నియంత్రణ ఉన్న పాకిస్తాన్లోనూ (150) మెరుగ్గా ఉంది.
– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

మంచి సినిమా



జనానికి పెద్దగా తెలియని, కొంతమంది మాత్రమే చూశారని మీకు అనిపించే ఏ బాలీవుడ్ సినిమాను మీరు స్నేహితులకు కచ్చితంగా చూడమని చెబుతారు? నేనైతే 'సెహర్' అంటాను. అర్షద్ వార్సీ, పంకజ్ కపూర్, సుశాంత్ సింగ్ నటించారు. (దర్శకుడు కబీర్ కౌశిక్)
– జాయ్ దాస్, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్

ఇబ్బంది పడమా?



లండన్లో జరిగిన ఒక నెట్ఫ్లిక్స్ ఈవెంట్లో, టాయ్లెట్ల దగ్గర చిహ్నాలు పెట్టారు. మహిళలు, అంగ వికలుర టాయ్లెట్లను జెండర్ న్యూట్రల్గా మార్చారు. మగ వాళ్లవి మాత్రం మగ వాళ్ల కోసమే ఉంచారు.
– సమంతా స్మిత్, కాలమిస్ట్

కలిసే ఉండాల్సింది



అందుబాటు ధరల్లో నాణ్యమైన తాజా పళ్లు, కూరగాయలు దొరకడం బ్రిటన్లో కష్టమైపోతోంది. 'బ్రెగ్జిట్' (యూరోపియన్ యూనియన్ నుంచి బయటకు రావడం) దేశానికి స్వీయ హానికారక చర్య.
– దేవీ శ్రీధర్, ప్రొఫెసర్

ఇంకొక సత్యం



ఐర్లాండ్లో ఇప్పుడు 'ట్రూత్' (సత్యం) మంత్రిత్వ శాఖ వాస్తవమని నిర్ధారించినదే చదవడానికి అర్హమైన మెటీరియల్. కొత్త శాసనం ప్రకారం, 'ద్వేషపూరితం' లేదా అవాస్తవికం అని ప్రభుత్వ సెన్సార్లు పరిగణించినదాన్ని ఆన్లైన్లో చూడటం, షేర్ చేయడం కూడా జైలుశిక్షకు అర్హమైనదే.
– బెర్నీ స్పాఫోర్త్, విశ్లేషకురాలు

మాట్లాడుతాం



పాకిస్తాన్లో మేము సత్యాన్ని చెప్పే వీలు లేదు. లేదంటే భారీ మూల్యం చెల్లించాలి. బలవంతపు మతమార్పిళ్ల కథనాలు; లేదంటే క్రైస్తవులు, హిందువులు, షియాలు, అహ్మదీలు, ఆఖరికి గిరిజనులను ఎలా చూస్తున్నారన్న కథనాలు రాసినా బాధలు పడవలసిందే. సత్యానికి భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చినా, ధైర్యంగా గొంతెత్తి మాట్లాడవలసిందే.
– వీంగాస్, జర్నలిస్ట్

ఎగిరిపోతున్న దేశాలు



ప్రతి సంవత్సరం 'ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ' పరీక్షకు పంజాబ్ నుంచి ఆరు లక్షల మంది విద్యార్థులు హాజరవుతారు. విదేశాలకు వెళ్లాలన్న ఉబలాటాన్ని ఇది తెలియజేస్తోంది. ముందు చదువుకోవడం, అనంతరం అక్కడే ఉద్యోగం సంపాదించుకోవడానికి అత్యధికులు ఎంపిక చేసుకుంటున్న దేశాలు – కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే.
– దేవీందర్ శర్మ, కాలమిస్ట్

ఇన్బాక్స్

మైసూర్ పులి

భారత స్వాతంత్ర్య చరిత్రలో టిప్పు సుల్తాన్ పాత్ర ప్రత్యేకం. బ్రిటిష్ మూకల కబంద హస్తాల నుండి దేశాన్ని రక్షించడానికి ఆయన సాగించిన పోరాటం అజరామరం. 1750 నవంబర్ పదవ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా, దేవనహళ్లిలో ఫాతిమా ఫక్రున్నీసా, హైదర్ అలీలకు టిప్పు జన్మించాడు. తండ్రి తన స్వీయ పర్యవేక్షణలో యుద్ధ కళల్లోని మెళకువలు నేర్పించాడు. జాతీయ, అంతర్జాతీయ విషయాలపై టిప్పు వ్యక్తపరిచిన అభిప్రాయాలనూ, దౌత్య వ్యూహాలనూ ఆయన శత్రువు డోవ్టన్ లాంటి బ్రిటిష్ అధికారి సైతం ప్రశంసించకుండా ఉండలేకపోయాడు. పదిహేనేళ్ళ ప్రాయంలోనే యుద్ధాల్లో పాల్గొన్నాడు. మొదట బ్రిటిషర్ల కూటమి నుండి నిజాంను దూరం చేయడానికి సాగిన ప్రయత్నాల్లో భాగంగా ఎంతో పరిణతితో, నేర్పుతో, దౌత్యకార్యాన్ని నడిపినప్పుడు... ఆయన వయసు కేవలం పదిహేడేళ్ళు. టిప్పు ప్రదర్శించిన రాజనీతికి ముగ్ధుడైన నిజాం... 'ఫతే అలిఖాన్' అన్న బిరుదుతో సత్కరించాడు.



టిప్పు సుల్తాన్

టిప్పు తండ్రి హైదరలీ 1782లో శత్రువుతో పోరాడుతూ నవంబర్ 6న మరణించినప్పుడు టిప్పు వయసు 31 సంవత్సరాలు. ఆ వయసులో మైసూరుకు రాజయ్యాడు. ఈస్టిండియా పాలకులతో పోరాడుతున్నా క్రైస్తవ మతాచార్యులను అమితంగా గౌరవించేవాడు. మసీదు–మందిరాల మధ్య ఎలాంటి తారతమ్యం చూపలేదు. మైసూరు రాజ్యంలోని అనేక ఆలయాలకు ప్రతి ఏడాది గ్రాంటులను, ప్రత్యేక నిధులను మంజూరు చేశాడు. ఈమేరకు టిప్పు సుల్తాన్ 156 ఫర్మానాలను జారీచేశాడు. ఆయన సైన్యంలోని 19 మంది సేనాపతుల్లో 10 మంది... 13 మంది మంత్రులలో ఏడుగురు హిందువులేనని ప్రఖ్యాత చరిత్రకారుడు బీఎస్ పాండే పేర్కొన్నారు. చివరికి 1799 మే నాల్గవ తేదీన రణభూమిలోనే తుదిశ్వాస వదిలిన టిప్పు చరిత్రలో ఒక రగిలే విప్లవ కణం.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్
(నేడు టిప్పు సుల్తాన్ వర్ధంతి)

నిరుద్యోగితపై వైఖరి మారాలి

అభిప్రాయం



డాక్టర్ తిరునహరి శేషు

ప్రపంచంలోని చాలా దేశాల్లో లాగే నిరుద్యోగ సమస్య భారత్లో కొరకరాని కొయ్యగా కొనసాగుతోంది. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఉపాధి రహిత వృద్ధి (జాబ్ లెస్ గ్రోత్) కొనసాగటం, జనాభా అధిక రేటులో పెరగటం, ప్రభుత్వాలు రూపొందించిన ఉపాధి కల్పనా విధానాలు, స్వయం ఉపాధి కోసం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమాలు, పథకాలు సత్ఫలితాలు ఇవ్వకపోవడం నిరుద్యోగానికి ప్రధాన కారణాలు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

భారత దేశంలో సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రారంభమైన తరువాత ప్రైవేట్ రంగం మూలధన సాంద్రత పద్ధతులను ఉపయోగించటం వలన... ఆశించిన స్థాయిలో ఉపాధి ఉద్యోగ అవకాశాలను విస్తృతపరచలేకపోయింది. మరొకవైపు ప్రభుత్వ రంగం కుచించుకపోవడం, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం వలన గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంత స్థాయికి నిరుద్యోగిత పెరిగిపోయిందని 'నేషనల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్' అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వ శాఖలలో 2021 నాటికి దరిదాపు 9.79 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని లోక్ సభలో ప్రభుత్వమే ప్రకటించింది. అలాగే వివిధ రాష్ట్రాలలో కూడా లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీని ఆర్థిక భారంగా భావించి భర్తీ చేయడం లేదనేది విమర్శ. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే క్యాడర్ స్ట్రెంగ్త్ ప్రకారంగా ఒక లక్ష 95 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని 'బిశ్వాల్ కమిటీ' చెబుతుంటే... ప్రభుత్వం మాత్రం వాటిలో సగం ఉద్యోగాల భర్తీకి మాత్రమే ముందుకు వచ్చింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, ఉపాధి కల్పన విధానాల వలన దేశంలో 7.4 శాతం నిరుద్యోగితా రేటు నమోదయిందని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' (సీఎంఐఈ) తన 2023 రిపోర్టులో ప్రకటించింది.



జాతీయ సగటు కంటే 12 రాష్ట్రాల్లో నిరుద్యోగితా రేటు ఎక్కువ. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామనే కేంద్ర ప్రభుత్వ హామీతో పాటు రాష్ట్రాలు కూడా లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామనే ఇచ్చిన ఎన్నికల హామీలు హామీలుగానే మిగిలిపోయాయి. ఉద్యోగాల భర్తీకి, కల్పనకూ ఎటువంటి ప్రణాళికలను ప్రభుత్వం రూపొందించకపోవడం వల్ల... దేశంలో నిరుద్యోగం ఒక పెద్ద సమస్యగా మారిపోయింది.

భారతదేశంలోని రాజకీయ పార్టీలు నిరుద్యోగాన్ని ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఒక రాజకీయ అస్త్రంగా మలుచుకొని రాజకీయాలు చేస్తున్నాయి. రోజ్ గార్ మేళాలు, కొలువుల జాతరలు నిరుద్యోగ సమస్యకి పరిష్కారం చూపించలేవు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన కొన్ని పోటీ పరీక్షల పేపర్లు లీక్ కావడంతో నిరుద్యోగులకు ప్రభుత్వంపై అపనమ్మకం ఏర్పడింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైతే... బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దాన్ని రాజకీయ అవకాశంగా మలుచుకున్నాయి. ఇదే సమయంలో బీజేపీ అధికారంలో ఉన్న హరియాణాలో 37 శాతం నిరుద్యోగిత (మొదటి స్థానం), కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్లో 28 శాతం నిరుద్యోగిత (రెండవ స్థానం) ఉండడం గమనార్హం.


ఐక్యరాజ్యసమితి జనాభా నిధి రిపోర్ట్ భారతదేశం 142.86 కోట్లతో జనాభా విషయంలో చైనాను అధిగమించిందని ప్రకటించింది. పెరిగిన జనాభా మేర ఉద్యోగాల సృష్టి జరుగకపోతే నిరుద్యోగం మరింత తీవ్రమై దేశం అల్లకల్లోలమవుతుంది. నిరుద్యోగ సమస్యను రాజకీయ అవకాశాలను సృష్టించే సాధనంగా చూడకుండా... ప్రభుత్వాలు ఉపాధి కల్పనకు గట్టి చర్యలు తీసుకోవాలి. లేకపోతే నిరుద్యోగులు ఎంతకైనా తెగిస్తారనేది చరిత్ర చెబుతున్న సత్యం.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ విశ్వవిద్యాలయం। 98854 65877

అలసత్వం

చాలా చేపలున్న ఒక చెరువులో మూడు చేపలు చెలిమి కలిగి జీవిస్తున్నాయి. ఒక చేప పేరు దీర్ఘదర్శి. భవిష్యత్తులో జరుగబోయేది ఊహించగలదు. రెండో చేప పేరు ప్రాప్తకాలజ్ఞుడు. సమయం వచ్చినప్పుడు తగు ఉపాయం ఆలోచించగలదు. మూడోది దీర్ఘసూత్రుడు. అలసత్వంతో ఏ పనీ వెంటనే చెయ్యదు.

వేసవి ప్రవేశించడంతో ఒక రోజు దీర్ఘదర్శి మిగతా ఇద్దరినీ పిలిచి 'చెరువులో మిగిలిన కొద్ది నీరు వేసవి ఎండకు ఇంకిపోతుంది. నీళ్ళు పూర్తిగా అడుగంటినాక మనం వేరే చోటుకి వెళ్ళలేము. కాబట్టి మనం ముందుగానే మేల్కొని ఈ చోటు వదిలి సమృద్ధిగా నీళ్ళున్న వేరే చెరువుకు వెళ్దాం' అంది. ఇది విన్న ప్రాప్తకాలజ్ఞుడు 'సమయం వచ్చినప్పుడు చూద్దాం. అప్పటికి ఏది ఉచితమో అది నేను చేస్తాను' అంది. వీరిద్దరి మాటలు విన్న మూడో చేప దీర్ఘసూత్రుడు 'ఏదైనా జరిగేదాకా మనం ఓపికపట్టి ఉండాలి. తొందరపడి ఏ నిర్ణయం తీసుకోకూడద'ని అంది.



వీరి మాటలు విన్న దీర్ఘదర్శి తెలివిగా ఆ చెరువును విడిచిపెట్టి వేరే మార్గం గుండా జలసమృద్ధిగల మరో చెరువుకు వెళ్ళింది. చెరువులో నీళ్ళు తగ్గిన తర్వాత జాలరులు వలలు విసిరి, చేపలను పట్టుకొన్నారు. అలసత్వమే స్వభావంగా గల దీర్ఘ సూత్రుడు వలలో చిక్కుకొంది. సమయం వచ్చినప్పుడు మేల్కొని తగు విధంగా ప్రవర్తించే ప్రాప్తకాలజ్ఞుడు చేపల మధ్యలో దూరి, వలకు ఉన్న తాడును గట్టిగా కరుచుకొని పట్టుకొంది. తరువాత చేపలతో ఉన్న వలను జాలరులు బైటకు తీసి నీళ్ళున్న వేరే మడుగులో కడుగుతున్నప్పుడు, తాడును వదిలిపెట్టి నీళ్ళలో కలిసిపోయి బతికిపోయింది. దీర్ఘసూత్రుడు మాత్రం జాలర్ల చేతిలో మడిసింది.

మహాభారతం శాంతి పర్వం తృతీయా శ్వాసంలో భీష్ముడు ఈ కథను ధర్మరాజుతో చెప్పి... 'భవిష్యత్తులో జరుగబోయే ప్రమాదాన్ని పసిగట్టలేనివాడు దీర్ఘసూత్రుడిలా నశిస్తాడు. శక్తి ఉన్నా సమయానికి తగు చర్య తీసుకోలేనివాడు ప్రాప్తకాలజ్ఞుడిలా ప్రమాదాల బారినపడతాడు. భవిష్యత్తును ఊహించి ప్రమాదం రాకుండా ముందుగానే తగు చర్య తీసుకొనేవాడు దీర్ఘదర్శిలా అభివృద్ధి చెందుతాడ'ని విశ్లేషిస్తాడు.

– దీవి సుబ్బారావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

పారదర్శకంగానే ఔటర్ లీజు

టీఓటీ విధానానికి జాతీయ రహదారుల సంస్థ ఆమోదం

- రెవెన్యూ మల్టీపుల్ బిడ్ విలువ 13.64 శాతం
- పదేళ్లకోసారి లీజు ఒప్పందంపై సమీక్ష
- ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనల మేరకే టోల్ రుసుము
- బేస్ ప్రైస్ కంటే లీజు ఆదాయం ఎక్కువే
- హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ వెల్లడి





సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్‌రోడ్డు లీజు అంతా పారదర్శకమని, కేంద్రం ఆమోదంతో జాతీయ రహదారుల సంస్థ గుర్తించిన టోల్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) విధానాన్ని పాటించినట్లు పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ తెలిపారు. 30 ఏళ్ల లీజుపై తాము నిర్ణయించిన బేస్‌ప్రైస్ కంటే ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలపర్స్ లిమిటెడ్ సంస్థ రూ.7380 కోట్లతో ఎక్కువ మొత్తంలో బిడ్ చేసినట్లు వెల్లడించారు. పోటీలో ఉన్న నాలుగు సంస్థల్లో ఇదే ఎక్కువ మొత్తమని చెప్పారు. బేస్‌ప్రైస్ విషయంలో సాంకేతికంగానే గోప్యత పాటించినట్లు పేర్కొన్నారు. ఔటర్ లీజులో భారీ కుంభకోణం జరిగినట్లు ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో టెండర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆయన ఏం చెప్పారంటే..

బిడ్డింగ్‌లో లోపాల్లేవ్..

- జాతీయ రహదారుల సంస్థ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 6 బండిల్స్‌లో సుమారు 1600 కిలోమీటర్లను టీఓటీ ప్రాతిపదికన 15 నుంచి 30 ఏళ్ల కాలపరిమితికి లీజుకు ఇచ్చిన పద్ధతినే ఔటర్ విషయంలో అనుసరించాం. రెవెన్యూ మల్టీపుల్ పరంగా దేశంలోని రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ప్రాజెక్టుల కోసం ఖరారు చేసిన వాటిలో ఔటర్ లీజు అత్యుత్తమ బిడ్.
- హైదరాబాద్ మహానగరం చుట్టూ 8 లేన్లతో చేపట్టిన ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం 2006లో ప్రారంభమైంది. 2012 నాటికి 79.45 కిలోమీటర్లు, 2018 నాటికి 158 కి.మీ పూర్తి చేశారు. 2012 నుంచే ఔటర్‌పై టోల్ వసూలు మొదలైంది. ఆ ఏడాది రూ.11.11 కోట్లు ఆదాయం లభించగా 2018 నాటికి రూ.340 కోట్లు, 2022 నాటికి రూ.542 కోట్ల చొప్పున ఆదాయం లభించింది. జాతీయ రహదారుల సంస్థ 2008లో విధించిన నిబంధనల మేరకు టోల్ రుసుము నిర్ణయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు టోల్ రుసుముపై అదే విధానాన్ని అనుసరిస్తున్నాం.
- కేంద్ర క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదించిన టీఓటీ ప్రకారం ఔటర్ రింగ్‌రోడ్డును 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు గతేడాది ఆగస్టు 11న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతేడాది నవంబర్ 9న అంతర్జాతీయ సంస్థల నుంచి హెచ్‌ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి 11 బిడ్డర్లు ఆసక్తి ప్రదర్శించారు. బిడ్డింగ్‌లో ఎలాంటి లోపాలకు తావులేకుండా పారదర్శకతను పాటించేందుకు 142 రోజుల వ్యవధి ఇచ్చాం.

పదేళ్లకోసారి సమీక్ష...

- ఐఆర్‌బీకి 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చినప్పటికీ ప్రతి పదేళ్లకు ఒకసారి లీజును సమీక్షిస్తారు. రోడ్డు మరమ్మతులు, నిర్వహణ, టోల్ రుసుము, సిబ్బంది జీతభత్యాలు, ఆదాయ,వ్యయాలు, తదితర అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఈ సమీక్షను నిర్వహిస్తారు.
- టోల్ పెంపు పైన ఐఆర్‌బీ చేసే ప్రతిపాదనలు జాతీయ రహదారుల సంస్థ నిబంధనలకు లోబడి ఉంటాయి. హెచ్‌ఎండీఏ ఆమోదంతోనే అవి అమలవుతాయి. ఔటర్‌పైన పచ్చదనం నిర్వహణ పూర్తిగా హెచ్‌ఎండీఏ పర్యవేక్షిస్తుంది. ఇందుకయ్యే ఖర్చును ఐఆర్‌బీ చెల్లించవలసి ఉంటుంది. ప్రస్తుతం ఔటర్‌పైన ఇంటర్‌చేంజ్‌ల వద్ద ఉన్న ట్రామాకేర్ సెంటర్‌లను ఐఆర్‌బీ నిర్వహించనుంది. ఐఆర్‌బీ సంస్థకు లీజు ఆమోదపత్రం అందజేశాం. 120 రోజుల్లోపు ఐఆర్‌బీ బిడ్డింగ్ మొత్తాన్ని (రూ.7380కోట్లు) ఏకమొత్తంలో చెల్లించిన అనంతరమే ఔటర్‌ను అప్పగిస్తాం. అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న ఈగిల్ ఇన్‌ఫ్రా సంస్థే టోల్ వసూలు చేస్తుంది.

ఎవరెంత బిడ్ వేశారంటే..

- మొత్తం ఈ బిడ్డింగ్ ప్రక్రియలో 11 సంస్థల్లో చివరకు నాలుగు మాత్రమే అర్హత సాధించాయి. 'ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న ఈగల్ ఇన్‌ఫ్రా సంస్థ 30 ఏళ్ల ఔటర్ లీజుపై రూ.5634 కోట్లు, గవార్ కన్‌స్ట్రక్షన్స్ రూ.6767 కోట్లు, దినేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ రూ.7007 కోట్లు చొప్పున బిడ్ వేశాయి. ఐఆర్‌బీ అత్యధికంగా రూ. 7380 కోట్లతో ముందుకు వచ్చింది. తాము నిర్ణయించిన బేస్ ప్రైస్ కంటే ఇది ఎక్కువగా ఉండడంతో ఐఆర్‌బీ హెచ్–1 కింద లీజు పొందింది.
- బేస్ ప్రైస్ ముందే నిర్ణయించినప్పటికీ ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనలతో పాటు ఆశించిన దానికంటే ఎక్కువ ఆదాయాన్ని పొందే లక్ష్యంతో బేస్ ప్రైస్‌ను గోప్యంగా ఉంచాం. ఓఆర్‌ఆర్‌పై వస్తున్న సుమారు రూ.541 కోట్ల ఆదాయాన్ని రెవెన్యూ మల్టీపుల్ ఫార్ములా (ఆర్ఎంఎఫ్) ప్రకారం లీజు మొత్తంతో హెచ్చించగా 30 ఏళ్లలో అది రూ.1.30 లక్షల కోట్లకు సమానమవుతుందన్నారు. ఔటర్ బిడ్డింగ్‌లో ఆర్ఎంఎఫ్ 13.64 వరకు వచ్చింది. టీఓటీ విధానంలో ఇది ఉత్తమ ఆర్ఎంఎఫ్. ప్రస్తుతం ఔటర్‌పై ప్రతి రోజు సగటున 1.6 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, రూ.1.48 కోట్ల వరకు ఆదాయం లభిస్తోంది.

'వాట్సాప్' చిచ్చు.. యువకుడి దారుణ హత్య



భీమ్‌గల్: రోడ్డుకడ్డంగా కట్టెలు వేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉందంటూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు పెట్టిన ఒక వ్యక్తిపై దాడి చేసి హతమార్చారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం కారెపల్లి గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన బంతిలాల్ (37) ఇంటికి సమీపంలో దరావత్ మంతు, దేవిచంద్‌ల ఇళ్లు ఉంటాయి. మంతు, దేవి చంద్‌లు రోడ్డుపై కట్టెలు అడ్డంగా వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని బంతిలాల్.. గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు పెట్టాడు. ఈ విషయం గ్రామంలో చర్చకు దారితీయటంతో.. అవమానంగా భావించిన దరావత్ మంతు, చంద్‌ల కుటుంబాలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యాయి. దరావత్ మంతు, అతని భార్య లలిత, తల్లి అంబాలి దేవి, చందు, చందు భార్య లావణ్య సోమవారం రాత్రి గొడ్డళ్లు తీసుకొని బంతిలాల్ ఇంటికి వెళ్లి తలుపులు ధ్వంసం చేశారు. ఆ సమయంలో బంతిలాల్ ఇంట్లో లేకపోవడంతో ఇంట్లో వారిని బెదిరించి వెళ్లిపోయారు. మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో కిరాణా కొట్టు వద్ద కూల్‌డ్రింక్ తాగుతూ కనిపించిన బంతిలాల్‌పై వీరందరూ పిడిగుద్దులు గుద్దుతూ దాడి చేశారు. బంతిలాల్ భార్య నవీన వెంటనే భర్తను ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజ్ భరత్ రెడ్డి తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటి కలెక్టరు వారి కార్యాలయము (భూసేకరణ) గద్వాల
ఫారం-6
ప్రాథమిక ప్రకటన

భూసేకరణ, పునరావాస, పునస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

జిల్లా కలెక్టరు జోగులాంబ గద్వాల ప్రొసీడింగ్స్ నెం. G/303/2023 తేది: 17.04.2023
ప్రత్యేక ఉపకలెక్టరు, (భూసేకరణ) జె.యల్.ఐ.పి లేఖ నెం.A2/05/2015 తేది: .04.2023
జిల్లా రాజ పత్రం నెం. 65/2023

జోగులాంబ గద్వాల జిల్లా కె.టి.దొడ్డి మండలము గువ్వలదిన్నె గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ. 9.48 సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా Package No.104 Minor 2R on D13 Canal నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా గారు భావిస్తున్నారు. తెలంగాణ భూసేకరణ సవరణ చట్టము 2016 (యాక్ట్ నెం.21/2017) సెక్షన్ 10ఎ క్రింద మినహాయింపు ఇవ్వబడియున్నారు. కావున నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావము అధ్యయన వేదిక అవసరం లేనందున అనుబంధంలో పేర్కొనిన భూములకు ఈ నోటీసు జారీ చేయనైనది.

షెడ్యూల్
గ్రామము: గువ్వలదిన్నె మండలం: కె.టి.దొడ్డి జిల్లా: జోగులాంబ గద్వాల

క్ర.సం	సర్వే నం./ సబ్ డి.నెం.	పట్టా/ ఇనాం	భూ ప్రకారం మెట్ట/ తరి	భూసేకరణ ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు	పట్టాదారు పేరు అనుభవదారు పేరు	7	8	9	10	11	12	13	14
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	20	పట్టా	మెట్ట	0.22	[illegible]	-	-	-	-	-	-	-	-
2	23	పట్టా	మెట్ట	0.30	[illegible]	-	-	-	-	-	-	-	-
3	24	పట్టా	మెట్ట	0.93	[illegible]	-	-	-	-	-	-	-	-
4	25	పట్టా	మెట్ట	0.38	[illegible]	-	-	-	-	-	-	-	-
5	26	పట్టా	మెట్ట	1.08	[illegible]	-	-	-	-	-	-	-	-
6	32	పట్టా	మెట్ట	0.09	[illegible]	-	-	-	-	-	-	-	-
7	33	పట్టా	మెట్ట	0.58	[illegible]	-	-	-	-	-	-	-	-
8	37	పట్టా	మెట్ట	1.47	[illegible]	-	-	-	-	-	-	-	-
9	264	[illegible]	[illegible]	1.47 0.83 0.18 2.48	[illegible]	[illegible]							
10	269	[illegible]	మెట్ట	0.40	[illegible]	-	-	-	-	-	-	-	-
11	295	పట్టా	మెట్ట	0.37	[illegible]	-	-	-	-	-	-	-	-
12	296	పట్టా	మెట్ట	0.27	[illegible]	-	-	-	-	-	-	-	-
13	298	పట్టా	మెట్ట	0.21	[illegible]	-	-	-	-	-	-	-	-
	మొత్తం విస్తీర్ణం			9.48									

[illegible]

DIPR RO No.143/LA-PP/Advt/Pub/2023-24

రాజ్‌భవన్‌కు ప్రగతిభవన్ దూరం..

▶ మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

అభివృద్ధి అంటే ఒక్క కుటుంబానికి సంబంధించింది కాదు

'ప్రజా ప్రతినిధులు సమాజ సేవకులు. ఎల్లప్పుడూ ప్రజల అభివృద్ధికి పాటు పడాలి. అభివృద్ధి అంటే ఒక్క కుటుంబానికి సంబంధించింది కాదు. అన్ని కుటుంబాలు అభివృద్ధి చెందాలి. ఐదు వేల సంవత్సరాల క్రితమే ఆనాటి ప్రముఖుడు కనియన్ పుంగనాన ప్రజలంతా ఒక్కటేనని నినదించారు. ప్రస్తుత ప్రధానమంత్రి అదే నియమాన్ని పాటిస్తూ ప్రజలందరినీ సమానంగా చూస్తున్నారు. యావత్ ప్రపంచానికి భారత్ పరిష్కార మార్గాలను చూపిస్తోంది. ముఖ్యంగా కరోనా సమయంలో 150 దేశాలకు వ్యాక్సిన్లను సరఫరా చేసి ఆదుకుంది. మన దేశంలోని వసుధైక కుటుంబానికి ఇది నిదర్శనం' అని తమిళిసై తెలిపారు. 'తొలిసారిగా జీ20 ఫోరమ్‌కు 2023లో భారత్ అధ్యక్షత వహించడం గర్వకారణం. మోదీ నేతృత్వంలో భారత్ ప్రపంచానికి నాయకత్వం వహిస్తుంది. స్వాతంత్య్ర శతాబ్ది వైపు పయనించే 'అమృత్‌కాల్' దిశగా ఇదో ముందడుగు. నిరక్షరాస్యత, అనారోగ్యం, నిరుద్యోగం లేని దేశంగా భారత్ అవతరిస్తుంది. అయితే అభివృద్ధి దిశగా చేసే పనిని కొందరు వ్యతిరేకిస్తారు కానీ పని చేయరు. నాయకులు అధికారులు, రాజ్‌భవన్ అందరూ ప్రజల కోసమే ఉన్నాం..'అని గవర్నర్ స్పష్టం చేశారు. జీ20 సౌస్ షెర్పా డీఎం కిరణ్, రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, సేవా ఇంటర్నేషనల్ డైరెక్టర్ స్వాతి రామ్ తదితరులు పాల్గొన్నారు.

తె.యూ రిజిస్ట్రార్‌గా నిర్మలాదేవి

రిలీవ్‌కు నిరాకరించిన ఓయూ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం అధ్యాపకురాలు ప్రొఫెసర్ నిర్మలాదేవిని తెలంగాణ వర్సిటీ రిజిస్ట్రార్‌గా వీసీ ప్రొఫెసర్ రవీందర్ గుప్తా నియమించారు. బుధవారం ఉదయం ఓయూ నుంచి ఏడాది సమయానికి రిలీవైన ప్రొఫెసర్ నిర్మలాదేవి సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో తె.యూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రొ.నిర్మలాదేవి రిలీవింగ్ ఉత్తర్వులను సాయంత్రం 5 గంటలకు ఓయూ అధికారులు రద్దు చేశారు. తె.యూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ గుప్తా, రాష్ట్ర ఉన్నత విద్య అధికారుల నడుమ కొనసాగుతున్న వివాదం కారణంగా ప్రొఫెసర్ నిర్మలాదేవి భంగపాటుకు గురయ్యారు.

తెలంగాణ ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
జోగులాంబ గద్వాల జిల్లా
ఫారం-VII
రూఢీ ప్రకటన (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)

[illegible] చట్టం-2013 (కేంద్ర చట్టం (30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి)

జిల్లా కలెక్టర్ జోగులాంబ గద్వాల ప్రొసీడింగ్స్ నెం.G/383/2022 తేది: 17-04-2023
ప్రత్యేక ఉప కలెక్టర్, (భూసేకరణ) జె.యల్.ఐ.పి లేఖ నెం.C/38508 తేది: - -2023
జిల్లా రాజపత్రం నెం. 53/2022

ఈ దిగువ నిర్దిష్ట పరిధిని జోగులాంబ గద్వాల జిల్లా, ఐజాల మండలము, వేముల గ్రామము విస్తీర్ణము ఎ.3.23 సెం.లు ప్రజాప్రయోజనం నిమిత్తము అనగా జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకము యొక్క D3 of Right Main Canal of GDBR ప్యాకేజి నెం.100 నిర్మాణ నిమిత్తము, అవసరమైయున్నదని భావించనైనది. కావున జోగులాంబ గద్వాల జిల్లా, ఐజాల మండలము, వేముల గ్రామము విస్తీర్ణము ఎ.3.23 సెం.లు గల భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన వానిని పైన చూపిన ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

క్ర.సం.	సర్వే నెం.	భూమి విధం (పట్టా/ ప్రభుత్వ ఇనాం మొ॥)	భూమి రకం (మెట్ట/ తరి మొ॥)	భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ.సెం.లు	పేరు/చిరునామా (భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు)	చెట్ల రకం/ సంఖ్య కట్టడం రకం/ విస్తీర్ణము చ.గజాలలో
1	2	3	4	5	6	7
1	495	పట్టా	మెట్ట	0.28	[illegible]	
2	497	[illegible]	మెట్ట	1.06	[illegible]	
3	535	పట్టా	మెట్ట	0.83	[illegible]	
4	536	పట్టా	మెట్ట	1.06	[illegible]	
				3.23		

[illegible]

DIPR RO No.158/LA-PP/Advt/Pub/2023-24

'సీతారామ'పై సందేహాలు

▶ మొదటి పేజీ తరువాయి

కేటాయించిన గోదావరి జలాల పంపకాల విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య ఎలాంటి ఒప్పందం జరగలేదు. చివరకు ఉమ్మడి ఏపీకి గోదావరి జలాల లభ్యత, ప్రాజెక్టుల ద్వారా వినియోగం లెక్కలపై సైతం రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం లేదు.

నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ తేల్చాలి..

ఇప్పటికే ఉన్న, నిర్మాణంలోని, నిర్మాణం ప్రారంభం కాని తమ ప్రాజెక్టుల అవసరాలకు 776 టీఎంసీలు అవసరమని ఏపీ, 967 టీఎంసీలు అవసరమని తెలంగాణ చెబుతున్నాయి. అయితే గోదావరిలో 1,743 టీఎంసీల మేరకు నీటి లభ్యత లేదని ఆయా రాష్ట్రాలే అంగీకరిస్తున్నాయి. ఉమ్మడి ఏపీ 2014 జనవరి 2న రాసిన లేఖ ప్రకారం 1,486.155 టీఎంసీల లభ్యత మాత్రమే ఉందని తెలంగాణ అంటోంది. 2004 నాటి వ్యాప్కోస్ నివేదిక ప్రకారం కేవలం 1,360 టీఎంసీల లభ్యతే ఉందని, అలాగే 70 టీఎంసీల ఊట నీళ్ల లభ్యత ఉందని ఏపీ పేర్కొంటోంది. అయితే ఊట నీళ్లను పరిగణనలోకి తీసుకోరాదని గోదావరి ట్రిబ్యునల్ అవార్డు పేర్కొంటోంది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల ద్వారా 2000–2020 మధ్యకాలంలో సగటున వరుసగా 72 టీఎంసీలు, 11 టీఎంసీలను వాడినట్టు తెలంగాణ పేర్కొంటోంది. ఈ అంశాల నేపథ్యంలో గోదావరి బేసిన్, సబ్ బేసిన్లలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో అధ్యయనం జరగాలి. 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా సీతారామ వద్ద గోదావరిలో 347.06 టీఎంసీల లభ్యత ఉందని ప్రాజెక్టు డీపీఆర్ పేర్కొంటోంది. దీనిపై అధ్యయనానంతరం సీడబ్ల్యూసీ నిర్ధారిత లెక్కలు పంపించాలి.

గోదావరి జలాలను కృష్ణాకు ఎలా తరలిస్తారు?

సీతారామ ఎత్తిపోతలు, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల ద్వారా 10.109 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కి తరలించి నాగార్జునసాగర్, వైరా, పాలేరు ప్రాజెక్టుల ఆయకట్టును స్థిరీకరించనున్నట్టు డీపీఆర్‌లో ప్రతిపాదించారు. అయితే తరలింపును సమర్థిస్తూ డీపీఆర్‌లో ఎలాంటి వివరణ ఇవ్వలేదు.

మిస్టరీ వీడిన గిరిజన మహిళ మృతి కేసు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు నిర్ధారణ?

ఖమ్మం క్రైం: సంచలనం సృష్టించిన గిరిజన మహిళ మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేధించినట్లు తెలిసింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలానికి చెందిన ఓ గిరిజన మహిళ(45) గత నెల 27వ తేదీన మానసిక స్థితి సరిగ్గా లేని తన అత్తమ్మను ఖమ్మంలోని ఆస్పత్రిలో చూపించేందుకు వచ్చింది. ఆటోలో వెళ్తుండగా అత్త మూత్రవిసర్జన కోసం కిందకు దిగగా.. ఒంటరిగా ఉన్న సదరు మహిళను ఆటోడ్రైవర్ కిడ్నాప్ చేశాడని, అపస్మారకస్థితికి చేరుకున్నాక ఆస్పత్రిలో వదిలి వెళ్లినట్లు ప్రచారం జరిగింది. ఈ ఘటన మంగళవారం వెలుగు చూడగా పోలీసులు ఐదు బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేపట్టారు. రైల్వే స్టేషన్ నుంచి ఆస్పత్రి వరకు ఉన్న షాపుల్లోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి స్టేషన్ తదితర అడ్డాల్లోని ఆటోడ్రైవర్లను విచారించారు.

రోడ్డు దాటుతుండగా...: ఆస్పత్రిలో గిరిజన మహిళ తన అత్తను చూపించాక ఇద్దరూ కలిసి ప్రధాన రహదారిపైకి చేరుకున్నారు. వైరా రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్ వద్ద మహిళను ద్విచక్రవాహనదారుడు బలంగా ఢీకొట్టడంతో ఎగిరి పడి ఆమె అపస్మారక స్థితికి చేరుకోగా.. ఓ ఆటోడ్రైవర్ స్పందించి ఆమెను జనరల్ ఆస్పత్రిలో చేర్చి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారని తెలిసింది. అయితే ఆమె అత్త మానసిక స్థితి సరిగా లేకపోవడంతో వివరాలు సరిగ్గా చెప్పలేకపోవడం, ఆటోలో తీసుకెళ్లినట్లు మాత్రం చూచాయగా చెప్పడం, మూడు రోజులు గాలించినా ఆచూకీ లేకపోవడంతో కుటుంబీకులు కిడ్నాప్, ఆపై అఘాయిత్యం జరిగినట్లు భావించారు. ఈ మేరకు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా విచారించగా ఆమె రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆపై ఆస్పత్రిలో మృతి చెందిందనే నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు గురువారం పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

పిచ్చి కుక్క దాడిలో వృద్ధురాలి మృతి

నెక్కొండ: పిచ్చి కుక్క దాడిలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సట్ల వీరమ్మ (80) బుధవారం మధ్యాహ్నం ఇంటి ముందు మంచంపై పడుకొంది. ఆ సమయంలో అటుగా వచ్చిన కుక్క ఆమె ముఖంపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అది గమనించిన ఆమె కుమారులు వీరమ్మను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వీరమ్మ మృతి చెందింది.

వరంగల్‌లో ప్రత్యామ్నాయ లోడ్ డిస్పాచ్ సెంటర్

- హైదరాబాద్‌లోని ఎస్ఎల్డీసీ ఆధునీకరణ

సాక్షి, హైదరాబాద్: వరంగల్ నగరంలో ప్రత్యా మ్నాయ స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్(ఎస్ఎల్డీసీ)ను ఏర్పాటు చేయాలని తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో) నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో ఉన్న ఎస్ఎల్డీసీ కేంద్రాన్ని సైతం ఆధునీకరించనుంది. రూ.96.48 కోట్ల అంచనాలతో ఈ పనులకు అనుమతిస్తూ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థల మధ్య సమన్వయకర్తగా పని చేస్తూ.. విద్యుత్ సరఫరా వ్యవస్థ (గ్రిడ్) పరి రక్షణలో లోడ్ డిస్పాచ్ సెంటర్ కీలకంగా వ్యవహరిస్తుంది. విద్యుత్ డిమాండ్‌లో హెచ్చుతగ్గులకు తగ్గట్టు ఎప్పటికప్పుడు విద్యుదుత్పత్తి, సరఫరా, పంపిణీ జరిగేలా ఆయా వ్యవస్థలను ఎస్ఎల్డీసీ సమన్వయపరుస్తుంది. డిమాండ్‌కి తగ్గట్టు ఈ వ్యవస్థలు పనిచేయని పక్షంలో విద్యుత్ గ్రిడ్ కుప్పకూలి రాష్ట్రం అంతటా అంధకారం నెలకొనే ప్రమాదం ఉంటుంది.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ కార్యాలయం, జగిత్యాల
టెండరు ప్రకటన
No.DB2/03/DPRE-J/2023-24, తేది: 03-05-2023
పనుల సంఖ్య: (17), జగిత్యాల జిల్లాలోని జగిత్యాల మండలంలోని జగిత్యాల టౌన్‌లో వివిధ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.67.00 లక్షలు, బిడ్ ముగింపు తేది: 16-05-2023. తదుపరి వివరాలను జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్, జగిత్యాల నుండి పొందవచ్చును. ఇ-మెయిల్ ID: prjgl@yahoo.com
సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్, జగిత్యాల జిల్లా
DIPR RO No.257-DP/CL/Advt/1/2023-24, Dt: 03.05.2023

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
NIT No: 66 to 80/2022-23 తేది: 01.05.2023
పనుల సంఖ్య: (15), పని పేరు: కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గంలో SDF నిర్మాణం కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: 140.00 లక్షలు. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను 08.05.2023 తేది నుండి ఉ. 10.30 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు చివరి తేది ఆన్‌లైన్‌లో ప్రతీ NIT ప్రచురణ తేది నుండి (7) పనిరోజులు. అన్ని తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అంటే www.tender.telangana.gov.in లో చూడవచ్చును
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, PRED, బాన్సువాడ
DIPR RO No.1140-PP/CL/ADVT/1/2023-24, Dt:03/05/2023

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ కార్యాలయం PIU డివిజన్, మహబూబ్‌నగర్ జిల్లా
టెండరు ప్రకటన
Lr.No.TO 01 to 08/MBNR/2023-24, తేది: 02-05-2023
పనుల సంఖ్య: (08), పనుల పేర్లు: మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌కొండ (02), సీసీ కుంట మండలం (01) మరియు నవాబ్‌పేట మండలం (01) మరియు జడ్చర్ల (01), హన్వాడ (01), మహబూబ్‌నగర్ (02). మొత్తం అంచనా వ్యయం: రూ.60.00 లక్షలు, టెండరు ప్రకటన ప్రారంభ తేది: 10-05-2023, ముగింపు తేది: 12-05-2023.
సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్, PIU డివిజన్, మహబూబ్‌నగర్
DIPR RO No.249-DP/CL/Advt/1/2023-24, Dt: 03.05.2023

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
No.51/TUFIDC/SPL, B-KTD & BPL/2022-23, తేది: 02.05.2023
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం మరియు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో పనులు-6 పనులు. అంచనా వ్యయం : రూ. 1265.00 లక్షలు. డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 06.05.2023. ముగింపు తేది : 15.05.2023. తదుపరి వివరాలు: www.tender.telangana.gov.in
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH) UNIT-I, TUFIDC, వరంగల్
DIPR RO No.245-DP/CL/Advt/1/2023-24, Dt: 03.05.2023

తెలంగాణ ప్రభుత్వం
పర్యవేక్షక అధికారి కార్యాలయం, సాగునీటి పారుదల శాఖ, కామారెడ్డి జిల్లా
టెండరు ప్రకటన
1) టెండర్ నోటీసు నంబర్: 06/SE/IC/KMR/2023-24, Dt: 29-04-2023, రూ. 34.33 లక్షలకు (మిషన్ కాకతీయ), 07/SE/IC/KMR/2023-24, Dt: 29-04-2023, రూ. 23.33 లక్షలకు (మిషన్ కాకతీయ) & 08/SE/IC/KMR/2023-24, Dt: 01-05-2023, రూ. 19.43 లక్షలకు (మీడియం ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఓ. & ఎమ్) పనులకు లభ్యమగు తేది: 03-05-2023, ఉదయం 11.00 గం. నుండి 17-05-2023, సాయంత్రం 5.00 గం. వరకు టెండర్ ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడగలరు.
సం/-సూపరింటెండింగ్ ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, కామారెడ్డి
DIPR RO No. 1178-PP/CL/ADVT/1/2023-24, Dt: 03-05-2023

తెలంగాణ ప్రభుత్వం
ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కార్యాలయం, మంచిర్యాల
షార్ట్ టెండర్ ప్రకటన
గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, మంచిర్యాల నందు బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (రూల్ 2016) 2023-24 సంవత్సరానికి గాను షార్ట్ టెండర్ కోరుచున్నాము. టెండర్ ఫారం మరియు ఇతర పూర్తి వివరాలకు 05-05-2023 నుండి 12-05-2023 వరకు పనిదినములలో సూపరింటెండెంట్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, మంచిర్యాల కార్యాలయంలో సంప్రదించగలరు.
సం/- సూపరింటెండెంట్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, మంచిర్యాల
DIPR RO No.1176-PP/CL/Advt/1/2023-24, Dt. 03.05.2023

మున్సిపల్ కౌన్సిల్ :: భూపాలపల్లి
No.E1/CT No.02/MCBHPL/e-procurement/2023 సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 02-05-2023
కమిషనర్ సూచనల మేరకు వివిధ గ్రాంట్స్ క్రింద రూ.43.00 లక్షల మొత్తంతో వివిధ పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద ఆన్‌లైన్ టెండరు సిస్టం ద్వారా టెండర్లు కోరడానికి ప్రతిపాదించడమైనది. ఆన్‌లైన్‌లో బిడ్ల దాఖలుకు చివరి తేదీ/ సమయం: 12-05-2023న సా.4.00 గం.వరకు. బిడ్లు తెరుచు తేది:12-05-2023న సా.5.00 గం. సంబంధిత కమిషనర్ పేరు & చిరునామా: శ్రీ కే. అనిల్‌కుమార్, కమిషనర్ FAC, మున్సిపల్ కౌన్సిల్, భూపాలపల్లి, ఫోన్ నం.8978180029. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.tender.telangana.gov.in లో చూడవచ్చును. పనుల డౌన్‌లోడింగ్ ప్రారంభం: 03-05-2023 సా.05.00 గం. నుండి I&PR శాఖ ద్వారా.
సం/- కమిషనర్, మున్సిపల్ కౌన్సిల్, భూపాలపల్లి
DIPR RO No.1144-PP/CL/Advt/1/2023-24, Dt: 03.05.2023

తెలంగాణ ప్రభుత్వము
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, పెబ్బేరు. ఫోన్ 08545-220474
ఈ క్రింది పనులకు టెండర్లను ఆహ్వానించనైనది: క్రమ సంఖ్య నెం.:1, టెండర్ నోటీసు నెం.: 02/SE/ICPBR/2023-24, Dt: 28.04.2023 (Waddera/Sagara Reserved). పని పేరు: పి.జె.పి-ఎల్.ఎం.సి. - బ్రాంచ్ కెనాల్ - జంగిల్ క్లియరెన్స్, కి.మీ. 0.00 నుండి కి.మీ. 15.00 వరకు సిల్ట్ తొలగింపు మరియు దెబ్బతిన్న లైనింగ్ మరమ్మతులు వనపర్తి (జిల్లా)లోని చిన్నంబావి (మం) మరియు నాగర్‌కర్నూల్ (జిల్లా)లోని పెంట్లవెల్లి (మం) - వడ్డెర/సగర సంఘాలు మాత్రమే పాల్గొనడానికి అర్హులు. అంచనా విలువ: రూ.24.822 లక్షలు. పై పనులకు టెండర్లను స్వీకరించు చివరి తేది: 15.05.2023 మ.3.00 వరకు. టెక్నికల్ బిడ్ తెరచు సమయం: 15.05.2023 సా.5.00 గంటలకు. గమనిక: మిగతా వివరములకు www.eprocurement.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.
DIPR RO No. 235-DP/CL/ADVT/1/2023-24, Dt: 03-05-2023 సం/- పర్యవేక్షక ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, పెబ్బేరు

తెలంగాణ ప్రభుత్వము
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, కోదాడ
టెండర్ నోటీస్ సంఖ్య: 03/2023-24, తేది:02.05.2023. పని పేరు: సూర్యాపేట జిల్లా, గరిడేపల్లి మండలం, రాయినిగూడెం గ్రామంలో గల సూరలదేవి చెరువు అలుగు శాశ్వత మరమ్మతు చేయుట గురించి. మొత్తం అంచనా విలువ: రూ.41.13 లక్షలు. గమనిక: టెండర్లు స్వీకరించు చివరి తేది మరియు సమయం: 10.05.2023 మ.3.00 వరకు. మిగతా వివరములకు https://tender.telangana.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.
సం/- యస్. నరసింహా రావు, బి.టెక్, పర్యవేక్షక ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, కోదాడ
DIPR RO No. 246-DP/CL/ADVT/1/2023-24, Dt: 03-05-2023

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి జిల్లా
ఇ-మెయిల్: ramagundam.corporation@gmail.com
టెండరు ప్రకటన
NIT No.06/EE/GIRMC/2023, పని పేరు: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో గాంధీ చౌరస్తా వద్ద పైలాన్ కోసం పెడెస్టల్ నిర్మాణం (1 పని). అంచనా వ్యయం: రూ.3.00 లక్షలు, టెండరు ప్రక్రియ షెడ్యూలు: బిడ్ దాఖలు ప్రారంభ తేది: 04-05-2023, ఉ.10.30 గం., బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 05-05-2023 ఉ.10.30 గం., ధర బిడ్ తెరచు తేది: 06-05-2023న ఉ.10.45 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
&
కొటేషన్ ప్రకటన
EOI నోటీస్ నం.02/EE/RMC/2023, dt:03.05.2023
[illegible] The Commissioner, Ramagundam Municipal Corporation, Near Busstand, Beside Petrol Bunk, Godavarikhani [illegible] 04-05-2023న 16.00 గం.కు [illegible]
సం/- కమిషనర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No.1174-PP/CL/Advt/1/2023-24, Dt: 03.05.2023

ICMR-NATIONAL INSTITUTE OF NUTRITION
(Indian Council of Medical Research)
Jamai Osmania Post, Tarnaka, Hyderabad-500007, TS.
Advt.No. 183/Projects/APR /2023 Date: 03.05.2023
WALK-IN INTERVIEW
Eligible candidates are invited to attend the Walk-in-Interviews for various Project Posts for Pan India Study entitled "Diet and Biomarker Survey in India (DABS-I)" funded by ICMR. The Interviews will be held on 11th and 12th May, 2023 at ICMR-National Institute of Nutrition, Hyderabad, Telangana State.
For more details visit our website: nin.res.in/employement.html.
Sd/-
Sr. Administrative Officer for Director

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society, Ministry of MSME)
Balanagar, Hyderabad, PIN - 500 037.
ADMISSION FOR DIPLOMA COURSES

S.No	Course Details	Eligibility for Admission	Age Limit	Duration of Study
1	Diploma in Tool, Die & Mould Making (DTDM)	10th Pass with 50% for General & 45% for SC/ST	Minimum 15 years Maximum 19 years	4 Years
2	Diploma in Electronics & Communication Engineering (DECE)	10th Pass	Maximum 19 years	3 Years
3	Diploma in Automation & Robotics Engineering (DARE)			3 Years
4	Diploma in Production Engineering (DPE)			3 Years

To Apply: Scan the QR Code:
Further details can be obtained from prospectus available on Institute website "www.citdindia.org" under the link "Diploma Admissions-2023".
Contact Details : Room No.102, Diploma Block, Phone No.: 9502405170, 040-29561795. E-Mail: training@citdindia.org
Website: www.citdindia.org
Sd/-
PRINCIPAL DIRECTOR

క్లుప్తంగా

ప్రపంచ బ్యాంక్ అధ్యక్షునిగా అజయ్ బంగా



వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా పలు దిగ్గజ సంస్థలకు సారథులుగా వెలుగొందుతున్న భారతీయుల జాబితాలో ప్రముఖ భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త అజయ్ బంగా నిలిచారు. ప్రపంచ బ్యాంక్ అధ్యక్షునిగా ఎంపికయ్యారు! ఆయన నియామకాన్ని ఖరారుచేస్తున్నట్లు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు బుధవారం ప్రకటించారు. జూన్ రెండో తేదీ నుంచి ఐదేళ్లపాటు అధ్యక్షునిగా బంగా సేవలందిస్తారని బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఒక భారతీయ అమెరికన్ అధ్యక్షుడు ప్రపంచ బ్యాంక్ పగ్గాలు చేపట్టడం ఇదే తొలిసారి. 63 ఏళ్ల బంగాను ఫిబ్రవరిలో అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఈ పదవికి నామినేట్‌చేశారు. బంగా జనరల్ అట్లాంటిక్ సంస్థ ఉపాధ్యక్షునిగా, మాస్టర్ కార్డ్ సీఈవోగా చేశారు. కేంద్రం 2016లో ఆయనను పద్మశ్రీతో సత్కరించింది.

ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచీలో భారత్ నేలచూపులు

న్యూఢిల్లీ: ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచీ-2023లో భారత్ 11 స్థానాలు దిగజారింది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా బుధవారం విడుదల చేసిన నివేదికలో 161వ ర్యాంక్‌తో సరిపెట్టుకుంది. 180 దేశాల్లో పత్రికారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల ఆధారంగా ఇచ్చే ఈ ర్యాంకుల్లో గతేడాది భారత్ 150వ స్థానంలో నిలిచింది. దీనిపై పత్రికా సంఘాలు ఆందోళన వ్యక్తంచేశాయి. 'భారత్ సహా పలు దేశాల్లో పత్రికా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కల్గుతోందని స్పష్టమవుతోంది. మీడియా క్రియాశీలక పాత్ర పోషించలేకపోవడం దారుణం'' అని ది ఇండియన్ విమెన్స్ ప్రెస్ కోర్స్, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ప్రెస్ అసోసియేషన్ ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

బలగాలకు మిల్లెట్స్ వంటలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ తృణ ధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకొని సాయుధ బలగాలకు ఇచ్చే ఆహారంలో కేంద్ర హోం శాఖ మార్పులు చేసింది. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్), జాతీయ విపత్తు సహాయ బలగం (ఎన్‌డీఆర్‌ఎఫ్) సిబ్బందికి మిల్లెట్ వంటకాలను అందించనుంది. ఇకపై వారి ఆహారంలో 30% అవే ఉంటాయని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాదిని అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా ఐరాస ప్రకటించడం తెలిసిందే.

పుతిన్‌పై హత్యాయత్నం

క్రెమ్లిన్‌పై డ్రోన్ దాడులు: రష్యా ● ఉక్రెయిన్ పనేనని తీవ్ర ఆరోపణ

- భారీ మూల్యం తప్పదని హెచ్చరిక
- అధ్యక్షుడు క్షేమమని వెల్లడి
- తమకు సంబంధం లేదన్న ఉక్రెయిన్
- కీవ్‌పై డ్రోన్లు, బాంబుల వర్షం

కీవ్: అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను హత్య చేసేందుకు ఉక్రెయిన్ ప్రయత్నిస్తోందని రష్యా తీవ్ర ఆరోపణలు చేసింది. అందులో భాగంగా బుధవారం తెల్లవారజామున అధ్యక్ష భవనం క్రెమ్లిన్‌పై రెండు డ్రోన్ దాడులు జరిగాయని ప్రకటించింది. ఇది మతిమాలిన ఉగ్రవాద చర్య అంటూ మండిపడింది. ఇందుకు తీవ్రస్థాయిలో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించింది. భారీ స్థాయిలో ప్రతి దాడి ఉంటుందని ప్రకటించింది. సరైన సమయంలో దీటుగా స్పందిస్తామంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేసింది. ఉక్రెయిన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తామన్నదే వాటి అంతరార్థమని భావిస్తున్నారు. ''దాడులను భగ్నం చేశాం. మా భద్రతా దళాలు డ్రోన్లలో మధ్యలోనే పేల్చేశాయి. ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. క్రెమ్లిన్ భవనానికీ నష్టం జరగలేదు. ఆ సమయంలో పుతిన్ క్రెమ్లిన్‌లో లేరు. మాస్కో ఆవల నోవో ఒగర్యోవో నివాసంలో సురక్షితంగా ఉన్నారు'' అని ఆయన అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ తెలిపారు. మే 9న నగరంలో జరగాల్సిన విక్టరీ డే పరేడ్‌ను అడ్డుకోవడం కూడా దాడి లక్ష్యమని ఆరోపించారు. పరేడ్ యథాతథంగా జరుగుతుందని ప్రకటించారు.

దాడిపై అనుమానాలు

క్రెమ్లిన్‌పై డ్రోన్ దాడులు జరిగినట్టు అధికారికంగా ధ్రువీకరణ కాలేదు. రష్యా కూడా ఇందుకు సంబంధించి ఎలాంటి రుజువులూ బయట పెట్టలేదు. దాడి జరిగితే ఆ విషయాన్ని 12 గంటల పాటు ఎందుకు దాచారన్న దానిపైనా వివరణ లేదు. క్రెమ్లిన్‌పై డ్రోన్ దాడిగా చెబుతున్న వీడియోలు మాత్రం వైరల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో మాస్కోలో డ్రోన్లపై పూర్తిస్థాయి నిషేధం విధించారు. రష్యా ఆరోపణలను ఉక్రెయిన్ తీవ్రంగా ఖండించింది. క్రెమ్లిన్‌పై జరిగినట్టు చెబుతున్న డ్రోన్ దాడులతో తమకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేసింది. తమపై యుద్ధాన్ని తీవ్రతరం చేసేందుకు బహుశా ఈ ఉదంతాన్ని సాకుగా రష్యా వాడుకోవచ్చని అభిప్రాయపడింది. తమ నగరాలపై జరుపుతున్న తీవ్ర స్థాయి సైనిక దాడులను ఇలా సమర్థించుకో జూస్తోందని ఆరోపించింది. ఉక్రెయిన్‌తో రష్యా 14 నెలలుగా పూర్తిస్థాయి యుద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. రష్యా అంచనాలను పూర్తిగా తలకిందులు చేస్తూ దాడులను ఉక్రెయిన్ దీటుగా తిప్పికొడుతూ వస్తోంది.



క్రెమ్లిన్ భవనంపై డ్రోన్‌ను పేల్చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో సర్కిల్లో) పేల్చివేతకు క్షణాల ముందు డ్రోన్



ఏం జరిగింది?

దాడికి సంబంధించి పలు వీడియోలు వైరల్‌గా మారాయి. ఒకదాంట్లో క్రెమ్లిన్‌పైకి డ్రోన్ దూసుకొస్తూ కన్పించింది. అతి సమీపానికి వచ్చాక పేలిపోయి నేల కూలింది. క్రెమ్లిన్, సమీప భవనాల మీదుగా పొగ వస్తున్న వీడియోలు కూడా వైరల్‌గా మారాయి. దాడికి సంబంధించి క్రెమ్లిన్ పక్కనున్న నది ఆవల నుంచి తీసినట్టు చెబుతున్న వీడియో మాస్కో స్థానిక టెలిగ్రా చానల్లో రాత్రి పూట ప్రసారమైంది. డ్రోన్ శకలాలు అధికార భవన ఆవరణలో పడ్డట్టు క్రెమ్లిన్ వెబ్‌సైట్ కూడా పేర్కొంది. తెల్లవారుజాము 2 గంటల ప్రాంతంలో భారీ శబ్దాలు, పొగ వచ్చినట్టు స్థానికులు చెప్పుకొచ్చారు. దీనిపై రష్యాలో ప్రభుత్వ అనుకూల వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తక్షణం ప్రతి దాడులకు దిగి ఉక్రెయిన్ సీనియర్ నాయకులను వరుసబెట్టి అంతం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

జెలెన్‌స్కీ 'నిర్ణాయక దాడి' వ్యాఖ్యల నేపథ్యంలో ఘటన

- ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ తాజాగా ఫిన్లండ్‌లో ఆకస్మికంగా పర్యటించారు.
- రష్యాను ఎదుర్కొనేందుకు మరిన్ని శక్తిమంతమైన ఆయుధాలు అందజేయాలని ఐదు నోర్డిక్ దేశాలు ఫిన్లండ్, స్వీడన్, నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్‌లను గట్టిగా కోరారు.
- ఈ సందర్భంగా హెల్సింకీలో మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్ అతి త్వరలో ప్రతిదాడికి దిగనుందని ప్రకటించారు.
- ''విజయం కోసం నిర్ణాయక దాడి చేయనున్నాం'' అని చెప్పు కొచ్చారు. తర్వాత కాసేపటికే రష్యా నుంచి డ్రోన్ దాడి ఆరోపణ వెలువడింది.
- మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మరింత తీవ్రతరమయ్యాయి. రాజధాని కీవ్‌పై ఇరాన్ తయారీ డ్రోన్లతో రష్యా సైన్యం దాడులకు పాల్పడింది.
- 21 డ్రోన్లను కూల్చేసినట్టు ఉక్రెయిన్ సైన్యం ప్రకటించింది. మరోవైపు దక్షిణ రష్యాలో క్రాస్నోడర్ ప్రాంతంలో ఓ చమురు డిపోలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది.
- ఇది రష్యా సరఫరా వ్యవస్థలను లక్ష్యం చేసుకుని కొంతకాలంగా ఉక్రెయిన్ చేస్తు న్న దాడుల్లో భాగమేనని భావిస్తున్నారు.



కేదార్‌నాథ్ ఆలయానికి వెళ్లే దారిలో బైరవ్/కుబేర్ గ్లేసియర్ వద్ద బుధవారం భారీగా హిమపాతం జరగడంతో మంచులో కూరుకుపోయిన యాత్రికులను రక్షిస్తున్న ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు స్పందన దళ సభ్యులు

టీనేజీ విద్యార్థి ఘాతుకం

- తుపాకీ కాల్పుల్లో ఎనిమిది మంది చిన్నారుల దుర్మరణం
- సెర్బియాలో దారుణం

బెల్‌గ్రేడ్: ఐరోపా దేశం సెర్బియాలో ఓ విద్యార్థి జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో అభంశుభం తెలియని ఎనిమిది మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. స్కూల్ గార్డు సైతం తూటాలకు బలయ్యాడు. దేశ రాజధాని బెల్‌గ్రేడ్ సమీపంలోని వ్లాదిస్లావ్ రిబ్నివాక్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉదయం 8.40గంటలకు ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తండ్రి తుపాకీని పాఠశాలకు పట్టుకొచ్చిన 13 ఏళ్ల కోస్టా కెక్‌మనోవిక్ అనే కుర్రాడు చరిత్ర పాఠాలు చెబుతుండగా తరగతి గదిలోకొచ్చి కాల్పులు జరిపాడు. అంతకుముందు అడ్డుకోబోయిన స్కూల్ గార్డ్‌పైకీ కాల్పుల మోత మోగించాడు. దీంతో ఎనిమిది మంది చిన్నారులు, గార్డు అక్కడికక్కడే మరణించారు. 'ముందుగా టీచర్‌పైకి తుపాకీ ఎక్కుపెట్టి కాల్చాడు. భయంతో డెస్కుల మాటున దాక్కున్న విద్యార్థులపైకి తుపాకీ గుళ్ల వర్షం కురిపించాడు. అదృష్టంకొద్దీ కొందరు వెనుక తలుపు నుంచి తప్పించుకున్నారు' అని ప్రత్యక్ష సాక్షి అయిన ఒక విద్యార్థిని చెప్పింది. గాయపడిన ఆరుగురు విద్యార్థులు, ఒక టీచర్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. విషయం తెల్సుకుని అక్కడికి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు అక్కడే ఉన్న ఆ పిల్లాడిని అదుపులోకి తీసుకున్నారు. 'అప్పుడు నేను కింది అంతస్తులో స్పోర్ట్స్ క్లాస్‌లో ఉన్నా. హఠాత్తుగా తుపాకీ శబ్దం మొదలై ఆగకుండా వినిపి స్తూనే ఉంది' అని ఆ స్కూల్ విద్యార్థి ఒకరు చెప్పారు.



పక్కా ప్రణాళికతో..

ముందస్తు ప్రణాళికతోనే టీనేజర్ కాల్పులకు తెగబడ్డాడని పోలీసులు చెప్పారు. 'దాడి చేయాల్సిన గది స్కెచ్‌లు నెల క్రితమే గీసుకున్నాడు. ఎవరెవరిపై తుపాకీ ఎక్కుపెట్టాలో జాబితా రాసుకున్నాడు. మొదట గార్డును చంపేశాడు. తర్వాత హాల్‌లో ముగ్గురు విద్యార్థుల్ని మట్టుబెట్టాడు. ప్లాన్ ప్రకారం ఎంట్రన్స్ దగ్గరే ఉన్న క్లాస్‌రూమ్‌లో కాల్పులకు దిగాడు. తర్వాత పోలీసులకు ఫోన్ చేశాడు'' అని వివరించారు.

స్వలింగ సమస్యలపై కమిటీ

- సుప్రీంకోర్టుకు కేంద్రం నివేదన
- అభిప్రాయాల ఆధారంగా పోలేం
- నిబంధనలను బట్టే వెళ్తాం: సీజేఐ



న్యూఢిల్లీ: స్వలింగ జంటల సమస్యల పరిష్కారానికి కేబినెట్ సెక్రెటరీ సారథ్యంలో కమిటీ ఏర్పాటు చేస్తామని కేంద్రం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలంటూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. స్వలింగ జంటలకు జాయింట్ బ్యాంకు ఖాతాలు, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ పథకాల్లో స్వలింగ భాగస్వామిని నామినీగా చేర్చడం వంటివాటిపై నెలకొన్న సమస్యలను ఏప్రిల్ 27 నాటి విచారణ సందర్భంగా ధర్మాసనం లేవనెత్తింది. వీటి పరిష్కారానికి ఏం చేయొచ్చో ఆలోచించాలని సూచించింది. ఈ విషయంలో కేంద్రం సానుకూలంగా ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. కోర్టు అంగీకరిస్తే కమిటీ వేసి అన్ని అంశాలనూ కూలంకషంగా పరిశీలిస్తామని వివరించారు. పిటిషనర్ల సలహాలు, సూచనలను కూడా కమిటీ పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. అందుకు తమకభ్యంతరం లేదని పిటిషనర్ల తరఫున సీనియర్ లాయర్ ఎ.ఎం.సింఘ్వి అన్నారు. అయితే దీనివల్ల పరిష్కారం లభించదన్నారు. ధర్మాసనమే దీనిపై సమగ్రమైన తీర్పు వెలువరించాలని కోరారు. కేంద్రం సూచనను ఓ చక్కని ముందడుగుగా న్యాయమూర్తి జస్టిస్ భట్ అభివర్ణించారు. స్వలింగ జంటలు ఎదుర్కొంటున్న చాలా సమస్యలకు కమిటీతో పరిష్కారం లభించగలదని అభిప్రాయపడ్డారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత అంశాన్ని సమగ్రంగా పరిశీలించి తీర్పు వెలువరిస్తామని సీజేఐ పేర్కొన్నారు. సహజీవనం చేస్తున్న స్వలింగ జంటల్లో 99 శాతం మంది పెళ్లి చేసుకోవాలనే కోరుకుంటున్నట్టు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సౌరభ్ కృపాల్, మేనకా గురుస్వామి తదితరులు చెప్పగా సీజేఐ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''అవతలి వర్గం కూడా తమ వాదనకు మద్దతుగా బోలెడన్ని గణాంకాలు చూపిస్తారు. అందుకే మేం ఇలాంటి మెజారిటీ నైతికతనో మరోదాన్నో ప్రాతిపదికగా తీసుకుని విచారణ జరపలేం. రాజ్యాంగ నియమ నిబంధనలను బట్టే ముందుకెళ్తాం'' అని స్పష్టం చేశారు. తదుపరి వాదనలు మే 9న కొనసాగనున్నాయి.

ఈడీ డైరెక్టర్‌గా ఇంకెవరూ పనికిరారా?

ఈడీ డైరెక్టర్‌గా వరుసగా మూడోసారి సంజయ్ కుమార్ మిశ్రాకు పదవీ కాలం పెంచడంపై సుప్రీం కోర్టు మండిపడింది. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పదవిని చేపట్టడానికి మిశ్రా తప్ప సంస్థలో మరెవరూ లేరా అని ప్రశ్నించింది. మూడోసారి కూడా ఆయనకే పదవీ కాలం పొడిగించాల్సిన ఆవశ్యకత ఏముందని ప్రశ్నించింది. మిశ్రా పదవీకాలాన్ని పొడిగించవద్దని ఆదేశాలు జారీ చేసింది. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న వారికి పదవీకాలం ఎక్కువగా పొడగించకూడదని సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేసింది. ''ఈడీ డైరెక్టర్‌గా మిశ్రాకు మించిన వారు మరెవరూ లేరని మీరు భావిస్తున్నట్టున్నారు. ఆయన రిటైరయ్యాక ఎవరిని నియమిస్తారు?'' అని జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్‌ల బెంచ్ నిలదీసింది. కీలక కేసుల్ని విచారిస్తున్నప్పుడు ఒకరి ఆధ్వర్యంలో అయితే విచారణ సరిగా సాగుతుందని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు.

ఆరు రాష్ట్రాలతో సరిహద్దులు | 40-50 స్థానాల్లో తెలుగువారి ప్రభావం

వలస ఏ పార్టీకో..!

సాక్షి బెంగళూరు : కర్ణాటక ఎన్నికల్లో ఒక పార్టీ విజయం సాధించాలంటే కన్నడిగుల ఓట్లు మాత్రం పడితే చాలనుకుంటే పొరపాటు పడ్డట్లే..! దశాబ్దాలుగా కన్నడ నాట ఇరుగు పొరుగు రాష్ట్రాల ఓటర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. మరే ఇతర రాష్ట్రానికి లేని విధంగా దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక ఏకంగా ఆరు రాష్ట్రాలతో సరిహద్దుల్ని పంచుకుంటోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలతో సరిహద్దులున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే వలసలు ఎక్కువే. బెంగళూరు వంటి మహానగరంలో వ్యాపారాలు, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన వారెందరో ఉన్నారు. రాష్ట్రంలో 65.45 లక్షల మందివరకు వలసదారులు ఉన్నారు. వీరి ఓట్ల కోసం అన్ని పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇక ఈ సారి ఎన్నికల బరిలో కూడా ఎందరో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తెలుగు మూలాలున్న వారు 100 మంది, మరాఠా మూలాలున్న వారు 50 మందికి పైగా, తమిళులు 10 మంది వరకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

తెలుగు వాడి వేడి

కర్ణాటకలో దాదాపుగా 40-50 అసెంబ్లీ స్థానాల్లో తెలుగువారి ప్రభావం అధికంగా ఉంది. రాష్ట్రంలో సుమారు కోటి మంది వరకు తెలుగు ప్రజలు కర్ణాటకలో నివసిస్తున్నట్లు అనధికారిక సమాచారం. పలు దశాబ్దాలుగా వివిధ కారణాలతో కర్ణాటకకు వచ్చి ఇక్కడి కన్నడిగులతో మిళితమై తెలుగు వారు జీవనం సాగిస్తున్నారు. ఉద్యోగ, వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడిపోయారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని నిర్వహిస్తున్న వారిలో అధిక భాగం తెలుగు ప్రాంత ప్రజలే కావడం గమనార్హం. ఒక్క బెంగళూరులోనే సుమారు 25 లక్షలకు పైగా తెలుగు వారు ఉన్నారు. కర్ణాటకలో కన్నడ, ఉర్దూ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాషల్లో తెలుగు మూడో స్థానంలో ఉంది. బెంగళూరులోని కేఆర్ పురం, రామ్మూర్తినగర, హెబ్బాళ, మారతహళ్లి, మహదేవపుర, యలహంకా, దేవనహళ్లితో పాటు ఏపీ, తెలంగాణ సరిహద్దు కలిగిన బళ్లారి జిల్లా, బీదర్, కలబురిగి, రాయచూరు, యాదగిరి, బసవకల్యాణ, కోలార, తుమకూరు, చిత్రదుర్గ, చిక్కబళ్లాపుర జిల్లాల్లో తెలుగు వారు అధికంగా ఉన్నారు. 1947లో ఏర్పడిన మైసూరు రాష్ట్రానికి తెలుగు వ్యక్తి క్యాసంబల్లి చెంగరాయరెడ్డి ఎన్నికయ్యారు. 1956లో కర్ణాటక రాష్ట్రం ఏర్పడ్డాక ఎందరో తెలుగువారు రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు.

బెంగళూరులో ఎవరి జనాభా ఎంత?

- రాజధానిలో 44 శాతం కన్నడిగులు ఉంటే 56 శాతం ఇతర భాషా ప్రజలు ఉన్నారు. తెలుగు వారు అత్యధికంగా 25-30 లక్షల మంది ఉన్నారు.
- తమిళులు 16-17 లక్షల మంది ఉంటే మలయాళీలు 4-5 లక్షలు ఉన్నారు
- ఇక ఉత్తరాది రాష్ట్రాల జనాభా 11-12% ఉన్నారు. రాజస్తాన్, బిహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. ఇటీవల కాలంలో జార్ఖండ్, త్రిపుర నుంచి కూడా వలసలు పెరిగాయి.
- రాజస్తాన్‌కు చెందిన జైన సామాజికవర్గం ప్రజలు బెంగళూరులో చాలా చోట్ల నివసిస్తూ ఎన్నికల్లో నిర్ణయాకత్మక మైన పాత్రను పోషిస్తున్నారు.




కన్నడ పోరు

ఓట్ల కోసం వ్యూహాలు

కర్ణాటకకు పొట్ట చేతపట్టుకొని వచ్చిన వలసదారులు గుర్తింపు సమస్యని అధికంగా ఎదుర్కొంటున్నారు. 65 లక్షల మంది వలసదారుల్లో ఎంత మందికి కర్ణాటకలో ఓటు హక్కు ఉందో అన్న దానిపై స్పష్టమైన గణాంకాలేవీ లేవు. కార్మికులుగా పని చేస్తున్న వారికి తాగు నీరు, ఉండడానికి ఇల్లు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటివన్నీ సమస్యలుగానే ఉన్నాయి. టీ, కాఫీ తోటల్లో పని చేస్తున్న కూలీలు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. అధికార బీజేపీ వీరిని సంప్రదిస్తూ రేషన్ కార్డులు ఇప్పించడం, ప్రభుత్వం పథకాలు వారికి అందేలా చూస్తామని హామీలు ఇస్తోంది. వలసదారుల ఓట్లను రాబట్టేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన యువ ఎమ్మెల్యేలు, ఎంపీలను రంగంలోకి దింపింది. గుజరాత్‌కు చెందిన హార్దిక్ పటేల్ సహా వివిధ రాష్ట్రాల యువ నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా వివిధ భాషలకు చెందిన వారి ఓట్లను రాబట్టేందుకు ఆయా రాష్ట్రాల నాయకుల్ని ప్రచార పర్వంలోకి తీసుకువచ్చింది.

'జై బజరంగ బలీ' అంటూ ఓటేయండి

కర్ణాటక ఓటర్లకు ప్రధాని మోదీ పిలుపు ● కాంగ్రెస్‌పై ధ్వజం



శివాజీనగర/ముల్కీ: 'కాంగ్రెస్ అవినీతి వ్యవస్థను కూల్చేశానని నాపై పీకలదాకా కోపం పెంచుకున్నారు. నన్ను నిరంతరం అవమానిస్తున్నారు. నన్ను దూషిస్తూ ఓట్లడుగుతున్నారు. ఇలాంటి అవమాన సంస్కృతిని మీరు అంగీకరిస్తారా? పోలింగ్ కేంద్రంలో మీట నొక్కేటపుడు జై బజరంగ బలీ అని నినదించండి. తద్వారా వారికి బుద్ధి చెప్పండి' అని కర్ణాటక ఓటర్లకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్రంలో మూడు బహిరంగ సభల్లో మోదీ ప్రసంగించారు. ప్రతిచోటా మొదట్లో, చివర్లో జై బజరంగ బలీ అంటూ నినదించారు. బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీపై ప్రధాని మండిపడ్డారు. 'విభజించు, పాలించు సిద్ధాంతమే ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్ రాజకీయం నడుపుతుంది. ప్రపంచదేశాలు భారత్‌ను ఘనంగా కీర్తిస్తుంటే కాంగ్రెస్ నేతలు మాత్రం విదేశాల్లో పర్యటిస్తూ దేశ ప్రతిష్టను, సైన్యాన్ని అవమానించేలా దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. దేశాభివృద్ధికి, శాంతియుత వాతావరణానికి ప్రబల శత్రువు కాంగ్రెస్. ఎన్నికల లబ్ధి కోసం దేశ వ్యతిరేకులతోనూ ఒప్పందం చేసుకుంటోంది'' అంటూ దుయ్యబట్టారు.

ప్రజలే నా రిమోట్‌కంట్రోల్

140 కోట్ల మంది ప్రజలే తన రిమోట్ కంట్రోల్ అని మోదీ అన్నారు. ''కర్ణాటకను కాంగ్రెస్ ఏటీఎంలా వాడుకోవాలని చూస్తోంది. అలాంటి పార్టీని రాష్ట్రం నుంచి తరిమేయండి'' అని పిలుపునిచ్చారు.

40 శాతం కమీషన్లు కన్పించడం లేదా?

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రధానికి ప్రియాంక గాంధీ ప్రశ్న



సాక్షి, బళ్లారి: రాష్ట్రంలో మూడున్నర సంవత్సరాలు క్రితం అడ్డదారిలో ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వం 40 శాతం కమీషన్లు వసూలు చేస్తోందని కాంట్రాక్టర్లు ఆరోపిస్తుంటే ప్రధాని నరేంద్రమోదీ ఎందుకు నోరు మెదపడం లేదని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ ప్రశ్నించారు. కర్ణాటకలో విజయపుర జిల్లాలోని ఇండి నియోజకవర్గంలో బుధవారం ఎన్నికల ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ప్రధాని మోదీ సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి అని అందరూ కొనియాడుతూ ఉంటారని అలాంటప్పుడు ఆయనకు కర్ణాటకలో ప్రభుత్వం ఏం చేస్తోందో తెలీదా అని ఆమె ఎద్దేవా చేశారు. ప్రతీ పనికి 40% కమీషన్లు తీసుకుంటూ ఉంటే కర్ణాకటను అభివృద్ధికే నమూనాగా తీర్చిదిద్దుతానని ప్రధాని మోదీ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంట్రాక్టర్లు, రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పటికి బీజేపీ పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ అవినీతితో కంపెనీలు హైదరాబాద్, చెన్నై వైపు వెళుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ ప్రాంతం సమగ్రాభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఓట్ల కోసం తాను రాలేదని, వారి భవిష్యత్, పిల్లల భవిష్యత్ కోసమే వచ్చానంటూ ప్రియాంక భావోద్వేగంతో మాట్లాడారు.

'ఉపాధి'కి తగ్గిన బడ్జెట్

తగ్గిన లబ్ధిదారుల కుటుంబాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో లబ్ధి పొందుతున్న కుటుంబాల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ప్రతి ఏటా తగ్గుతున్న నిధుల కేటాయింపులకు తోడు ఆధార్ అనుసంధానిత చెల్లింపులు, ఆన్‌లైన్ హాజరు వంటి చర్యలతో పథకం కింద పనిచేసే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. కోవిడ్ సమయంలో సొంతూళ్లకు తిరిగి వచ్చిన వలసదారులకు ప్రధాన ఆర్థిక భద్రతగా ఉంటూ ఆసరాగా నిలిచిన ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారి సంఖ్య 2021 ఆర్థిక సంవత్సరం నుంచి తగ్గుతూ వస్తోందని కేంద్ర గణాంకాలు చాటుతున్నాయి. కోవిడ్ సమయంలో 2020-21లో రికార్డు స్థాయిలో 7.55 కోట్ల కుటుంబాలు దీనిద్వారా ఉపాధి పొందాయి. ఆ తర్వాత 2021-22 వచ్చేసరికి ఈ సంఖ్య 7.25కోట్లకు తగ్గింది. 2022-23 నాటికి 6.19 కోట్లకు పడిపోయింది. తగ్గిన కుటుంబాలకు తోడు పనిదినాల సంఖ్య కుచించుకుపోవడం ఆందోళనకరం. 2020-21లో సగటు పనిదినాల సంఖ్య 51.42 రోజులుకాగా, ఆ సంఖ్య 2022-23 ఏడాదికల్లా 47.84 రోజులకు పడిపోయింది. 2021-22లో కేంద్ర బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.98,467కోట్లు కేటాయించారు. 2022-23లో ఆ కేటాయింపులు కేవలం రూ.89వేల కోట్లకు పరిమితమయ్యాయి. ఈసారి బడ్జెట్‌లో కేవలం రూ.60వేల కోట్లే విదిల్చేందుకు సిద్ధమైంది. బడ్జెట్‌లేక పనిదినాలను కుదిస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

చొరబాటు యత్నం భగ్నం

సైన్యం కాల్పుల్లో ఇద్దరు ముష్కరుల హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని మఛిల్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ వెంట భారత భూభాగంలోకి చొరబడేందుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను సైన్యం హతమార్చింది. 'నిఘా సమాచారంతో వర్షం, మంచులోనూ సైన్యం, పోలీసులు రెండు రోజులు మాటు వేశారు. బుధవారం ఉదయం ఉగ్రవాదుల రాకను గుర్తించారు. రెండువైపుల నుంచి కాల్పులు జరిగాయి. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ముష్కరుల హతమయ్యారు ' అని శ్రీనగర్‌లోని ఆర్మీ అధికార ప్రతనిధి చెప్పారు. రెండు ఏకే రైఫిళ్లు, భారీగా మందుగుండు దొరికాయి.

సాక్షి కరీంనగర్

గురువారం : 4 : మే : 2023



ముగిసిన శిక్షణ శిబిరం

'సాక్షి' ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న చదరంగం శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. విజేతలకు మేయర్ సునీల్‌రావు బహుమతులు అందించారు. 8లో▸



ఘనంగా అన్నకూటోత్సవం

ధర్మపురి: నృసింహుని నవరాత్రోత్సవాల్లో భాగంగా 8వ రోజు ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నకూటోత్సవం నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉండి, వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వినూత్న నిరసన



గొడుగులతో కార్యదర్శుల నిరసన

కరీంనగర్: తమ సమస్యలు పరిష్కరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన శాంతియుత దీక్షలో బుధవారం గొడుగులు పట్టుకుని వినూత్న నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొహిబిషన్ పీరియడ్ అయిపోయినప్పటికి రెగ్యులరైజ్ చేయకుండా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం ఉద్యోగంలో చేరిన తమను నామమాత్రపు జీతాలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని మండిపడ్డారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రాజు, కిరణ్, ప్రభాకర్, సల్మాన్, నరేశ్, మమత, స్వప్న పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అదనపు ఆర్ఎంవో



నవీనకు బాధ్యతలు అప్పగిస్తున్న సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అదనపు ఆర్ఎంవోగా నియమితులైన డాక్టర్ నవీన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఆర్ఎంవో డాక్టర్ జ్యోతి నియామకపు పత్రాన్ని అందజేశారు. డాక్టర్ నవీన అదనపు ఆర్ఎంవోగా మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించనున్నారు. వైద్యులు, సిబ్బంది డాక్టర్ నవీనకు అభినందనలు తెలిపారు.

శిశువు మృతిపై విచారణకు కమిటీ

కరీంనగర్‌టౌన్: మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం శిశువు మృతి చెందిన ఘటనపై కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ ఆదేశాల మేరకు విచారణకు కమిటీని నియమించారు. చైర్మన్‌గా జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్, సభ్యులుగా డీఎంహెచ్‌వో లలితాదేవి, అదనపు ఆర్ఎంవో డాక్టర్ నవీనలను నియమించారు. వీరు విచారణ చేపట్టి నివేదిక జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నారు.

ఆర్టీసీ సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న భీంరెడ్డి

విద్యానగర్(కరీంనగర్): అత్యవసర సమయంలో చేయాల్సిన కార్డియో పల్మనరీ రిసిటేషన్, ఆటోమేటెడ్ ఎక్స్టెర్నల్ డిసిబ్రిలేటర్ విధానంపై బుధవారం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోని సమావేశ మందిరంలో కరీంనగర్ 1, 2వ డిపో సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించారు. ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) భీంరెడ్డి, కరీంనగర్ 1, 2 డిపోల మేనేజర్లు ప్రణీత్, మల్లయ్య, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైతుల ఆందోళన



చింతలపల్లి గోదాం వద్ద రైతుల ఆందోళన

సైదాపూర్(హుస్నాబాద్): మండలంలోని చింతలపల్లి గోదాం వద్ద రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. నాలుగు రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోంచి తీసుకొచ్చిన ధాన్యాన్ని నాణ్యతలేదని, మాయిశ్చరైజింగ్ 22,25 శాతం దాటుతోందని మిల్లర్లు దిగుమతి చేసుకోవడం లేదని వాపోయారు. కేంద్రాల్లో తూకం వేసినప్పుడు మాయిశ్చరైజింగ్ 17శాతంతో ఉంటుందని, మిల్లర్ల వద్ద గత నాలుగు రోజులుగా లారీల్లో నిల్వ ఉండడంతో వాతావరణ మార్పుల కారణంగా మాయిశ్చరైజింగ్ శాతం 25కు చేరిందని, వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలని ఆందోళనకు దిగారు. విషయం తెలిసిన సివిల్ సప్లయి అధికారులు వచ్చి మిల్లర్లు, రైతులతో మాట్లాడారు. వాతావరణ మార్పులతో తేమశాతంలో తేడా వస్తుందని, అందుకు రైతులు కారణం కాదని మిల్లర్లను ధాన్యం దించుకునేలా ఒప్పించారు.



చిట్టిచేతుల సాయం: దుర్శేడులో ధాన్యం ఆరబోస్తున్న చిన్నారులు



కష్టం మట్టిపాలు: గోపాల్‌పూర్‌లో నష్టపోయిన కర్బూజా తోట



వాన.. వణుకు: దుర్శేడులో ధాన్యంపై కవర్లు కప్పుతున్న మహిళ

వానగండం వీడలే..!

- మరో నాలుగు రోజులు కురిసే అవకాశం
- ఉమ్మడి జిల్లాకు పొంచిఉన్న ఈదురుగాలుల ముప్పు
- ఇప్పటికే 2 లక్షల ఎకరాల్లో పంటనష్టం
- పాత జిల్లాలో సాధారణానికి మించి కురిసిన వాన



కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు లక్ష్మి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జిల్లారైతులపై ప్రకృతి ప్రకోపం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఏప్రిల్ నెలలో మొదలైన వరుణిడి ప్రతాపం.. మే నెలలోనూ కొనసాగేలా ఉంది. ఈనెల 4,5,6,7వ తేదీల్లోనూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణశాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురవవచ్చని తాజాగా విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. గత ఏప్రిల్‌లో వరుసగా వడగండ్లు, అకాల వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో పంటనష్టం జరిగింది. గత వందేళ్లలో రాష్ట్రంలో ఏనాడూ చూడని చెడగొట్టు వానలని ప్రభుత్వమే అభివర్ణించడం ప్రస్తుత పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా ఏప్రిల్ 22,24,30వ తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు పెద్దఎత్తున పంటనష్టం చేకూరింది. ఆరుగాలం శ్రమించిన పంట వడగండ్ల దెబ్బకు ధ్వంసం కావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మరోవైపు కల్లాల్లో తడిసిన ధాన్యం కొంటామని, ఎకరానికి రూ.10వేల పంట నష్టపరిహారం ఇస్తామన్న ప్రభుత్వ హామీతో పరిహారం కోసం కోటి కళ్లతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏ జిల్లాలో ఎలా అంటే..

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. వీటి ప్రభావం జగిత్యాల, సిరిసిల్లలో తక్కువగా కరీంనగర్, పెద్దపల్లిలో అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షంకురిసినా.. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పోలీసులు, రెవెన్యూ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలని ముందుజాగ్రత్తగా సూచనలు కూడా చేసింది. కరీంనగర్ జిల్లాలో తాజా సమాచారం ప్రకారం.. 56,066 ఎకరాలు, జగిత్యాలలో 65,794 ఎకరాలు, సిరిసిల్లలో 18,230 ఎకరాలు, పెద్దపల్లి 36,596 ఎకరాల మేర పంటలు నాశనమయ్యాయి. ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాలో 1,76,686 ఎకరాల్లో పంట నష్టపోయిందని, ఇది దాదాపు రెండు లక్షల ఎకరాల వరకు చేరుకునే అవకాశముందని సమాచారం. ఇప్పటి వరకూ ప్రాథమిక నష్టంగా అంచనా వేసిన ప్రభుత్వం దీనిపై త్వరలోనే తుది నివేదిక రూపొందించిన అనంతరం రైతులకు పరిహారం విడుదల చేయనుంది. ఇప్పటికే అనేక గండాలు దాటుకున్న రైతన్న రాబోయే నాలుగురోజులు కూడా విషమపరీక్షే ఎదుర్కొవాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వరికోతలు ఇప్పుడే చేపట్టవద్దని వానల గండం తొలిగాక చేపట్టడం మంచిదని సూచిస్తున్నారు. మిగిలిన వాణిజ్య పంటల విషయంలో సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

మార్చి ఒకటో తేదీ నుంచి మే మూడో తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో సగటు వర్షపాతం

జిల్లా	అసలు (మి.మీ)	సాధారణం (మి.మీ)	వ్యత్యాసం
కరీంనగర్	173.3	33.9	411
జగిత్యాల	114.1	39.5	189
పెద్దపల్లి	121.1	29.6	309
రాజన్నసిరిసిల్ల	161.6	40.8	296



మేఘం.. భయం: దుర్శేడులో కమ్ముకున్న మబ్బులను చూస్తున్న రైతు అయిలయ్య

దంచి కొట్టిన వానలు

మండువేసవిలో అకాల వర్షాలు వానాకాలాన్ని తలపించాయి. ఒకదశలో భారీవానలు రెండుమూడు రోజులపాటు తుపానును తలపింపజేశాయి. ఈ సీజన్‌లో కురవాల్సిన వానల కన్నా అధికంగా కురిశాయని వాతావరణశాఖ వెల్లడించింది. సాధారణంగా వేసవిలో అసలు వానజాడ కానరాదు. కానీ, ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ప్రకృతి పగబట్టినట్లుగా ఒకదాని తరువాత మరొకటి, వరుసగా భారీ వానలు, వడగండ్లు, ఈదురుగాలులు రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. ఈ సీజన్‌లో సగటున 3 సెం.మీల వర్షపాతం నమోదైతే అది సాధారణ వర్షపాతం కింద లెక్క. కానీ విచిత్రంగా ఉమ్మడి జిల్లాలో కనిష్ఠంగా 11 సెం.మీల నుంచి గరిష్ఠంగా 17 సెం.మీల వరకు కురవడంపై వ్యవసాయశాఖ అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్, సిరిసిల్లలో వానలు దంచికొట్టగా.. జగిత్యాల, పెద్దపల్లిలోనూ బాగానే కురిశాయి.

ధాన్యం రవాణా వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆర్వీ.కర్ణన్



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తిమ్మాపూర్(మానకొండూర్): జిల్లాలో రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కల్లాల నుంచి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ప్యాడీక్లీనర్లు, మాయిశ్చర్లు, గన్నీ సంచులు, ధాన్యం తరలించడానికి వాహనాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కేంద్రాల వద్ద సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. అంతకుముందు ఎల్ఎండీ కాలనీలోని మానసిక వికలాంగుల పాఠశాల, వృత్తివిద్యా శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు.వికలాంగుల మనోవికాసానికి నేర్పిస్తున్న స్పీచ్‌థెరపీ, వాయిస్‌థెరపీ పద్ధతులను పరిశీలించారు. మానసిక వికలాంగులకు ఆటలు, నృత్యాలు నేర్పించేందుకు సి బ్బందిని నియమించాలని సూచించారు. పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి సురేశ్, డీఆర్డీవో శ్రీలత, సహకారశాఖ అధికారి శ్రీమాల, సంక్షేమ అధికారి కె.సబిత, తహసీల్దార్ కనకయ్య పాల్గొన్నారు.

తగ్గిన పత్తి ధరలు

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్లో పత్తి ధరలు తగ్గుతున్నాయి. మంగళవారం క్వింటాల్‌కు రూ.7,550 కాగా.. బుధవారం రూ.50తగ్గి గరిష్ఠంగా రూ.7,500 పలికింది. మార్కెట్‌కు 39 వాహనాల్లో 446 క్వింటాళ్ల పత్తిని రైతులు తీసుకొచ్చారు. మోడల్ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.6,900 చెల్లించారు. గన్నీ సంచుల్లో 9 మంది రైతులు 17 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,800, మోడల్ ధర రూ.6,500, కనిష్ఠ ధర రూ.5,500కు ఖరీదు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేశారు.

రంగు వేయలే.. తాళం తీయలే!

- ముందుకు సాగని 'రూర్బన్ హెల్త్ మిషన్'
- ప్రత్యేక ప్రాజెక్టుగా ఉమ్మడి జమ్మికుంట మండలం
- ఐదేళ్లుగా కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



కోరపల్లిలో నిర్మాణంలో ఉన్న భవనం



మడిపల్లిలో ప్రారంభించని భవనం

జమ్మికుంట(హుజూరాబాద్): గ్రామీణప్రాంత ప్రజలకు తక్షణవైద్యం అందేవిధంగా రూర్బన్ హెల్త్ మిషన్ ద్వారా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో భవనాలు నిర్మించి వైద్యం అందించాలని ఐదేళ్లక్రితం పథకాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో ఆరోగ్యకేంద్రాలు అందుబాటులోకి వస్తే అత్యవసర వైద్యం కావాల్సినవారు మండల కేంద్రాలకు, జిల్లా ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. జిల్లాలో ఈ పథకాన్ని ఉమ్మడి జమ్మికుంట(జమ్మికుంట/ఇల్లందకుంట) మండలంలో ప్రారంభించగా ఐదేళ్లుగా భవన నిర్మాణాలు ఆగుతూ.. సాగుతున్నాయి.

ఉమ్మడి మండలంలో ప్రారంభం

2019లో రూర్బన్ హెల్త్ మిషన్ పథకం కింద వైద్యకేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జిల్లాలో ఉమ్మడి జమ్మికుంట మండలాన్ని ప్రత్యేక ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. 12 మేజర్ గ్రామాల్లో ఆరోగ్యకేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మండలంలోని తనుగుల, కోరపల్లి, జమ్మికుంట–1లో భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. జమ్మికుంట(మారుతీనగర్), మాచనపల్లిలో నిర్మాణాలు పూర్తయ్యాయి. ఆబాది జమ్మికుంట, విలాసాగర్, కొత్తపల్లి, ధర్మారంలో ఇంకా స్థలపరిశీలనలో ఉంది. వావిలాల, మడిపల్లి, బిజిగిరిషరీఫ్‌లో నిర్మాణాలు పూర్తి కాగా.. విద్యుత్, నీటి వసతులు కల్పించలేదు. ఇల్లందకుంట మండలం పరిధిలో ఆరుసెంటర్లు మంజూరు కాగా.. ఐదింటిని నిర్మాణం చేశారు. బూజునూర్ ఉపకేంద్రం నిర్మాణ దశలో ఉంది. నిర్మాణం పూర్తయిన ఏ ఒక్క సెంటర్‌నూ ఇప్పటి వరకు సంబంధిత వైద్యశాఖకు అప్పగించలేదు.

పల్లెదవాఖానా? ఆయుష్మాన్ భారతా?

కేంద్ర ప్రభుత్వానికి చెందిన రూర్బన్ నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులతో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఐదేళ్లక్రితం పాలకులు, అధికారులు హడావుడిగా భూమిపూజలు చేశారు. తరువాత చేతులు దులుపుకున్నారు. జిల్లాలోని జమ్మికుంట మండలాన్ని ప్రత్యేక ప్రాజెక్టుగా ఎంపిక చేయగా.. ఇప్పటి వరకు ఒక్క ఆరోగ్యకేంద్రాన్ని కూడా వైద్యశాఖకు అప్పగించిన దాఖలాలు లేవు. చాలా వరకు నిర్మాణ దశలో ఉండగా.. పలువురు అధికారులు ఈ పథకం గురించే తెలియదని సమాధానం ఇవ్వడం విశేషం. నిర్మాణం పూర్తయిన భవనాలకు పల్లెదవాఖానాలు, ఆయుష్మాన్ భారత్ సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు కానీ.. వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచడం లేదు.

సౌకర్యవంతం



రూర్బన్ పథకం కింద హెల్త్ సెంటర్లు నిర్మిస్తున్నారు. వాటితో గ్రామాల్లో సర్కారువైద్యం అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో అద్దె భవనాల్లో వైద్యం అందిస్తున్నాం. కేంద్రాలు అందుబాటులోకి వస్తే చిన్న పిల్లలకు టీకాలు, వృద్ధులు, గర్భిణులకు మెరుగైన సేవలు అందుతాయి.– డాక్టర్ సనా జవేరియా, వావిలాల పీహెచ్‌సీ

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



మండలంలో ఆరోగ్య ఉపకేంద్రాలు కొన్ని నిర్మించారు. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణం జిల్లా అధికారుల పరిధిలో ఉంటుంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తాం.

– సతీశ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో, జమ్మికుంట

కార్మికులు ఆరోగ్యవంతమైన జీవితం గడపాలి



ల్యాబ్‌ను ప్రారంభించిన అనంతరం పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్, కలెక్టర్ కర్ణన్, తదితరులు

- రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలోని కార్మికులు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం నగరంలోని జ్యోతినగర్‌లో తెలంగాణభవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో ఉచిత పరీక్షల ల్యాబ్‌ను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ... కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తోందని అన్నారు. ముంబయి సీఎస్సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో మొత్తం 19 రకాల్లో 140 పరీక్షలు ఉచితంగా చేస్తోందన్నారు. భవన నిర్మాణకార్డు, ఆధార్ కార్డు ఉన్న ప్రతీ కార్మికుడికి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 7 ల్యాబ్‌లను ప్రారంభించడం జరిగిందన్నారు. కరీంనగర్ ల్యాబ్‌లో కరీంనగర్ జిల్లాతో పాటు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, సిద్దిపేట, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన కార్మికులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే లక్ష మంది కార్మికులను గుర్తించడం జరిగిందని, ఇప్పటివరకు ఎన్‌రోల్ చేసుకోని వారు త్వరగా ఎన్‌రోల్ చేసుకోవాలని సూచించారు. ప్రతీరోజు సుమారు 3500 శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. మేయర్ వై.సునీల్‌రావు, కలెక్టర్ కర్ణన్, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ రమేశ్‌బాబు, వైద్యులు పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి

కరీంనగర్: కేబుల్ బ్రిడ్జి నిర్మాణపనులు త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. బుధవారం కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించారు. అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా, అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్ పనులు రాత్రింబవళ్లు చేపట్టి, ప్రారంభించడానికి సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ కర్ణన్, మేయర్ సునీల్‌రావు, ఇరిగేషన్ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

పోషణలోపం ఉన్న వారిని గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

కరీంనగర్‌టౌన్: ప్రస్తుతం పాఠశాలలకు సెలవు దినాలు ఉన్నందున అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి 0–6 పిల్లలకు పరీక్షలు నిర్వహించి, పోషణలోపం ఉన్న వారిని ఎన్ఆర్సీ కేంద్రానికి పంపించాలని డీఎంహెచ్‌వో కె.లలితాదేవి సూచించారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వినికిడి సమస్యలు, మాట్లాడలేకపోవడం, నడవలేకపోవడం లాంటి సమస్యలున్న పిల్లలను డైస్‌కేంద్రానికి పంపించాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే టీంలు వారి పరిధిలోని గ్రామాల్లో వారానికి రెండు శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు.మాతృ మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణుల్లో హెచ్‌బీ 11శాతం పైన ఉండే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. గైనకాలజిస్టు మంజుల, డిప్యూటీ డీఎంహెచ్‌వో విసీత, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ హారతి, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లపై నిషేధాజ్ఞలు

కరీంనగర్‌క్రైం: కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్టల వినియోగాన్ని నిషేధించినట్లు సీపీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఈనెల 31వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.వివాహాది శుభకార్యాలు, వివిధ కార్యక్రమాల సందర్భంగా ఎవరైనా వినియోగించదలచినట్లయితే సంబంధిత పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



క్లుప్తంగా

యువతకు నిరుద్యోగ భృతి చెల్లించాలి



జెండా ఆవిష్కరిస్తున్న రాజు

కరీంనగర్‌: రాష్ట్ర ప్రభుత్వం యువతకు నిరుద్యోగ భృతి, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్‌ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడిపల్లి రాజు డిమాండ్‌ చేశారు. ఏఐవైఎఫ్‌ ఆవిర్భావ వేడుకల సందర్భంగా బుధవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌ ఎదుట ఏఐవైఎఫ్‌ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని, నిరుద్యోగులను ఏకంచేసి సమస్యలపై ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మహేందర్‌, బ్రామండ్లపల్లి యుగేంధర్‌, ఉపాధ్యక్షుడు ఉట్ల తిరుపతి, అవినాశ్‌, మాజీ నాయకులు న్యాలపట్ల రాజు, కసిరెడ్డి సురేందర్‌ రెడ్డి, రాకేశ్‌, సమ్మయ్య, కొండల్‌ రెడ్డి, వెంకటేశ్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామ శివారులో బుధవారం కారు ఢీకొని చింతలపల్లికి చెందిన అల్లెపు లచ్చయ్యకు తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. లచ్చయ్య కొత్తగట్టు శివారులోని ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు వచ్చాడు. ఈక్రమంలో రోడ్డుపై నిల్చుండగా అతివేగం అజాగ్రత్తతో వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు హుజూరాబాద్‌ ఆస్పత్రికి 108లో తరలించారు.

ఉర్దూ పాఠశాలలో ట్యాబ్‌ల చోరీ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని ఆర్ట్స్‌ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో ట్యాబ్‌లు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా విద్యార్థులకు ఉపయోగపడే 20 ట్యాబ్స్‌ వారికి అందించగా ప్రతిరోజు రాత్రి పాఠశాలలోనే ఒక గదిలో చార్జింగ్‌ బాక్సులో పెట్టి వెళ్తుంటారు. ఇదేక్రమంలో బుధవారం పరిశీలించిన సిబ్బంది హెచ్‌ఎం ఖయ్యూం దృష్టికి తీసుకెళ్లగా వన్‌టౌన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్‌ పోలీసులు తెలిపారు.

వ్యాధిగ్రస్తులకు చేయూత




చెక్కులు అందజేస్తున్న డాక్టర్‌ బీఎన్‌ రావు

కరీంనగర్‌టౌన్‌: నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారులు (అక్యూట్‌ లుకేమియా) క్యాన్సర్‌ వ్యాధితో బాధపడుతూ నగరంలోని సాగర్‌ క్యాన్సర్‌ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. వారి పరిస్థితిని ఆస్పత్రి వైద్యురాలు చైతన్య బి.ఎస్‌.రావు హెల్త్‌ ఫౌండేషన్‌ దృష్టికి తీసుకెళ్లారు. వ్యాధిగ్రస్తులైన చిన్నారులు సిర్పూర్‌ కాగజ్‌నగర్‌కు చెందిన వి.అఖిలేశ్‌(5), శనిగరంకు చెందిన ఆర్‌.హరిచందన (5) హుజురాబాద్‌కు చెందిన ఎ.ప్రణయ్‌కుమార్‌ (10) వారికి కావాల్సిన వైద్యం, మందుల ఖర్చులు, కుటుంబ పరిస్థితులపై ఫౌండేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ బి.ఎస్‌.రావుకు వివరించారు. స్పందించిన ఆయన సాగర్‌ ఆస్పత్రిలో చిన్నారులను కలిసి వారికి నగదును చెక్కు రూపంలో అందించారు. క్యాన్సర్‌ వైద్యనిపుణురాలు డాక్టర్‌ చైతన్య కేవలం మందుల ఖర్చు తీసుకుని చిన్నారులకు ఉచిత వైద్యం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ ఝాన్సీ, డాక్టర్‌ మానస, డాక్టర్‌ అరుణ్‌ కఠారి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకం కలే..(నా)

- ప్రాచీన బౌద్ధ స్తూపాన్ని మరిచిన పాలకులు
- పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి
- రోడ్డు, వసతులు లేక ఆసక్తిచూపని పర్యాటకులు
- ఈనెల 5న బౌద్ధ జయంతి



ఎలిగేడు/జూలపల్లి: బౌద్ధమత బోధనలతో పరిడవిల్లిన నేల ధూళికట్ట. గత అనుభవాన్ని ఈతరం ప్రజలు గుర్తుచేసుకుంటూ.. రాబోయే తరానికి అందించాల్సిన పూర్వీకుల చరిత్ర, సంప్రదాయ వారసత్వ వైభవం ఉన్న అపురూప ప్రదేశం. ఇక్కడి బౌద్ధస్తూపం తెలంగాణకే తలమానికం. ఇంతటి వైభవం ఉన్న ఈ ప్రాంత అభివృద్ధిని పాలకులు విస్మరించడం గమనార్హం.

రెండు మండలాల సరిహద్దులో..

ఎలిగేడు మండలం ధూళికట్ట, జూలపల్లి మండలం వడుకాపూర్‌ గ్రామాల సరిహద్దులో.. హుస్సేన్‌మియావాగు తీరాన ఉంది బౌద్ధస్తూపం. ధూళికట్టలో కోటలు, శాతవాహన రాజుల కాలం నాటి ఆనవాళ్లు ఉన్నాయి. ఆరో శతాబ్దంలో బాదనకుర్తిలో నివసించిన బావరి మహర్షి ఆహ్వానం మేరకు గౌతమ బుద్ధుడు ధూళికట్టలో పర్యటించినట్లు చరిత్ర చెబుతోంది. హుస్సేనిమియావాగు తీరంలో గౌతముడు ఏడువారాలపాటు గడిపాడనీ ప్రతీతి. శాతవాహన రాజుల కాలంలో ధూళికట్టలో రాజభవనాలు ఏర్పాటుచేసుకుని హుస్సేనిమియావాగు తీరంలో కోటలు, బౌద్ధస్తూపాన్ని నిర్మించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. కోటలను మట్టితో నిర్మించడంతో ధూళికోటగా పిలిచేవారనీ, కాలక్రమేణా ధూళికట్టగా మారిందని చెబుతుంటారు.

వెలుగుచూసింది ఇలా..

శాతవాహనుల రాజులకాలంనాటి సంస్కృతి, సంప్రదాయాలను వెలికి తీసేందుకు 1972లో అప్పటి పురావస్తుశాఖ నిపుణులు డాక్టర్‌ వీవీ.కృష్ణశాస్త్రి, కర్నాటకకు చెందిన స్వర్గీయ ఠాకూర్‌ రాజారాంసింగ్‌, డాక్టర్‌ గురు రాజారావు ఆధ్వర్యంలో ధూళికట్టలో తవ్వకాలు చేపట్టి, పరిశోధనలు చేశారు. ఇందులో శాతవాహనుల కాలం నాటి బౌద్ధస్తూపం, కోట ముఖద్వారం, ఐదుపడగల ముచిలిందనాగం, భోదివృక్షం, యక్షనులు, స్తూప నమూనాలు, మహాభినిష్క్రమణం, బుద్ధుని ప్రతిమలు, రాగినాణేలు, మట్టిబొమ్మలు, కుమ్మరి గాజులు, మృణ్మయ పాత్రలు వెలుగుచూశాయి. ఆనాటి ప్రజలు ప్రాకృతభాష, బ్రహ్మలిపి వాడినట్లు గుర్తించారు. బౌద్ధస్తూపాన్ని 19గుంటల స్థలంలో 36మీటర్ల వ్యాసార్థంతో చతురాస్రాకారంలో కాల్చిన ఇటుకలను మందంగా తయారు చేయించి వాడినట్లు ధ్రువీకరించారు. ఇక్కడ లభించిన సున్నపు పలకలు, స్తూప నమూనా ఫలకాలు ఇప్పటికీ కరీంనగర్‌లోని పురావస్తు శాఖ మ్యూజియంలో ఉన్నాయి.

అభివృద్ధికి రూ.39లక్షలు

ధూళికట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 2002లో అప్పటి ప్రభుత్వం బౌద్ధ స్తూప పునఃనిర్మాణానికి రూ.39 లక్షలు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించింది. సదరు కాంట్రాక్టర్‌ స్తూపానికి వాడే ఇటుకలను ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించారు. ఏమైందో తెలియదుగానీ.. కొంతమేర నిర్మాణం చేసి పనులు నిలిపివేశారు. అనంతరం అప్పటి పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్‌ తన కోటా నుంచి రూ.50లక్షలు కేటాయించారు. ఆ నిధులతో రహదారి, బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఎంపీ తన నిధులను వెనక్కి తీసుకున్నారు. బౌద్ధస్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం కేసీఆర్‌ ప్రకటించారని పేర్కొంటూ ఎమ్మార్పీస్‌ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎలిగేడు మండల కేంద్రంలో ఒకరోజు నిరాహార దీక్ష కూడా చేపట్టారు.

పిక్నిక్‌ స్పాట్‌గా..

బౌద్ధస్తూపం పర్యాటకులు, సందర్శకులకు పిక్నిక్‌ స్పాట్‌గా మారింది. కరీంనగర్‌ నుంచి కాచాపూర్‌ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ధూళికట్ట వరకు రూ.30 చార్జీతో చేరుకోవచ్చు. పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి జెండాచౌరస్తా మీదుగా రూ.50తో ఆటోలో చేరుకోవచ్చు. ధూళికట్ట చేరుకున్నాక బౌద్ధస్తూపానికి వెళ్లాలంటే కనీసం రెండు కిలోమీటర్లు నడవాలి. సొంత వాహనాలు ఉంటే నేరుగా చేరుకోవచ్చు.

ఏటా జయంతి ఉత్సవాలు

బౌద్ధస్తూపం వద్ద ఏటా మేలో బౌద్ధజయంతిని ఘనంగా నిర్వహిస్తారు. మహారాష్ట్ర నుంచి బౌద్ధసన్యాసులతో ప్రత్యేక పూజలు చేయిస్తారు. బౌద్ధులే ఈ కార్యక్రమాన్ని నిర్వహించి భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఈనెల 5న బౌద్ధజయంతికి ఏర్పాట్లు చేస్తున్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



నాగభూమిగా పిలిచే బౌద్ధస్తూపం అభివృద్ధితో ఈ ప్రాంతం పర్యాటకంగా మారుతుంది. ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలు చేసుకునేందుకు వనరులు ఉన్నాయి. బౌద్ధ జయంతికి ప్రభుత్వం సహకరించాలి.

– మొగురం రమేశ్‌, ఉత్సవ కమిటీ చైర్మన్‌, వడ్కాపూర్‌

పర్యాటకకేంద్రంగా మార్చాలి



సాక్షాత్తు బుద్ధుడే ఇక్కడ ధ్యానం చేశాడని చరిత్ర చెబుతోంది. బౌద్ధ స్తూపం విశిష్టత, ఈ ప్రాంతానికున్న ప్రాముఖ్యత ముందుతరాలకు తెలి సేలా.. పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలి. ప్రభుత్వం, పర్యాటక శాఖ ముందుకు రావాలి.

– మంచాల వెంకటస్వామి, మాజీ సర్పంచ్‌, వంగర

సొంత ఖర్చుతో రోడ్డు వేయించా



బౌద్ధస్తూపం వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో సొంత డబ్బులు వెచ్చించి మట్టి రోడ్డువేయించా. ప్రస్తుతం ఆ మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. జయంతికి వచ్చేవారి కోసం రోడ్డుతోపాటు కల్వర్టు నిర్మించాలి.

– కొట్టె రాజయ్య, వడ్కాపూర్‌

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



అతి ప్రాచీనమైన బౌద్ధస్తూపానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. గత చరిత్రను ప్రజలు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది.

– గొల్లె కావేరి సర్పంచ్‌, ధూళికట్ట

అభివృద్ధి చేయాలి



అతి పురాతనమైన ధూళికట్ట బౌద్ధ స్తూపాన్ని నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి, ప్రజలు సందర్శించి చూసేందుకు రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు సైతం నిధులు మంజూరు చేయాలి.

– ఇరుగురాల సావిత్రమ్మ, ఎంపీటీసీ, ధూళికట్ట

ఏఎంసీ చైర్మన్‌కు ఉత్తమ సేవా పురస్కారం



జాతీయ ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న ఏఎంసీ చైర్మన్‌ రెడ్డవేణి మధు

కొత్తపల్లి(కరీంనగర్‌): మండలంలోని బావుపేటకు చెందిన కరీంనగర్‌ వ్యవసాయ మార్కెట్‌ చైర్మన్‌ రెడ్డవేణి మధు తను స్థాపించిన నేస్తమా ఫౌండేషన్‌ ద్వారా పదేళ్లుగా నిరుపేదలకు అండగా నిలుస్తూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు గాను హైదరాబాద్‌కు చెందిన ఆదర్శ కళా నిలయం జాతీయ ఉత్తమ సేవా పురస్కారం అందించింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో ఈ పురస్కారాన్ని నిర్వాహకుల నుంచి మధు అందుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. ఈ అవార్డు బాధ్యతను మరింత పెంచిందని, నిరుపేదలకు అండగా నిలుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. మధుకు పురస్కారం రావడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పరిహారం వెంటనే అందించాలి



తీగలగుట్టపల్లిలో ధాన్యం పరిశీలిస్తున్న డాక్టర్‌ నగేశ్‌

కరీంనగర్‌రూరల్‌: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం అందించాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్‌ కె.నగేశ్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం తీగలగుట్టపల్లి, దుర్శేడ్‌, చేగుర్తి గ్రామాల్లోని కొనుగోలుకేంద్రాలను ఆయన సందర్శించారు. అకాల వర్షాలతో ధాన్యమంతా తడిసిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు భరోసా కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పంట నష్టం సర్వేచేసి రైతులకు పరిహారం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నగర అధ్యక్షుడు ఊకంటి రవీందర్‌రెడ్డి, కరీంనగర్‌ మండల అధ్యక్షుడు విలాసాగరం శ్రీనివాస్‌, కార్మికవిభాగం జిల్లా అధ్యక్షుడు పోలు శ్రీనివాస్‌, ఎండీ.ఆరీఫ్‌, చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక శిక్షణతో నైపుణ్యాలు మెరుగు..

- తల్లిదండ్రులు పిల్లలకు క్రీడలపై ఆసక్తి పెంచాలి
- క్రీడలతో నైపుణ్యం, మానసిక స్థితి మెరుగు
- మేయర్‌ సునీల్‌రావు
- ముగిసిన 'సాక్షి' ఉచిత చెస్‌ వేసవి శిక్షణ శిబిరం
- చిన్నారులకు ట్రోఫీలు, సర్టిఫికెట్‌లు ప్రదానం



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మేయర్‌ వై.సునీల్‌రావు, సాక్షి సిబ్బంది, తదితరులు



కోచ్‌ను సన్మానిస్తున్న మేయర్‌ వై.సునీల్‌రావు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: తొలిరోజు 40 మంది....రెండో రోజు 60 మంది ..మూడో రోజు చివరి రోజుకు ఆ సంఖ్య కాస్త 70 మందికి పైగా చేరుకుని వారి చిన్ని మెదళ్లకు పనిచెప్పి నైపుణ్యం పెంపొందించుకున్నారు. మూడో రోజు సాయంత్రం నిర్వహించిన చెస్‌ పోటీల్లో తమ సత్తాను చాటి ఎత్తుకుపై ఎత్తులు వేసి ఎదుటి వారిని చిత్తు చేసి విజేతలుగా నిలిచిన వారు కొందరైతే. తమ అద్భుత ప్రదర్శనతో ఇతరుల మన్ననలు పొందిన వారు మరికొందరు. ఇలా చెస్‌లో చిన్నారులను వెలుగులోకి తెచ్చేందుకు వేదికగా నిలిచింది 'సాక్షి' చెస్‌ వేసవి క్రీడా శిక్షణ శిబిరం. మూడు రోజులుగా కరీంనగర్‌ జ్యోతినగర్‌లోని జీనీయస్‌ చెస్‌ అకాడమీలో 'సాక్షి' మీడియా గ్రూప్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్‌ వేసవి శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. మూడు రోజులు శిక్షణ పొందిన చిన్నారులకు పోటీలు సైతం నిర్వహించింది. విజేతలుగా నిలిచిన వారికి కరీంనగర్‌ మేయర్‌ సునీల్‌ రావు, జిల్లా ఒలంపిక్‌ సంఘం ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి బంగారు, రజత, కాంస్య పతకాలతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి...

చిన్నారులు నిరవధికంగా శిక్షణ పొందినప్పుడే నైపుణ్యం ప్రదర్శిస్తారని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్ఫలితాలు సాధిస్తారని కరీంనగర్‌ మేయర్‌ యాదగిరి సునీల్‌రావు సూచించారు. చెస్‌ విజేతలకు బహుమతులు అందించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడలపై ఆసక్తిని పెంచాలని, క్రీడలతోనే స్టార్‌ హోదా దక్కుతుందన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా వేసవి సెలవుల్లో సమ్మర్‌ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి శిబిరాలు మరిన్ని నిర్వహించాలన్నారు. జిల్లా ఒలంపిక్‌ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌ రెడ్డి, కోచ్‌, ఇంటర్నేషనల్‌ రేటెడ్‌ ప్లేయర్‌ అనూప్‌కుమార్‌ మాట్లాడుతూ.. చిన్నారులు ఇలాంటి వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో 'సాక్షి' బ్యూరో చీఫ్‌ బి.అనిల్‌కుమార్‌, ఆర్‌సీ ఇన్‌చార్జి విజయ్‌భాస్కర్‌, సిలివేరి మహేందర్‌, గోలి కిరణ్‌తో పాటు జీనీయస్‌ చెస్‌ అకాడమీ సిబ్బంది పెద్దపల్లి కిరణ్‌, తరుణ్‌, కంకటి సృజన్‌, వేదిక్‌, అరుణ్‌, అభిరాం, వరుణ్‌, సుహాస్‌ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- అండర్‌ 7–9 బాలుర విభాగంలో.. బి.వకార్తికేయ (ప్రథమ), సీహెచ్‌. కార్తికేయ (ద్వితీయ), కె.ఈశాంత్‌ సాయి (తృతీయ).
- అండర్‌ 7–9 బాలిక విభాగంలో.. పి.నిమిషా (ప్రథమ), అన్విక నిధి (ద్వితీయ), కె.హస్సినీ (తృతీయ).
- అండర్‌ 11–15 బాలుర విభాగంలో.. కె.హర్షిత్‌ (ప్రథమ), కె. సుప్రీత్‌ (ద్వితీయ), ఎం.లిఖిత్‌ (తృతీయ).
- అండర్‌ 11–15 బాలికల విభాగంలో.. ఆద్య (ప్రథమ), యాషశ్రీ (ద్వితీయ), కీర్తి చైతన్య (తృతీయ).
- బెస్ట్‌ యంగెస్ట్‌ ప్లేయర్‌... బి.శ్రేయాస్‌

స్టేట్‌ చాంపియన్‌ అవుతాను...



చెస్‌లో స్టేట్‌ చాంపియన్‌ కావాలని ఉంది. చెస్‌ గేమ్‌ అంటే చాలా ఇష్టం. అందుకే ఉచిత శిక్షణలో చెస్‌ గేమ్‌ ఎంచుకున్నాను. ఇటీవల జిల్లాస్థాయిలో చాలాసార్లు పాల్గొన్నాను. 'సాక్షి' మొదటిసారి నిర్వహించిన క్యాంప్‌లో పాల్గొనాలని ఇక్కడికి వచ్చాను.

– శ్రీ వాత్సవ్‌

సాక్షి ట్రైనింగ్‌ బాగుంది..



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ చాలా బాగుంది. ఇలానే సమ్మర్‌ హాలీడేస్‌ మొత్తం పెట్టాలి. మేము కూడా చెస్‌లో బాగా శిక్షణ పొంది పోటీల్లో విజేతలుగా నిలుస్తాం. చెస్‌లో కోనేరు హంపి నారోల్‌ మోడల్‌.

– కీర్తి చైతన్య..

చెస్‌ నేర్చుకోవాలని...



చెస్‌లో రాణించిన వాళ్లు అన్నింట్లో రాణిస్తారని తల్లిదండ్రులు చెప్పారు. అప్పటి నుంచి చెస్‌పై నాకు ఆసక్తి పెరిగింది. 'సాక్షి' పేపర్‌లో వచ్చిన న్యూస్‌ చూసి మా నాన్న ట్రైనింగ్‌ క్యాంప్‌లో జాయిన్‌ చేశారు. క్యాంప్‌ చాలా బాగుంది. చెస్‌ ఎలాఆడాలి...ఎలా మొదలు పెట్టాలి...ఏలా ఎత్తులు వేయాలనే అంశంపై బాగా నేర్పిస్తున్నారు. థ్యాంక్యూ 'సాక్షి'

– మహిత్‌ రెడ్డి

మైండ్‌ గేమ్‌ చెస్‌..



చెస్‌ ఒక మైండ్‌ గేమ్‌. చాలా ఇంట్రెస్టింగా ఉంటుంది. నాకు చెస్‌ అంటే ఇష్టం. అందుకే చెస్‌ నేర్చుకుంటున్నాను. చెస్‌ ట్రెనింగ్‌ క్యాంప్‌ కూడా బాగుంది. చెస్‌లో బాగా రాణించి స్టేట్‌లెవల్‌, నేషనల్‌ లెవల్‌లో వెళ్లాలని ఉంది.

– రితిక

స్నేహితులను కబళించిన డీసీఎం వ్యాన్‌

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మిత్రుల మృతి
- క్యాటరింగ్‌కు వెళ్లి వస్తుండగా స్కూటీని ఢీకొట్టిన డీసీఎం వ్యాన్‌
- కన్నీరుమున్నీరవుతున్న మృతుల కుటుంబాలు



మొయిన్‌ఖాన్‌(ఫైల్‌)



అభిషేక్‌(ఫైల్‌)

జగిత్యాలక్రైం: ఎండీ మొయిన్‌ఖాన్‌(21), గోకుల అభిషేక్‌(22), వరుణ్‌ సందీప్‌గౌడ్‌(20) మంచి మిత్రులు.. పేద కుటుంబాలకు చెందిన ఈ ముగ్గురు ఒకవైపు చదుకుంటూనే మరోవైపు తీరిక సమయాల్లో ఎంతోకొంత ఆదాయం ఆర్జించేందుకు శుభకార్యాల్లో క్యాటరింగ్‌(వంటలు తయారు చేయడం) పనులు చేస్తున్నారు.. తల్లిదండ్రులకూ చేదోడువాడుగా ఉంటున్నారు. భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఎన్నో కలలు కన్నారు. వారి ఆశలను డీసీఎం రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్‌ శివారులో బుధవారం ఈ ఘటన జరిగింది. బీమారానికి చెందిన ఎండీ. మొయిన్‌ఖాన్‌, రాగోజిపేటకు చెందిన గోకుల అభిషేక్‌, మేడిపల్లికి చెందిన వరుణ్‌ సందీప్‌గౌడ్‌ బుధవారం కొడిమ్యాలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహ వేడుకల్లో క్యాటరింగ్‌ చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈక్రమంలో బుధవారం ఉదయం అక్కడకువెళ్లి క్యాటరింగ్‌ పూర్తయ్యాక సాయంత్రం బైక్‌పై తిరిగి వస్తుండగా కొడిమ్యాల మండలం కోనాపూర్‌ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్‌వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గోకుల అభిషేక్‌, ఎండీ.మొయిన్‌ఖాన్‌ మృతిచెందారు. వరుణ్‌ సందీప్‌గౌడ్‌ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆ యువకుడు మృతిచెందాడు. వీరివి నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా తోడ్పడేందుకు యువకులు క్యాటరింగ్‌ను ఎంచుకున్నారు. వచ్చిన ఆదాయంలో కొంత ఖర్చులకు ఉంచుకుని, మిగతా సొమ్ము తల్లిదండ్రులకు ఇస్తున్నారు. ఎదిగిన కొడుకులు తమ బాగోలు చూస్తారని వారి తల్లిదండ్రులు భవిష్యత్‌పై ఎన్నోఆశలు పెట్టుకున్నారు. కానీ, రోడ్డు ప్రమాదం ఆ ముగ్గురి బలితీసుకుని మూడు కుటుంబాల ఆశలను అడియాసలు చేశాయి. ఆస్పత్రుల్లో కుమారుల మృతదేహాలను చూసిన మృతుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఎటు వెళ్లినా, ఏ పనిచేసినా ముగ్గురు స్నహితులు కలిసే చేసే వారని,అలాంటి వారిని విధి వక్రీకరించి ఇద్దరని బలితీసుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

తెల్లారిన బతుకులు...

- వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్‌: వారు పారిశుధ్య కార్మికులు. ప్రతీరోజు పట్టణాన్ని శుభ్రంచేసేందుకు తెల్లవారు జామున్నే విధుల్లోకి వెళతారు. రోజువారి లాగే విధుల్లో చేరి పనులు చేస్తున్నారు. ఈక్రమంలోనే ఓ కారు మృత్యువు రూపంలో వచ్చి ఢీకొట్టి ఓ కార్మికురాలి ప్రాణం బలిగొంది. మరో కార్మికురాలికి తీవ్ర గాయాలయ్యాయి. హుజూరాబాద్‌ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్‌ పట్టణంలోని సైదాపూర్‌ రోడ్డులో పారిశుధ్య కార్మికురాలు, ఎస్సారెస్పీ కాలువ వద్ద కొత్తగట్టు గ్రామానికి చెందిన దగ్గు కిషన్‌రావ్‌ హుజూరాబాద్‌ వైపు నడుచుకుంటూ వస్తుండగా కాకతీయ కెనాల్‌ బ్రిడ్జిపై డీసీఎం వ్యాన్‌ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కిషన్‌రావు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కుమారుడు దగ్గు శ్రీనివాస్‌ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా హుజూరాబాద్‌ పట్టణంలోని సైదాపూర్‌ రోడ్డులో బుధవారం



సమ్మక్క(ఫైల్‌)

తెల్లవారు జామున రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులను వరంగల్‌ నుంచి కరీంనగర్‌ వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టిన ఘటనలో పట్టణంలోని మామిండ్లవాడకు చెందిన నల్గొండ సమ్మక్క (55) అనే కార్మికురాలు అక్కడికక్కడే మృతిచెందగా రాచపల్లి రాజేశ్వరి, బుర్ర భాస్కర్లకు తీవ్ర గాయాలు కాగా చికిత్సనిమిత్తం వరంగల్‌ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె నల్లగొండ రజిత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే ఈటల పరామర్శ...

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మున్సిపల్‌ కార్మికురాలు సమ్మక్క కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ పరామర్శించి సంతాపం తెలిపారు. ప్రమాదనికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇదే ప్రమాదంలో గాయపడి హన్మకొండలోని ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న మరో కార్మికురాలు రాజేశ్వరిని ఎమ్మెల్యే ఈటల పరామర్శించారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERVICES
LOANS

■ సిరి అసోసియేట్స్‌: హౌజ్‌, ఫ్లాట్‌, ఓపెన్‌ ప్లాట్‌, ల్యాండ్‌, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్‌ చేసుకొని వారంలో అమౌంట్‌ ఇప్పించబడును. సెల్‌: 9666142226. [W-785500]

WANTED

■ Wanted Experienced Car Driver with Licence for House purpose. Karimnagar Local. Contact detail 6303961198, 9491151939 [K-1219820]

■ శ్రీ లక్ష్మీ హోంకేర్‌: HYDలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబికేర్‌ ఇంటి/వంటపనికి స్త్రీ/పు కావలెను. జీతం: 16k–18k రూం+ మీల్స్‌ ఫ్రీ. 9347148051 [G-562]

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్‌, లేడీ సూపర్‌వైజర్స్‌, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్‌: 9391036931, 9246585901 [HA-10756]

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్‌ కమీషన్‌ 3K. ఫోన్‌: 9848571888 [H-793420]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రూరల్ ఏడీఈ రాజు

కొత్తపల్లి: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్‌రూరల్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి సెక్షన్‌లో గల రేకుర్తిలో విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఏడీఈ కొలుపుల రాజు ఆవిష్కరించారు. భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ సిబ్బందికి ఏడీఈ పలు సూచనలు చేశారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతో పాటు సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. టీఆర్ఎస్ నాయకులు సుదగోని కృష్ణగౌడ్, ఏఈ శ్రీనివాస్, వినియోగదారులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్: వికాసతరంగిణి, జెట్ ఆధ్వర్యంలో చిన్న జీయరుస్వామి మంగళాశాసనములతో జ్యోతినగర్ ఆండాళ్ గోష్ఠిలో బుధవారం ప్రజ్ఞ వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతులను వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు కె.గౌతమరావు ప్రారంభించి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రాణయామం, ధ్యానం, భగవద్గీత శ్లోకాలు, నైతిక విలువలు, కథలు, రామాయణం, వేదగణితం, యోగా, భజనలు, కోలా వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు నచ్చిన అంశాల్లో శిక్షణ పొందడానికి ప్రోత్సహించాలని కోరారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ హర్షణీయం

కరీంనగర్‌టౌన్: వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా రెండు దశాబ్దాలుగా పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్, లాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, మిగతా క్యాడర్‌ల సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయడం హర్షణీయమని తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు నాయకులు ఎస్.శ్రీనివాస్ కర్ల, ఆఫ్తబ్ అహ్మద్ ఖాన్, చంద్రమౌళి, టి.రవీందర్, కళావతి, రోజా, రఫి, హరికృష్ణ, శివకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీ రుణాల కేటాయింపు పారదర్శకంగా చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: 2021–22 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాల కేటాయింపుల్లో ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గకుండా పారదర్శకంగా చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ తాజొద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. లక్కీడ్రా ప్రాతిపదికన సర్టిఫికేషన్ చేసి అదే రోజు ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ల పరిశీలన చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు సయ్యద్ అఖిల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నెహాల్ అహ్మద్, లయిఖ్ ఖాద్రి, మొహమ్మద్ ఇర్ఫాన్, అబ్దుల్ కరీం, యూసుఫ్ ఉద్దీన్, బొబ్బిలి విక్టర్, శానవాజ్, అయ్యూబ్, నయీం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు నిర్వహించే కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో గురువారం 41 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని 2, 23, 24, 26, 38, 39, 43, 52, 54, 59వ డివిజన్‌లలో, హుజురాబాద్ 1వ వార్డు, మండలంలోని రాంపూర్, శాలపల్లి ఇందిరానగర్ గ్రామాల్లో, జమ్మికుంటలోని 16వ వార్డు, మండలంలోని కోరపల్లి, మాచినపల్లి, వీణవంక మండలంలోని బొంతుపల్లి, నర్సింగాపూర్,, చిగురుమామిడి మండలం సుందరగిరి, నవాబుపేట, చొప్పదండి మండలం ఆర్నకొండ, మంగళపల్లి, ఇల్లందకుంట మండలం భోగంపాడు, గంగాధర మండలం తాడి జెర్రీ, గట్టుభూత్కూర్, రామడుగు మండలం వెదిర, వెంకట్రావుపల్లి, కొత్తపల్లి మండలం చింతకుంట, నాగులమల్యాల, కరీంనగర్‌రూరల్ మండలం మందులపల్లి, మానకొండూరు మండలం గట్టు దుద్దెనపల్లి, ఈదులగట్టపల్లి, దేవంపల్లి, సైదాపూర్ మండలం పెరుకపల్లి, ఘనపూర్ తండ, కేశపట్నం మండలం అంబాల్‌పూర్, కల్వల, తిమ్మాపూర్ మండలం, వచ్చునూరు, గుండ్లపల్లి, గన్నేరువరం మండలం సాంబయ్యపల్లి గ్రామాల్లో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా నాగవెల్లి పట్నం



కరీంనగర్ కల్చరల్: కురుమ కులస్తుల కులదైవం బీరప్ప మహంకాళమ్మ బోనాల జాతరలో భాగంగా బుధవారం ఆలయ సేవా కమిటీ ఆధ్వర్యంలో నాగవెల్లి పట్నం, అగ్నిగుండాల కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. మంత్రి గంగుల కమ లాకర్, మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పలువురు నాయకులు హాజరై పూజలు నిర్వహించారు. ఉదయం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సేవా కమిటీ బాధ్యులు స్వాగతం పలికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కర్రె అనిల్‌కుమార్, పెద్ద కురుమ కర్రె ప్రవీణ్ కుమార్, కర్రె రాజు, బీర్ల నరసయ్య, బీర్ల బీరయ్య, బీర్ల పెద్ద కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో నిర్వహిస్తున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ పట్నాల ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాగవెల్లి పట్నం వైభవంగా వేశారు. బైండ్లపూజారుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయంలో పలు రంగులతో పట్నం వేసి ఎల్లమ్మ చరిత్రను గానం చేశారు. మహిళలు మొక్కులు చెల్లించి బోనాలతో తిరిగి ఇంటికి వెళ్లారు. కాగా ఆలయ అభివృద్ధికి రాష్ట్ర బీసీ సంక్షేమ,పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పంపించిన రూ.లక్షను కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి గౌడ సంఘం అధ్యక్షుడు మూల లక్ష్మిరాజంకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దబ్బెట రమణారెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు బుర్ర నారాయణ, రాజవీరు, కొమురయ్య, రమేశ్, శంకరయ్య, రవి, మల్లేశం, బలరాం, అజయ్, నాయకులు కె.నరేశ్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


విద్యుత్ ఉద్యోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొత్తపల్లి: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ప్రారంభించిన ఈ వైద్య శిబిరంలో 123 మంది విద్యుత్ ఉద్యోగులకు బీపీ, షుగర్, రక్త, ఈసీజీ, 2డీ ఎకో, గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలను డాక్టర్ శ్రీకృష్ణ నిర్వహించారు. డీఈలు పి.విజయేందర్‌రెడ్డి, చంద్రమౌళి, ఏఓ రాజేంద్రప్రసాద్, పీఓ బి.చంద్రయ్య, ఏడీఈలు, ఏఈలు, జెఏఓలు, యూనియన్ల నాయకులు, మహిళా ఉద్యోగులతో పాటు యశోద ఆస్పత్రి వైద్యులు జిజాల్, కిశోర్, సుగుణాకర్, మేనేజర్ వినయ్‌కుమార్, జీఎం రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్దిచెబుతూ.. కాపురాలు చక్కదిద్దుతూ

- చిన్న చిన్న విషయాలతోనే భార్యభర్తల మధ్య మనస్పర్థలు
- పోలీస్‌స్టేషన్, కోర్టులను ఆశ్రయిస్తున్న జంటలు
- కౌన్సెలింగ్‌లతో చక్కదిద్దుతున్న పోలీసులు


కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్

కరీంనగర్‌క్రైం: పెళ్లంటే నూరేళ్ల పంట అంటారు.. మూడు ముళ్లతో ఏకమై ఏడడుగులు నడిచి వేద మంత్రాల సాక్షిగా జరిగిన వివాహాలు ఏడాది తిరగకుండానే విబేధాలతో విచ్ఛిన్నానికి దారితీస్తున్నాయి. పెళ్లిళ్లు జరిగిన ఏడాదిలోనే పచ్చని కాపురాల్లో చిచ్చురేపుకొని పోలీసుస్టేషన్‌లు, కోర్టుల మెట్లెక్కుతున్నారు. అనుమానాలు పెనుభూతాలై కాపురాల్లో కార్చిచ్చు రేపుతుండగా అపర్థాలు, ఆర్థిక పరిస్థితులు, ఒకరిపై ఒకరు ఆదిపత్య పోరుతో చిన్న గొడవలు తీవ్రతరంగా మారి విడాకుల వరకు వెళ్తుండడంతో వారి కుటుంబాల్లో తీవ్రమనోవేదనకు దారితీస్తుంది. కరీంనగర్‌లోని మహిళా పోలీస్‌స్టేషన్‌కు అనేక ఫిర్యాదులు వస్తుండగా పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇస్తూ చక్కదిద్దుతున్నారు. మరికొందరు మాత్రం ససేమిరా అంటూ కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

చిన్న విషయాలకే గొడవలు..

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కేసులను పరిశీలిస్తే ఇందులో అనేక మంది చిన్న గొడవలతో మొదలై పూడ్చలేని అగాదం వరకు వెళ్లి తీవ్రస్థాయి గొడవలుగా మారుతున్నాయని తెలుస్తోంది. ఒకరినొకరు అర్థం చేసుకోలేక పని ఒత్తిడి, ఆదిపత్య పోరుతో ఒకరిపై ఒకరు చూపించుకుంటున్న క్షణికావేశాలతో బంధాలు పలుచబడుతున్నాయి. కొన్ని జంటల్లో అనుమానం పెనుభూతంగా మారి బంధాలను విచ్ఛిన్నం చేసే దిశగా ప్రమాదాల్లో పడిపోతున్నాయి. ప్రతీ చిన్న విషయాలకు చిరాకు పడుతూ గొడవలు పెట్టుకుంటున్నారు. తర్వాత సర్దుకోకుండా ప్రతీ చిన్న విషయాన్ని పెద్దగా చేసుకుంటూ పోలీసుస్టేషన్‌ల వరకు వెళ్తున్నారు.

ఉమ్మడి కుటుంబాలకు దూరంగా..

గతంలో ఉమ్మడి కుటుంబాల్లో ఉన్నప్పుడు పరిశీలిస్తే విడాకుల జరిగిన కేసు సంఖ్య తక్కువగా ఉండేది. పెద్దమనుషుల మధ్య ఉండడంతో చిన్నస్థాయి గొడవలు వచ్చినా పెద్దలు సర్దిచెప్పేవారు. కానీ ఇప్పుడు ప్రైవసీ పేరుతో వేరు కాపురాలు పెట్టేస్తుండడంతో వారికి చెప్పే వారు లేక చిన్న చిన్న గొడవలకే పెద్ద నిర్ణయాలు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకే వంతపాడుతుండడంతో చాలా వరకు గొడవలు పరిష్కారం కావడం లేదని పోలీసుల కౌన్సెలింగ్‌లో తేలుతోంది. కానీ పోలీసుస్టేషన్‌లకు వచ్చిన ఫిర్యాదులను సుదీర్ఘంగా దశల వారీగా కౌన్సెలింగ్ ఇస్తూ భార్యభర్తల కాపురాలను నిలబెడుతున్నారు. ఇదిలా ఉండగా పోలీసుస్టేషన్‌లకు వస్తున్న కేసుల్లో ఎక్కువ శాతం 24 నుంచి 30 ఏళ్ల లోపు వారు ఉండడం విశేషం.

కరీంనగర్ మహిళా పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు వివరాలు

సంవత్సరం	ఫిర్యాదులు	పరిష్కరించినవి
2021	1209	1092
2022	1106	1014
2023(ఏప్రిల్)	360	262

కౌన్సెలింగ్ ఇస్తూ చక్కదిద్దుతున్నాం



ప్రస్తుత పరిస్థితుల్లో దంపతులు చిన్న చిన్న గొడవలకే మనస్పర్థలు రావడంతో గొడవలకు దిగుతూ పోలీసుస్టేషన్లు, కోర్టులను ఆశ్రయిస్తున్నారు. మా వద్దకు వచ్చిన ఫిర్యాదుల్లో ఇరువర్గాల వారిని పిలిచి వివాహ బంధం విలువలను తెలియచెబుతూ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. నూరేళ్ల దాంపత్య జీవితాన్ని ఒకరినొకరు అర్థం చేసుకొని సర్దుకుపోతూ జీవితాన్ని ముందుకు సాగించాలి. – బి.శ్రీనివాస్, కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ

పోలీసుస్టేషన్లు, కోర్టులకు వెళ్తున్న జంటల్లో గొడవలకు ప్రధాన కారణాలు

- ఒకరిపై ఒకరికి అనుమానం
- వారి ఇల్లు, అత్తగారిల్లు అని ముందే గీత గీసుకొని ఉండడం వల్ల కుటుంబాల పట్ల ప్రేమలు లేకపోవడం. ముందస్తుగానే వ్యతిరేక అభిప్రాయాలను కలిగి ఉండడం.
- ఉమ్మడి కుటుంబాలు కాకుండా వేరుగా ఉండడంతో చిన్న గొడవలకే స్వంత నిర్ణయాలు తీసుకోవడం.
- ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడంతో వస్తున్న ఇబ్బందులు.
- కుటుంబ అభివృద్ధికి ప్రణాళిక లేకపోవడం.
- సంసారాల్లో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, ఇతరుల మితిమీరిన జోక్యం
- అబ్బాయిల్లో అధిక మద్యపానం, వ్యసనాలు
- భార్యాభర్తలు అన్ని విషయాలు పంచుకోకపోవడం, వ్యక్తిగత విషయాలు పేరుతో గోప్యంగా ఉంచడం.
- అదనపు కట్నం కోసం గొడవలు
- తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేసినా తప్పు, ఒప్పు చూడకుండా సమర్థించి వంత పాడడం.

చిత్ర కథ: ఫుట్‌పాత్‌లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్



నగరంలోని ఫుట్‌పాత్‌లపై విక్రయాలు, పార్కింగ్‌లు చేస్తే జరిమానాలు విధిస్తామని మున్సిపల్ అధికారులు చెప్పినప్పటికీ నగరవాసులు మాత్రం పెడచెవిన పెడుతున్నారు. పలు వ్యాపార సముదాయాల వెంట ఉన్న ఫుట్‌పాత్‌లపైనే ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీరిపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్య తీసుకుంటారో వేచి చూడాల్సిందే. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

‘హరిత’ మొక్కలు ధ్వంసం



కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన గాలివానకు హరితహారం మొక్కలన్నీ ధ్వంసమయ్యాయి. ఈదురుగాలులకు మొక్కలు విరిగిపోగా రక్షణగా ఏర్పాటు చేసిన ట్రీగార్డులు కింద పడిపోయాయి. రాజీవ్ రహదారిలో ప్రతిష్టాత్మకంగా అధికారులు నాటించిన మొక్కలన్నీ పడిపోయాయి. ఇప్పటికైనా పంచాయతీ, ఉపాధిహామీ అధికారులు పడిపోయిన మొక్కలను సరిచేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. – కరీంనగర్‌రూరల్

రైతులకు బాసటగా నిలవడం అభినందనీయం


టార్పాలిన్లు అందజేస్తున్న తహసీల్దార్

కొత్తపల్లి: స్వచ్ఛంద సంస్థలు రైతులకు బాసటగా నిలవడం అభినందనీయమని తహసీల్దార్ ఎస్.వెంకటరెడ్డి అన్నారు. కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ ఐకెపీ కేంద్రంలో సప్తగిరి లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు 40 టార్పాలిన్లు పంపిణీ చేశారు. అకాల వర్షాల రైతులు తీవ్ర ఇబ్బందులను గుర్తించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. మరిన్ని సంస్థలు కూడా ముందుకొచ్చి రైతులకు అండగా నిలవాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైస్‌చైర్మన్ ఉప్పు రాజశేఖర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షాబీర్ పాషా, ఎంపీటీసీ మనోహర్, ఆర్ఐ వి.అరుణ్‌కుమార్, ఐకెపీ ఏపీఎం రాజేశం, నాయకులు పిల్లి మహేశ్, కడారి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ గవర్నర్–2 కొదండ రాములు, అధ్యక్షుడు పి.శ్రీహరిరెడ్డి, సెక్రెటరీ కోటేశ్ కుమార్, ఉపాధ్యక్షుడు రాచందర్, సత్యనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, సత్యనారాయణరాజు, రాజిరెడ్డి, ఆనంద్, యలమంద, భువనగిరి, డా.అశోక్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం


పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన నాయకులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను బుధవారం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాలారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంబేడ్కర్ జయంతిని నుంచి బుద్ధ జయంతి వరకు పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడంలో భాగంగా మల్కాపూర్ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం బాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.14 వేలు ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు రతన్‌కుమార్, నరహరి లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రావణ్‌కుమార్, ప్రశాంత్, నరేశ్, పరుశరాములు, ఆంజనేయులు, రాజేంద్రప్రసాద్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కొత్తపల్లి: పిండి గిర్నీలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యయత్నంకు పాల్పడిన ఆదెపు శ్రీహరి(56) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కొత్తపల్లి ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ గ్రామానికి చెందిన ఆదెపు శ్రీహరి పిండి గిర్నీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి అన్నదమ్ములతో కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు జరుగుతున్నాయి. అవి పరిష్కారం కాకపోవడంతో పాటు అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో మంగళవారం పిండి గిర్నీలోనే ఎలుకల మందు తాగి ఆత్మహత్యయత్నంకు పాల్పడ్డాడు. అది గమనించిన భార్య కుటుంబసభ్యుల సహకారంతో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీహరి బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంపీ ‘బండి’ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి


మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: ఎంపీ బండి సంజయ్ బీజేపీ అధికారంలోకి వస్తే పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగభద్రత కలిప్తామని, కార్మికులు, రైతుల సంక్షేమంపై బీజేపీ మాట్లాడ్డం విడ్డూరంగా ఉందని నగర మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. బుధవారం ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో పారిశుద్ధ్య కార్మికులు గౌరవప్రదంగా జీవిస్తున్నారన్నారు. మేడే సందర్భంగా సీఎం కేసీఆర్ పారిశుద్ధ్య కార్మికులకు రూ.1000 వేతనం అదనంగా పెంచుతున్నామని చేసిన ప్రకటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సంజయ్ తప్పుడు మాటలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు గంట కల్యాణి, కంసాల శ్రీనివాస్, తుల బాలయ్య, నందెల్లి రమ, నాయకులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి

కరీంనగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినప్పటికీ రెగ్యులర్ చేయకపోవడంతో విధి లేని పరిస్థితిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె బాట పట్టి వారం కావస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెతో గ్రామాల్లో ప్రజలు వివిధ రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, అనుమతులు, పరిపాలన పర్యవేక్షణ కుంటు పడిందన్నారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకమైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులరైజ్ కోసం నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని, ప్రభుత్వం జోక్యం చేసుకొని జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించి గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా చూడాలని పేర్కొన్నారు.

తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక కమిటీల నియామకం



కరీంనగర్: నగరంలోని నాయీబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో బుధవారం మండల కమిటీలను నిర్వహించినట్లు నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. కరీంనగర్‌రూరల్ మండల అధ్యక్షుడిగా చెరుకురమేశ్, ప్రధాన కార్యదర్శిగా తంగళ్లపల్లి గణేష్, కొత్తపల్లి మండలానికి రాచకొండ శ్రీనివాస్, సింగిరాల వేణుగోపాల్, తిమ్మాపూర్ మండలానికి గడ్డం రాంచంద్రం, గడ్డం తిరుపతి, రామడుగు మండలానికి సముద్రాల శ్రీనివాస్, సముద్రాల నారాయణ, వీణవంక మండలానికి నారాయణదాస్ కార్తీక్, తూముల శ్రావణ్‌లు నియామకమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగిరాల వెంకటస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరాముల రమేశ్, నగర అధ్యక్షుడు గడ్డం రాజు, గర్శకుర్తి శంకర్, రాష్ట్ర కార్యదర్శి ముత్యాల లక్ష్మణ్, నాయకులు బాల సురేందర్, గర్శకుర్తి రవీందర్, మల్లెంకి శ్రీనివాస్, జనగామ సత్యనారాయణ, గర్శకుర్తి విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి యోగా మహోత్సవం

విద్యానగర్(కరీంనగర్): హార్ట్‌ఫుల్ నెస్ ఇన్స్టిట్యూట్, శ్రీరామచంద్ర మిషన్, కేంద్ర సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో హర్ దిల్ ధ్యాన్, హర్ దిన్ ధ్యాన్ పేరిట దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న యోగా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 5, 6, 7 తేదీల్లో సాయంత్రం 6గంటలకు కరీంనగర్‌లోని సెయింట్ ఆల్ఫోన్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు సెంటర్ కోఆర్డినేటర్ ఎస్.రమేశ్ తెలిపారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ యోగా మహోత్సవంలో ప్రాణయానంతో కూడిన ధ్యానంతో పాటు, బీపీ, మధుమేహం, ఒత్తిడి, ఉబకాయం, థైరాయిడ్ తదితర వ్యాధుల ఉపశమనం కోసం ప్రత్యేక ఆసనాలు నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పద్మనాయక కన్వెన్షన్‌కు భూమిపూజ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకులలో గురువారం పద్మనాయక వెలమ ఏసీ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు పద్మనాయక వెలమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జువ్వాడి మన్‌మోహన్‌రావు, బల్మూరి ప్రసాద్‌రావు తెలిపారు. భూమిపూజకు ఆర్థికశాఖ మంత్రి టి.హరీశ్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని వివరించారు. ఉదయం 11గంటలకు జరిగే భూమిపూజకు వెలమ సంఘం ప్రతినిధులు, సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా : 9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899



అదానీ డేటా సెంటర్‌కు భూమి పూజ చేస్తున్న సీఎం జగన్, అదానీ గ్రూప్ ఎండీ రాజేశ్ అదానీ, సీఈవో కరణ్ అదానీ

అభివృద్ధికి చిరునామా

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు కిరీటం

శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

భోగాపురం నుంచి సాక్షి ప్రతినిధి : 'ఉత్తరాంధ్ర ప్రాంతం అభ్యుదయానికే కాదు.. అభివృద్ధికీ చిరునామా. శ్రీకాకుళం జిల్లాలో కొద్దిరోజుల క్రితం శంకుస్థాపన చేసిన మూలపేట పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారమైతే.. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కిరీటం' అని సీఎం వైఎస్ జగన్ అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి రానున్న 30 నెలల కాలంలో విమానాల రాకపోకలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్రకే కాకుండా రాష్ట్ర వైభవానికీ కేంద్ర బిందువుగా మారనుందన్నారు. బుధవారం ఆయన రూ.5 వేల కోట్లతో నిర్మించనున్న భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన చేశారు. విజయనగరం జిల్లాలో 49 గ్రామాలకు తాగునీరు, 30 వేల ఎకరాలకు సాగు నీటితో పాటు భోగాపురం విమానాశ్రయానికి తాగు నీటి అవసరాలు తీర్చేందుకు రూ.195 కోట్ల అంచనా వ్యయంతో తార కరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు పనులకు భూమి చేశా రు. రూ.26 కోట్లతో ఫిష్ హ్యాండ్లింగ్ సెంటర్‌కు.. విశాఖలో అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి దశలో రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ విమానాశ్రయానికి విశాఖ నుంచి 6 లేన్ల రహదారికి 4 నెలల్లో శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు.

2026లో ఎయిర్‌పోర్టును నేనే ప్రారంభిస్తా..

'ఈ రోజు ఇక్కడ పునాది రాయి వేశాం. 2026లో మళ్లీ మీ బిడ్డ, మీ అన్న, మీ తమ్ముడు ఇక్కడకు వచ్చి.. ఇదే ప్రాంగణం నుంచి ప్రారంభోత్సవం కూడా చేస్తాడని నమ్మకంగా చెబుతున్నా. దేవుని ఆశీస్సులు, మీ అందరి చల్లని దీవెనలతో అది జరుగుతుంది. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ఏమీ చేయలేరు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాది రాయి వేస్తున్నామంటే జీర్ణించుకోలేని వ్యక్తులందరూ ఎలా మాట్లాడుతున్నారో టీవీల్లో, పేపర్లలో చూశాం. ఆశ్చర్యం అనిపించింది. నిజంగానే వాళ్ల హయాంలోనే ఈ స్థాయి ఉండి ఉంటే.. అప్పుడే ఈ ప్రాజెక్టు ఎందుకు ముందుకు కదలలేదు?' అని ప్రశ్నించారు.



భోగాపురం ఎయిర్‌పోర్టు నమూనాను పరిశీలిస్తున్న సీఎం జగన్. చిత్రంలో జీఎంఆర్ అధినేత గ్రంథి మల్లికార్జునరావు, అదానీ గ్రూప్స్ ఎండీ రాజేష్ అదానీ తదితరులు

టైర్-1 సిటీగా విశాఖ

- అదానీ డేటా సెంటర్‌కు భూమి పూజ కార్యక్రమంలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: టైర్-2 సిటీగా ఉన్న విశాఖ.. అదానీ డేటా సెంటర్ రాకతో టైర్-1 సిటీగా మారే గొప్ప ప్రక్రియకు అడుగు పడిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మధురవాడ ఐటీ హిల్-4లో అదానీ గ్రూప్ రూ.21.844 కోట్లతో నిర్మిస్తున్న వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్‌కు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. విశాఖలో 300 మెగావాట్ల సామర్థ్యమున్న ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్ పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం చరిత్రాత్మక ఘట్టం అని చెప్పారు. 190 ఎకరాల ప్రాంగణంలో నిర్మించే డేటా సెంటర్ విశాఖకు గొప్ప ప్రోత్సాహకంగా నిలుస్తుందని, విశాఖ రూపురేఖలు మారుస్తుందని ఆకాంక్షించారు. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌గా రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా మారనుందని తెలిపారు. ఇది పూర్తి స్థాయి గ్రీన్ ఎనర్జీతో ఏర్పాటవుతోందని, సహజ వనరుల ద్వారా లభించే విద్యుత్తునే ఈ డేటా సెంటర్‌కు వినియోగించడం చాలా ప్రాధాన్యమైన అంశం అని చెప్పారు. డేటా సెంటర్ ఏర్పాటులో భాగంగా సింగపూర్ నుంచి సబ్‌మెరైన్ కేబుల్ వ్యవస్థను తీసుకువస్తుండటం వల్ల ఇంటర్నెట్ కనెక్టివిటీ, వినియోగం, స్పీడ్ గణనీయంగా పెరుగుతుందన్నారు. డేటా డౌన్లోడ్, అప్‌లోడ్ శరవేగంగా జరుగుతాయని, తద్వారా ఇక్కడి ఐటీ పరిశ్రమలు, ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ తరహా ఆధునిక సదుపాయాల వల్ల విశాఖ నగరం మహా నగరంగా ఎదగడానికి దోహద పడుతుందన్నారు.

వివేకా పీఏ, వంట మనిషి కుమారుడ్ని విచారించిన సీబీఐ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు ముందు రాసిన లేఖ, దానిని ఎవరు, ఎందుకు దాచిపెట్టారన్న విషయాలపై సీబీఐ దృష్టి పెట్టింది. ఈ లేఖ విషయమై వివేకా వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కృష్ణారెడ్డిని, వంట మనిషి లక్ష్మీదేవి కుమారుడు ప్రకాశ్‌ను సీబీఐ అధికారులు ఇద్దరినీ కలిపి బుధవారం విచారణ జరిపారు. కృష్ణారెడ్డి స్వయంగా ప్రకాశ్‌కు లేఖ ఇచ్చి దాచిపెట్టాలని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వారిద్దరినీ కలిపి ప్రశ్నించినట్లు సమాచారం. కీలకమైన ఈ లేఖను ఎందుకు దాచిపెట్టారు? ఎవరి ఆదేశాల మేరకు దాచిపెట్టారన్న అంశంపై ప్రకాశ్‌ను విచారించి, స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేసుకున్నట్లు సమాచారం.

అవినాశ్‌ను ప్రశ్నించాల్సి ఉంది

తెలంగాణ హైకోర్టుకు వెల్లడించిన సీబీఐ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సాక్ష్యాలను చెరిపివేశారన్న అభియోగాలు ఉన్నాయని, ఈ కేసులో 438 సీఆర్‌పీసీ మెయింటెయినబుల్ కాదని తెలంగాణ హైకోర్టుకు కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) వెల్లడించింది. ముందస్తు బెయిల్ కోరుతూ అవినాశ్ దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణలో భాగంగా సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. అవినాశ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని పేర్కొంది. ఆయన విచారణకు సహకరించడం లేదని, అన్ని ప్రశ్నలకు సమాధానాలు దాటివేస్తున్నారని, ఆయన్ని అరెస్టు చేసి కస్టడీలో ప్రశ్నించాల్సిన అవసరం ఉందని తెలిపింది. దర్యాప్తును పక్కదారి పట్టించేందుకే ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారని పేర్కొంది. అవినాశ్‌కి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షులు కూడా ముందుకు రావట్లేదని, ఆయన అనుచరుల వల్ల దర్యాప్తునకు ఆటంకం కలిగిందని వెల్లడించింది. దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేస్తున్నారని తెలిపింది.

సూత్రధారి చిక్కి 'నారా'!

ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో అమరావతిలో ఎల్లో గ్యాంగ్ భూ దందా ● అసైన్డ్ భూములను కొల్లగొట్టిన పచ్చ గద్దలు



- రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాలు హస్తగతం.. నారా – నారాయణ అవినీతి మెలిక 'ఇన్నర్ రింగ్‌రోడ్డు'
- 'స్కిల్' కుంభకోణంలో రూ.241 కోట్లు లూటీ.. 'ఫైబర్ నెట్'లో రూ.248 కోట్ల దోపిడీ
- సిట్ దర్యాప్తులో ఆధారాలతో సహా బహిర్గతం
- పలువురు పాత్రధారులను అరెస్టు చేసిన సిట్.. ఇప్పుడు సూత్రధారుల వంతు

సాక్షి, అమరావతి: ఇన్నాళ్లూ సాంకేతిక కారణాలను సాకుగా చూపిస్తూ విచారణ నుంచి తప్పించుకుంటున్న మాజీ సీఎం చంద్రబాబు అవినీతి బండారం ఇక బద్ధలు కానుంది. టీడీపీ హయాంలో అవినీతి బాగోతాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా విచారించవచ్చని తాజాగా సుప్రీంకోర్టు పచ్చ జెండా ఊపడంతో ఇక అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ఇప్పటికే చంద్రబాబు, మాజీ మంత్రి నారాయణ, బినామీల అవినీతి దందాను ఆధారాలతో సహా గుర్తించిన 'సిట్' ఇక దూకుడుగా వెళ్లనుంది. ఏ-1గా చంద్రబాబు, ఏ-2గా పొంగూరు నారాయణలతోపాటు వారి బంధువులు, బినామీలు, సన్నిహితులపై ఇప్పటికే కేసులు నమోదు చేసింది. ఇక అసలు సూత్రధారుల విచారణ, అరెస్టులకు సిట్ సన్నద్ధం కానుందని తెలుస్తోంది.

అక్రమాలను నిర్ధారించిన సబ్ కమిటీ

టీడీపీ హయాంలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణకు ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ గత సర్కారు విధానపరమైన నిర్ణయాలు, ప్రాజెక్టులు, కార్పొరేషన్లు, సొసైటీలు, కంపెనీలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను క్షుణ్నంగా సమీక్షించింది. విధానపరమైన లోపాలు, న్యాయపరమైన తప్పిదాలు, ఆర్థిక అక్రమాలు, మోసపూరిత లావాదేవీలను గుర్తించిన సబ్ కమిటీ ఈమేరకు 2019 డిసెంబర్ 27న ప్రాథమిక నివేదిక సమర్పించింది. ఈ నివేదికపై చర్చించిన రాష్ట్ర మంత్రి మండలి టీడీపీ హయాంలో అవినీతిపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుకు వీలుగా నిర్ణయం తీసుకుంది. ఈమేరకు 2020 ఫిబ్రవరి 21న పది మంది సభ్యులతో సిట్ ఏర్పాటైంది. అక్రమాలపై దర్యాప్తు చేసేందుకు అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సిట్‌కు నిర్దేశించారు.

సిట్ దర్యాప్తుతో అవినీతి బట్టబయలు

టీడీపీ సర్కారు అవినీతిపై సిట్ బృందం కీలక ఆధారాలు సేకరించి, శాస్త్రీయంగా నిరూపించి, పలువురిని విచారించి ఏకబిగిన దర్యాప్తు కొనసాగించింది. చంద్రబాబు, నారాయణ తమ బంధువులు, బినామీల ద్వారా సాగించిన అవినీతి బాగోతాన్ని ఆధారాలతో సహా వెలుగులోకి తెచ్చింది. ఈ దోపిడీలో పాత్రధారులైన పలువురిని అరెస్టు చేసింది. మరోవైపు సిట్ వినతి మేరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ కూడా టీడీపీ ప్రభుత్వంలోని అవినీతి వ్యవహారాలపై విచారణ చేపట్టి కీలక ఆధారాలు సేకరించాయి.

సిట్ దర్యాప్తులో నిగ్గు తేలిన నిజాలివీ..

5,600 కోట్ల అసైన్డ్ భూ దోపిడీ

టీడీపీ అధికారంలో ఉండగా రాజధాని ముసుగులో పచ్చ గద్దలు అమరావతిలో అసైన్డ్ భూములను కొల్లగొట్టాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలను భయభ్రాంతులకు గురి చేసి అసైన్డ్ భూములను చంద్రబాబు, నారాయణ తమ బినామీల పేరిట హస్తగతం చేసుకున్నారు. అసైన్డ్ భూముల చట్టాన్ని ఉల్లంఘించి ఏకంగా రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాల భూ దోపిడీకి పాల్పడినట్టు సీఐడీ ప్రాథమికంగా గుర్తించింది. రాజధాని నిర్మాణం తరువాత అమరావతిలో ఎకరా మార్కెట్ విలువ కనీసం రూ.4 కోట్లకు చేరుతుందని నాడు చంద్రబాబే ప్రకటించారు. ఆ ప్రకారం టీడీపీ నేతలు దక్కించుకున్న అసైన్డ్ భూముల విలువ రూ.5,600 కోట్లని నిర్ధారణ అయింది. టీడీపీ పెద్దలు కొల్లగొట్టిన 1,400 ఎకరాల్లో 23 సీఆర్‌డీఏ కార్యాలయాల పరిధిలోని 932.72 ఎకరాలను ఎవరెవరి పేరిట అన్యాక్రాంతం చేశారన్నది నిగ్గు తేల్చింది. మిగిలిన భూములపై దర్యాప్తు కొనసాగుతోంది.

నారా, నారాయణ బంధువులు, బినామీలే

అసైన్డ్ భూముల అక్రమాల తీగ లాగితే నారా చంద్రబాబు, పొంగూరు నారాయణ బంధువులు, బినామీల పేరిట అసైన్డ్ భూములను జీపీఏ, సేల్ డీడ్ల ద్వారా హస్తగతం చేసుకున్నట్లు వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు సమీప బంధువు పేరిట కూడా అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. నారాయణ సమీప బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ చిరుద్యోగుల పేరిట అసైన్డ్ భూములను కాజేశారు. అమరావతిలో సీడ్ క్యాపిటల్ అలైన్‌మెంట్‌ను చంద్రబాబు, నారాయణ కుటుంబ సభ్యుల ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించుకున్నారు. వారి భూముల సమీపంలోనే స్టార్టప్ ఏరియా వచ్చేలా ప్రణాళిక తయారైంది. ఈ కేసులో సిట్ అధికారులు ఇప్పటికే నారాయణ, ఆయన సతీమణి, కుమార్తెలు, అలుళ్లు, బినామీలను విచారించారు. వారి నివాసాల్లో సోదాలు చేసి కీలక ఆధారాలు సేకరించారు.

ఇన్నర్ రింగ్ రోడ్డులో అక్రమాలు..

చంద్రబాబు, నారాయణ బినామీలు, సన్నిహితులు, హెరిటేజ్ ఫుడ్స్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌కు చెందిన భూముల సమీపం నుంచే వెళ్లేలా అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. తాడిగడప – ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు నుంచి 3 మూడు కి.మీ. అవతలకు ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చారు. నారాయణ విద్యా సంస్థలకు చెందిన ఏడు క్యాంపస్‌లకు సమీపం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు వెళ్లేలా మార్పులు చేశారు. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని సంస్థలకు చెందిన భూముల సమీపం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు వెళ్లేలా అలైన్‌మెంట్ రూపొందించారు. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని సంస్థల భూముల విలువ అమాంతంగా పెరిగేలా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు.

'స్కిల్'లో రూ.241 కోట్ల అవినీతి

జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకే తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ఓ ప్రాజెక్టును సృష్టించి మరీ చంద్రబాబు బృందం రూ.241 కోట్లు కొల్లగొట్టింది. బాబు కనుసన్నల్లో శాస్త్రీయ మదింపు లేకుండానే ఏకంగా రూ.3,300 కోట్లతో ప్రాజెక్టును రూపొందించడం గమనార్హం. 2014–15లో సీఎంగా ఉన్న చంద్రబాబును సీమెన్స్ ఇండియా లిమిటెడ్ ఎండీ సుమన్ బోస్, డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ కన్విల్కర్ కలిశారు. ప్రభుత్వం 10% నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ సంస్థలు 90% నిధులు పెట్టుబడి పెడతాయంటూ ఒప్పందం కుదుర్చుకున్నారు. అసలు సీమెన్స్ కంపెనీకి ఈ ఒప్పందం గురించే తెలియకపోవడం గమనార్హం. సుమన్ బోస్ అలియాస్ సౌమ్యాద్రి శేఖర్ బోస్‌తోపాటు టీడీపీ పెద్దలు డిజైన్ టెక్‌తో కలిసి కథ నడిపించారు. ప్రాజెక్టు పనులు మొదలు పెట్టకుండానే ప్రభుత్వం తరపున 10% వాటాగా జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లను ఆ సంస్థలకు చెల్లించేశారు. షెల్ కంపెనీలకు కమీషన్లు చెల్లించి టీడీపీ పెద్దలు రూ.241కోట్లు కొల్లగొట్టారు. ఈ కేసులో సిట్ ఇప్పటికే కీలక ఆధారాలను సేకరించింది. షెల్ కంపెనీల ప్రతినిధులు, అప్పటి అధికారులు 8 మందిని అరెస్టు చేసింది. ఈడీ కూడా కొరడా ఝళిపించింది. షెల్ కంపెనీల ప్రతినిధులను అరెస్టు చేయడంతోపాటు డిజైన్‌టెక్ సంస్థ బ్యాంకు డిపాజిట్లను జప్తు చేసింది.

ఫైబర్ నెట్‌లో రూ.284 కోట్లు స్వాహా

కేంద్ర నిధులతో చేపట్టిన ఫైబర్ నెట్ ప్రాజెక్టులో టీడీపీ పెద్దలు అవినీతికి పాల్పడ్డారు. రూ.333 కోట్ల విలువైన ఫైబర్ నెట్ ప్రాజెక్టు మొదటి దశ పనులను నిబంధనలకు విరుద్ధంగా లోకేశ్ సన్నిహితుడైన వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్‌కు కేటాయించారు. అప్పటికప్పుడు విజయవాడ కేంద్రంగా నెటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్ ఎల్‌ఎల్‌పీ అనే మ్యాన్‌పవర్ సప్లై కంపెనీ పేరిట ఓ షెల్ కంపెనీని సృష్టించారు. ఆ కంపెనీ ఫైబర్ నెట్ ప్రాజెక్టుకు అవసరమైన సిబ్బందిని సమకూర్చినట్లు, పర్యవేక్షించినట్లు కథ నడిపించారు. ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న టెరాసాఫ్ట్ కంపెనీ, ఇతర కంపెనీలకు గత సర్కారు ఏకంగా రూ.284 కోట్లు విడుదల చేసింది. టెరాసాఫ్ట్ లావాదేవీలపై సీఐడీ అధికారులు ఇండిపెండెంట్ ఏజెన్సీ ఐబీఐ గ్రూప్ ద్వారా ఆడిటింగ్ జరపడంతో బాగోతం బట్టబయలైంది. టెరాసాఫ్ట్ కంపెనీ నిబంధనలను ఉల్లంఘించిందని, నాసిరకం పరికరాలు సరఫరా చేసి ప్రభుత్వాన్ని మోసగించిందని ఐబీఐ గ్రూప్ నిర్ధారించింది.

అసైన్డ్ అరాచకాలు ఇలా..

చంద్రబాబు బినామీలు, సన్నిహితులు, టీడీపీ నేతలు, బంధువులు	616.73 ఎకరాలు
పొంగూరు నారాయణ బంధువులు	140.10 ఎకరాలు
(సేల్ డీడ్ల ద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)	
నారాయణ విద్యా సంస్థలు, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ ఉద్యోగులు	
(సేల్ డీడ్ల ద్వారా అసైన్డ్ భూములు హస్తగతం చేసుకున్నారు)	
బలుసు శ్రీనివాసరావు, వెంకటరావు (తూ.గో.జిల్లా)	14.34 ఎకరాలు
కసిరెడ్డి పేరయ్య(విశాఖపట్నం)	13.96 ఎకరాలు
నిమ్మగడ్డ శాంతకుమారి (నిజామాబాద్)	10.23 ఎకరాలు
సుఖవాసి బసవరామయ్య, చైతన్య (హైదరాబాద్)	7.88 ఎకరాలు
కాట్రగడ్డ చంద్రశేఖరరావు	5.23 ఎకరాలు
వెల్లంకి శ్రీనివాస సత్యప్రసాద్	5.10 ఎకరాలు
పోలవరపు సోమశేఖర్ (హైదరాబాద్)	5.62 ఎకరాలు
పొట్లూరి జయంత్ (విజయవాడ)	4.27 ఎకరాలు
చెరుకూరి అచ్యుతకిరణ్, రోహిత్ కిరణ్ (విజయవాడ)	3.33 ఎకరాలు
బి.వెంకట నరసింహారావు (హనుమకొండ, తెలంగాణ)	3.35 ఎకరాలు
గుమ్మడి సురేశ్ (విజయవాడ)	40.96 ఎకరాలు
(ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు వియ్యంకుడు. జీపీఏ ద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)	
కొల్లి శివరామ్, విజయవాడ	52.12 ఎకరాలు
(మాజీ మంత్రి నారాయణ సమీప బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లో ఉద్యోగి. జీపీఏద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)	
యాగంటి శ్రీకాంత్, గుంటూరు	9.50 ఎకరాలు
(రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లో ఉద్యోగి. జీపీఏ ద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)	

విచారిస్తేనే వెలుగులోకి!

చంద్రబాబు సర్కారు కుంభకోణాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి: ఇన్నాళ్లూ సాంకేతిక కారణాలతో తప్పించుకుని తిరుగుతున్న మాజీ సీఎం చంద్రబాబు బృందం అక్రమాలపై 'స్టే'లను కొట్టివేస్తూ విచారణ కొనసాగించేందుకు వీలుగా అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. టీడీపీ సర్కారు హయాంలో చోటు చేసుకున్న అవినీతి బాగోతాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా విచారణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. అమరావతి భూ కుంభకోణం, ఏపీ ఫైబర్ నెట్ కుంభకోణం తదితరాల విషయంలో సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. గత సర్కారు తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, అవినీతి ఆరోపణలు, ఉల్లంఘనలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు మంత్రివర్గ ఉపసంఘం, సిట్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోల్లో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ హైకోర్టు 2020లో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తాజాగా అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. అసలు హైకోర్టు ఆ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చి ఉండాల్సింది కాదని వ్యాఖ్యానించింది. కేసు మొత్తం ఇంకా ప్రాథమిక దశలోనే ఉండగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం ఎంత మాత్రం సరికాదంది. ఈ జీవోలపై తదుపరి చర్యల నిలుపుదలకు హైకోర్టు చెప్పిన కారణాలు ఈ వ్యవహారానికి ఎంత మాత్రం సంబంధించినవి కావని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అంతేకాక గత ప్రభుత్వ నిర్ణయాలను ఆ తరువాత వచ్చే కొత్త ప్రభుత్వం సమీక్షించడానికి వీల్లేదన్న హైకోర్టు ఉత్తర్వులను సైతం సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఈ విషయం అసలు ప్రధాన కేసుకు ఎంత మాత్రం సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఈమేరకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్‌ల ధర్మాసనం బుధవారం 13 పేజీల తీర్పును వెలువరించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, నిరంజన్‌రెడ్డి వాదించగా, ప్రతివాదులు వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు.

కేంద్రం, ఈడీని ప్రతివాదిగా చేర్చాలి..

గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించేందుకు, తిరగరాసేందుకే మంత్రివర్గ ఉప సంఘం, సిట్ ఏర్పాటైనట్లు హైకోర్టు తప్పుగా భావించిందన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను సుప్రీంకోర్టు సమర్థించింది. ఆ రెండు జీవోలను పరిగణలోకి తీసుకుంటే గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించేందుకు, తిరగరాసేందుకు అవి జారీ అయ్యాయని ఎంత మాత్రం చెప్పజాలమంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఉల్లంఘనలు, అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకే మంత్రివర్గ ఉప సంఘం, సిట్ ఏర్పాటయ్యాయని సుప్రీంకోర్టు తెలిపింది. అలాగే జీవోలను సవాల్ చేస్తూ టీడీపీ నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో కేంద్ర ప్రభుత్వం, ఈడీలను ప్రతివాదులుగా చేర్చాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. హైకోర్టు ఆ పని చేసి ఉండకూడదని వ్యాఖ్యానించింది. ప్రధాన వ్యాజ్యాలను ఇంకా పరిష్కరించకుండా, సీబీఐ దర్యాప్తు కోరుతూ రాష్ట్రం రాసిన లేఖపై కేంద్రం నిర్ణయం తీసుకోక ముందే హైకోర్టు ప్రభుత్వ అనుబంధ పిటిషన్‌ను కొట్టేయడం సరికాదంది. అసలు ప్రభుత్వ జీవోలను సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేసిన టీడీపీ నేతలే కేంద్రం, ఈడీలను ప్రతివాదులుగా చేర్చి ఉండాల్సిందని స్పష్టం చేసింది. టీడీపీ నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో కేంద్ర ప్రభుత్వం, ఈడీలు తప్పనిసరిగా అవసరమైన పార్టీలని తేల్చి చెప్పింది. వారిని హైకోర్టు ముందున్న వ్యాజ్యాల్లో ప్రతివాదులుగా చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాక కేంద్రం, ఈడీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలంది. చట్టప్రకారం కేసు పూర్వాపరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని టీడీపీ నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాలను మూడు నెలల్లో పరిష్కరించాలని హైకోర్టుకు సూచించింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లను అనుమతించింది.

నిగ్గు తేల్చిన ఉపసంఘం, సిట్...

టీడీపీ హయాంలో జరిగిన అమరావతి భూ కుంభకోణం, ఏపీ ఫైబర్ నెట్ స్కామ్‌లతో పాటు నాటి నిర్ణయాలు, చేపట్టిన ప్రాజెక్టులపై వచ్చిన అవినీతి ఆరోపణలు, ఉల్లంఘనలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తూ 2019లో జీవో 1411 జారీ చేసింది. గత ప్రభుత్వ విధాన నిర్ణయాలతో పాటు పలు అంశాలపై సమీక్ష జరిపిన మంత్రి వర్గ ఉప సంఘం పలు ప్రాథమిక ఆధారాలతో ప్రభుత్వానికి ఓ నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలు, ఉల్లంఘనలపై దర్యా ప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2020లో జీవో 344 జారీ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సిట్ ఈ కుంభకోణాలు విస్తృతమైనవని, ఇందులో చాలా కీలక అంశాలు ముడిపడి ఉన్నందున దీనిని సీబీఐ దర్యాప్తునకు ఇవ్వడం సమంజసంగా ఉంటుందని ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ లేఖ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఓ లేఖ రాసి, ఈ కుంభకోణాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరింది.

పార్టీ ప్రయోజనం కోసమే వేశామన్నా పట్టించుకోని హైకోర్టు...

రాష్ట్ర ప్రభుత్వ లేఖపై కేంద్రం నిర్ణయం తీసుకోక ముందే టీడీపీ నేతలు వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్రప్రసాద్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం, సిట్ ఏర్పాటు జీవోలను సవాలు చేశారు. ఈ వ్యాజ్యాల్లో వారు ఉద్దేశపూర్వకంగానే సీబీఐ, ఈడీలను ప్రతివాదులుగా చేర్చలేదు. తమ పార్టీ ప్రయోజనాల కోసమే పిటిషన్లు దాఖలు చేశామని వర్ల రామయ్య లిఖితపూర్వంగా కోర్టుకు చెప్పారు. టీడీపీ నేతలు వేసిన ఈ వ్యాజ్యాలపై జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు విచారణ జరిపారు. మంత్రివర్గ ఉప సంఘం, సిట్ ఏర్పాటు వల్ల పిటిషనర్లు వ్యక్తిగతంగా ఏ విధంగానూ ప్రభావితం కావడం లేదని, వారు దాఖలు చేసిన వ్యాజ్యాలకు విచారణార్హత లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. సీబీఐ, ఈడీలను ఈ వ్యాజ్యాల్లో ప్రతివాదులు గా చేర్చాలంటూ అనుబంధ వ్యాజ్యాలను దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతల వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయమూర్తి రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలన్నింటినీ తోసిపుచ్చారు. టీడీపీ నేతలు కోరిన విధంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. జీవోల్లో తదుపరి చర్యలన్నీ నిలిపేశారు. గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించే అధికారం కొత్త ప్రభుత్వానికి లేదని తేల్చి చెప్పేశారు.

హైకోర్టు పరిగణనలోకి తీసుకుని ఉండాల్సింది..

2020లో హైకోర్టు ఇచ్చిన ఈ మధ్యంతర ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వ పిటిషన్‌పై విచారణ చేపట్టి తీర్పును రిజర్వ్ చేసిన జస్టిస్ షా ధర్మాసనం బుధవారం తమ ఉత్తర్వులను వెలువరించింది. మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిన ప్రధాన ఉద్దేశాలను హైకోర్టు పరిగణలోకి తీసుకుని ఉండాల్సిందని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన పలు న్యాయపరమైన అంశాలను హైకోర్టు పరిగణలోకి తీసుకోలేదని ధర్మాసనం ఆక్షేపించింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు రాసిన లేఖను హైకోర్టు ఏ మాత్రం పరిగణలోకి తీసుకోలేదని సుప్రీంకోర్టు ధర్మాసనం తప్పుపట్టింది.

కేసు విచారణ సందర్భంగా 'సుప్రీం' వ్యాఖ్యలివీ

- పారదర్శకంగా ఉన్నప్పుడు సిట్ దర్యాప్తునకు ఎందుకు భయపడుతున్నారు?
- గత ప్రభుత్వ అవినీతిని సమీక్షించకూడదంటే వందశాతం ఇమ్యూనిటీ ఇచ్చినట్లే కదా?
- పాలనలో దురుద్దేశం ఉన్నప్పుడు విచారణ జరగాలి కదా?
- సీబీఐ విచారణకు స్వీకరించలేదంటే తప్పు జరగలేదని ముందే ఎలా ఊహించుకుంటారు?
- ప్రతి ఒక్కరూ చీకట్లోనే వెతుకుతారు? విచారణ జరిగితే అన్నీ వెలుగులోకి వస్తాయి

ఆడిటర్ బుచ్చిబాబును విచారించిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో హైదరాబాద్‌కు చెందిన ఆడిటర్ బుచ్చిబాబును ఈడీ మరోసారి విచారించింది. ఈ కుంభకోణానికి సంబంధించి రూ.100 కోట్లు కిక్ బ్యాక్‌ల రూపంలో సౌత్‌గ్రూపునకు చేరడం, ఢిల్లీ, హైదరాబాద్ హోటళ్లలో సమావేశాలు, వ్యాపారం నిమిత్తం బుచ్చిబాబు చేసిన సూచనలు సలహాలు, సహా పలు అంశాలపై విచారించినట్లు తెలిసింది. మంగళవారం కూ డా బుచ్చిబాబును విచారించినట్లు సమాచారం. ఆయన గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా ఇటీవల ఈడీ దాఖలు చేసిన వేర్వేరు ఛార్జిషీట్లలో పొందుపరిచిన అంశాలపైనా స్పష్టత తీసుకున్నట్లు సమాచారం. ఈ కేసులో బుచ్చిబాబును సీబీఐ ఇప్పటికే అరెస్టు చేయగా బెయిలుపై ఉన్న విష యం విదితమే.

నేడు ఢిల్లీలో బీఆర్ఎస్ నూతన భవనం ప్రారంభం

- దేశ రాజధానిలో సొంత కార్యాలయంలోకి బీఆర్ఎస్
- పూజల అనంతరం మధ్యాహ్నం 1:05 గంటలకు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ పార్టీ రాజకీయ ప్రస్థానంలో మరో ముఖ్యఘట్టం ఆవిష్కృతం కానుంది. రాజకీయ విస్తరణలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో బీఆర్ఎస్ నూతన కార్యాలయ భవనాన్ని గురువారం ప్రారంభించనున్నారు. శాస్త్రోక్త కార్యక్రమాలు, పూజల అనంతరం బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, అధికారిక పనులను ప్రారంభించనున్నారు. ఆడంబరాలకు దూరంగా జరగనున్న ఈ ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్‌తో పాటు కొద్దిమంది మంత్రులు, ముఖ్య నేతలు మాత్రమే పాల్గొంటారని సమాచారం.

1:05 గంటలకు ముహూర్తం:

బీఆర్ఎస్ కార్యాలయ భవన ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం ఉదయం 5:30 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. వాస్తు పూజ, నవ చండీయాగం, సుదర్శన హోమాన్ని నిర్వహించేందుకు యాగశాలను ప్రత్యేకంగా సుద్దాల సుధాకర్ తేజతో సిద్ధం చేయించారు. మధ్యాహ్నం 12:30 గంటల లోగా పూజా కార్యక్రమాలు పూర్తి కానున్నాయి. పూర్ణాహుతి కార్యక్రమం ముగిశాక సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 1:05 గంటలకు రిబ్బన్ కట్ చేసి భవనంలోని తన చాంబర్‌లో ప్రవేశించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జాతీయ కమిటీలో ఒకటి, రెండు నియామకాల ఉత్తర్వులపై కేసీఆర్ సంతకం చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కాగా బుధవారం మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్‌లు ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. మరికొందరు నేతలు గురువారం ఉదయానికి ఢిల్లీ చేరుకోనున్నారు. గత నాలుగు రోజులుగా ఢిల్లీలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కువ హడావుడిలేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు నేతలు చెబుతున్నారు.

సుజనాపై 'లుక్‌అవుట్' ఎత్తివేత కుదరదు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: బ్యాంకుల నుంచి రూ. 6 వేల కోట్లు రుణాలు తీసుకొని, అక్రమంగా దారి మళ్లించిన వ్యవహారంలో కంపెనీల మీద సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసినందున వ్యక్తిగతంగా తనపై ఉన్న లుక్‌అవుట్ నోటీసులు (ఎల్‌వోసీ) ఎత్తివేయాలని మాజీ ఎంపీ సుజనా చౌదరి కోరడాన్ని తెలంగాణ హైకోర్టు తప్పుబట్టింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తున్నాం కదా అని ఎల్‌వోసీ నోటీసులు కొట్టివేయాలని కోరడం సరికాదని తేల్చి చెప్పింది. తనపై లుక్ అవుట్ నోటీసులను సస్పెండ్ చేయాలని, ఏప్రిల్ 29 నుంచి విదేశీ పర్యటనకు అనుమతించాలని కోరుతూ సుజనా చౌదరి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ జరిపారు.





ఆ కేకుల కోసం క్యూ కడతారు

బొమ్మలేసే ఆర్టిస్టు గురించి విన్నాం. కేక్ ఆర్టిస్ట్ గురించి ఎప్పుడైనా విన్నారా? ప్రాచీ ధబల్‌ను మన దేశంలో బేకింగ్ క్వీన్‌గా, గొప్ప కేక్ ఆర్టిస్ట్‌గా పిలుస్తారు. కేక్‌లను కళాత్మకంగా సౌందర్యాత్మకంగా చేసి తినడానికే కాదు చూడటానికి కూడా రుచికరంగా తయారు చేసి అంతర్జాతీయ అవార్డులు పొందుతోందామె. ఈ ఫొటోలు చూడండి. అన్నీ తినే కేకులే. 'మీరూ ఇలా కొత్తగా ట్రై చేసి సక్సెస్ సాధించండి' అంటోంది ప్రాచీ.

ప్రపంచ ప్రఖ్యాత కేక్ ఆర్టిస్ట్ ఎవరో తెలుసా? యూకేకు చెందిన ఎడ్డీ స్పెన్స్. కళాత్మకమైన కేకుల తయారీలో ఆయన ప్రతిభకు అక్కడి ప్రభుత్వం 'సర్' బిరుదుతో గౌరవించింది. 'నేను లండన్ వెళ్లి ఆయన దగ్గర పని నేర్చుకున్నాను. నాకు కేక్ ఆర్ట్ అంటే అంత పిచ్చి' అంటుంది ప్రాచీ ధబల్.

36 ఏళ్ల ప్రాచీ గత సంవత్సరం 100 కిలోల కేక్‌ను తయారు చేసింది. ఇది ఇటలీలో ప్రసిద్ధమైన మిలాన్ కేథడ్రల్ (చర్చ్)కు రెప్లికా. ఆరున్నర అడుగుల పొడవు, నాలుగున్నర అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పు ఉన్న ఈ భారీ చర్చ్ ఆకారపు కేక్‌లో దాదాపు 1500 సున్నితమైన భాగాలు ఉన్నాయి. వాటన్నింటినీ రాయల్ ఐసింగ్ (తెల్ల సొన, చక్కెర పొడుల మిశ్రమం)తో తయారు చేసి 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 2022'లో ఎక్కింది ప్రాచీ. అందుకే ఆమెను 'బేకింగ్ క్వీన్ ఆఫ్ ఇండియా' అంటుంటారు.

చిన్నప్పటి నుంచి

ప్రాచీ ధబల్ సొంత ఊరు డెహరాడూన్. అక్కడే పుట్టి పెరిగింది. 'నాకు పదేళ్లున్నప్పుడు వేసవి సెలవుల్లో కేకుల తయారీని మా అమ్మ నాకు కాలక్షేపంగా నేర్పింది. నేను కప్‌కేక్‌లు తయారు చేసేదాన్ని. రోజులు పెరిగే కొద్దీ ఆ ఆసక్తి కూడా పెరిగింది. నాకు బొమ్మలు వేయడం కూడా వచ్చు. కథల పుస్తకాలు బాగా చదివేదాన్ని. నా పుట్టిన రోజున బయట కేక్ ఆర్డర్ ఇస్తున్నప్పుడు నేను చదివిన కథల్లోని కోటల్లాంటి, రాకుమార్తెల్లాంటి, ఉద్యానవనాల్లాంటి కేక్‌లు తెప్పించమని మా అమ్మను పోరేదాన్ని. కాని అలాంటి కేకులు ఎవరూ తయారు చేయరు. మార్కెట్‌లో మామూలు కేకులు ఉండేవి. నాకు అలాంటివి ఎందుకు తయారు చేయకూడదు అనిపించేది' అంది ప్రాచీ ధబల్.









ప్రాచీ ధబల్ తయారుచేసిన కేక్స్

ఉద్యోగం నచ్చలేదు

ప్రాచీ కోల్‌కతాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. ఆ తర్వాత ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా పూణెలో ఉద్యోగానికి వచ్చి స్థిరపడింది. కాని ఆమెకు ఆ ఉద్యోగం నచ్చలేదు. '2012 నాటికి నాకు ఉద్యోగం బోర్ కొట్టింది. అందులో నాకు ఇష్టమైనదేదో లేదు. నాకు కేక్ ఆర్టిస్ట్‌గా మారాలనిపించింది. కాని ఆ రోజుల్లో ఆ కళకు పెద్దగా గిరాకీ లేదు. ఎవరికీ అలాంటిది ఒకటి ఉంటుందని తెలియదు. కళాత్మక కేకులు తయారు చేయాలంటే కావలసిన మెటీరియల్ మన దేశంలో దొరికేది కాదు. అయినా సరే తెగించి విదేశాల నుంచి కావలసిన సామాగ్రి తెప్పించుకుంటూ రంగంలో దిగాను. నేను తయారు చేసేది షాపులో అమ్మే కేకులు కాదు. కస్టమైజ్డ్ కేకులు. అందువల్ల వీటి ఖరీదు కూడా ఎక్కువ. అలాంటి కస్టమర్లు పెరిగే వరకూ నాకు కొంచెం కష్టంగానే అనిపించింది. కాని నా ప్రత్యేకమైన కేకులు నలుగురి దృష్టిలో పడ్డాక ఇప్పుడు ఊపిరి సలపడానికి కూడా టైమ్ లేదు' అని నవ్వుతుంది ప్రాచీ.

దేశీయత

ప్రాచీ తయారు చేసే కేకులు దేశీయతతో నిండి ఉంటాయి. చీరల మీద డిజైన్లు, ఆర్కిటెక్చర్, సంప్రదాయ చిహ్నాలు అన్నీ ఆమె కేకుల్లో కనిపిస్తాయి. ఇటీవల ఆమె బెనారస్ చీరను, ఆభరణాలను పోలిన కేక్‌ను తయారు చేసింది. 'కుంకుమ భరిణె'లా కనిపిస్తున్న ఆ కేక్ ఎన్నో ప్రశంసలు పొందింది. ఆమె తయారు చేసిన నెమలి కేక్‌లో పైకి ఆభరణాలుగా కనిపించేవి కూడా తినదగ్గ మెటీరియల్‌తో తయారు చేసినవే. అయితే ఈ కళను ప్రాచీ తన దగ్గరే దాచుకోవడం లేదు. యువ బేకర్‌లకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసి నేర్పుతోంది. 'అమ్మాయిలు ముందు తమకు ఇష్టమైన రంగంలో కనీస డిగ్రీ సంపాదించాలి. ఆ తర్వాత ఆ ఇష్టం కోసం కష్టపడాలి. తప్పకుండా విజయం లభిస్తుంది. కష్టపడకుండా ఏదీ రాదు' అంటుంది ప్రాచీ.

పాత దారిలో కొత్తగా నడవడమే విజయం అని ప్రాచీ విజయం తెలుపుతోంది.

కిచెన్ టిప్స్





● రోజూ కాఫీ ఒకటే రుచితో బోరుకొడితే వెరైటీ రుచి కోసం అందులో కొద్దిగా బోర్న్‌వీటా కలుపుకోవాలి.

● బొంబాయి రవ్వ హల్వా మరింత రుచిగా ఉండాలంటే ఒక టేబుల్ స్పూన్ శనగ పిండిని కలుపుకోవాలి.

● ఇంగువ గట్టిపడితే అందులో పచ్చిమిర్చి వేయాలి.



● మిగిలిపోయిన అన్నంలో కొంచెం మసాలా దినుసులు, బ్రెడ్ వేసి అన్నాన్ని మెత్తగా చేయాలి. ఈ మిశ్రమంతో కరకరలాడే పకోడీలు తయారు చేసుకుని తినవచ్చు.

● కూరల్లో కారం కాస్త ఎక్కువైతే అందులో కొంచెం నిమ్మరసం లేదా రెండు టీస్పూన్ల నెయ్యి కలిపితే కారం తగ్గుతుంది.

● పిల్లలకు రుచికరమైన ఫ్రూట్ షేక్ ను నిమిషాల్లో అందివ్వాలంటే ఒక టేబుల్ స్పూన్ ఫ్రూట్ జామ్ ను ఒక గ్లాసు చల్లటి పాలలో వేసి మిక్సీలో బ్లెండ్ చేయాలి. రుచికరమైన ఫ్రూట్ షేక్ రెడీ.



● కొత్తిమీర చట్నీ తయారు చేసే సందర్భంలో కొన్ని నట్స్ వేస్తే పోషకాలు అందటంతోపాటు, ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది.

● పనీర్ వంటకం చేసేటప్పుడు నీళ్లకు బదులుగా పాలు వాడితే గ్రేవీ మెత్తగా ఉంటుంది.



● గులాబ్ జాముస్ లు గట్టిగా అయితే పంచదార పాకంతో సహా వాటిని ప్రెషర్ కుక్కర్ లో పెట్టి సన్నటి మంట మీద ఐదు నిమిషాలు ఉడికిస్తే మృదువుగా మారతాయి.

● కలిపిన చపాతీ పిండి మిగిలిపోతే ఆ ముద్ద పైన కొద్దిగా నూనె లేదా నెయ్యి వేసి రిఫ్రిజిరేటర్ లో ఉంచాలి.



ఆలూరి లలిత

అవసరం నుంచి ఆకాంక్ష వరకు

మహిళల పురోగతికి ఆకాశమే హద్దు.
నిజమే... మరి!
మహిళ పురోగతి ఎక్కడ మొదలవుతుంది?
ఒక ఆకాంక్ష నుంచి మొదలు కావచ్చు...
అలాగే...
ఒక అవసరం నుంచి కూడా మొదలు కావచ్చు.
అవును...
అవసరమే ఆమెను జాతీయస్థాయిలో నిలిపింది.
ఆమె...
మహిళలకు చేయూతనిచ్చే స్థానంలో నిలిచింది.

ఆలూరి లలిత మహిళాపారిశ్రామికవేత్త. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ చేశారు. పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో వ్యాపార కుటుంబంలో అడుగుపెట్టారు. ఉమ్మడి కుటుంబం కూడా కావడంతో తన మీద పెద్ద బాధ్యతలేవీ లేవు. నాలుగేళ్లు అలా గడిచిపోయాయి. తమ కంపెనీ ఒడిదొడుకుల్లో ఉందని, భాగస్వాములు దూరం జరిగారని తెలిసిన తర్వాత భర్తకు తోడుగా బాధ్యత పంచుకోవడానికి భుజాన్నివ్వాల్సి వచ్చింది. అలా మొదలైన పారిశ్రామిక ప్రస్థానం ఆమెను విజేతగా నిలపడంతోపాటు జాతీయస్థాయిలో సంఘటితమైన మహిళా పారిశ్రామిక వేత్తల సమాఖ్య (కోవె)కు అధ్యక్షురాలిని చేసింది. ఆ వివరాలను సాక్షితో పంచుకున్నారు లలిత.

'అవసరం'తో పోరాటం

"గృహిణిగా ఉన్న నేను పరిశ్రమ నిర్వహణలోకి అడుగుపెట్టింది 1998లో. అప్పటికే మనుగడ సమస్య మాది. తీరా అడుగుపెట్టిన తర్వాత తెలిసింది బ్యాంకు వాళ్లు మా పరిశ్రమను ఎన్‌పీఏ (నాన్ పెర్ఫార్మింగ్ అసెట్) కేటగిరీలో లిస్ట్ చేశారని. మూడు క్వార్టర్లు బకాయి పడి ఉన్నాం. మరో క్వార్టర్ సమయం కావాలని అడిగాను. మొదట్లో ససేమిరా అన్నారు. 'మీరు హ్యాండోవర్ చేసుకుని మీ డబ్బు ఎలా జమ చేసుకుంటార'ని అడిగాను. మెషినరీ అమ్మేస్తామన్నారు. ఈ మెషీన్‌లతో పని చేయడానికి మా వారు సింగపూర్‌లో శిక్షణ తీసుకుని వచ్చారు, హైదరాబాద్‌లో ఈ టెక్నాలజీ చాలామందికి తెలియదు. మీరు స్క్రాప్ కింద అమ్మాల్సిందే, రెండు లక్షలు కూడా రావు. మాకు టైమిస్తే మీ లోన్ మొత్తం తీర్చేస్తామని చెప్పాను. ఆ తర్వాత అక్కచెల్లెళ్లు, అన్నదమ్ముల సహాయంతో పది లక్షలు ఎదురు పెట్టి కొత్త టెక్నాలజీతో పరిశ్రమను నడిపించాం. రెండేళ్లపాటు రోజుకు 18 గంటలు పనిచేశాం. మొత్తానికి గట్టెక్కాం. 2005లో పరిశ్రమ విస్తరించాలనే ఆలోచనతో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ నెట్‌వర్క్ – జేఎన్‌టీయూ తో కలిసి నిర్వహించిన ఎంప్లాయ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో శిక్షణ తీసుకున్నాను. అప్పటి నుంచి ఈ సంస్థలో భాగస్వామినయ్యాను. లైఫ్ మెంబర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్, తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్, జాతీయ స్థాయి కమిటీలో జాయింట్ సెక్రటరీ, సెక్రటరీ బాధ్యతలు నిర్వహించి ఇప్పుడు ప్రెసిడెంట్ బాధ్యతలు చేపట్టాను.

ఈ రాష్ట్రాలు ముందున్నాయి!

మహిళా పారిశ్రామిక వేత్తల విషయంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, యూపీ, ఢిల్లీ రాష్ట్రాలు ముందువరుసలో ఉన్నాయి. వెస్ట్‌బెంగాల్, తమిళనాడు, మహారాష్ట్రతోపాటు కొన్ని రాష్ట్రాలు చేయి పట్టి నడిపించాల్సిన దశలోనే ఉన్నాయి. మా సంస్థలో ఉన్న ఎంటర్‌ప్రెన్యూర్స్‌లో ఎక్కువ మంది బాగా చదువుకున్న వాళ్లే. ఐఐటీ, బిట్స్, ఐఐఎమ్ స్టూడెంట్స్ ఉన్నారు. వాళ్లు ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ కంపెనీలు నిర్వహిస్తున్నారు. మా చదువు, పరిశ్రమ నిర్వహణలో మేము నేర్చుకున్న మెళకువలతో కొత్తగా పరిశ్రమల రంగంలోకి వచ్చిన వాళ్లకు మెంటార్‌గా వ్యవహరిస్తున్నాం. ఈశాన్య రాష్ట్రాల మీద ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నాం. అలాగే కాలేజీలకెళ్లి విద్యార్థులకు వర్క్‌షాపులు నిర్వహించడం, నగరాల్లోని అల్పాదాయ వర్గాలు నివసించే కాలనీల్లోనూ, గ్రామాల్లోనూ మహిళలకు శిక్షణతోపాటు ఇన్‌క్యుబేషన్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నాం.

మహిళలు మారారు!

మహిళల్లో చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు మహిళలు ఉద్యోగం చేసుకుంటే చాలన్నట్లు, భర్త సంపాదనకు తోడు మరికొంత అన్నట్లు ఉండేవారు. ఇప్పుడు ఆ ధోరణి పూర్తిగా మారిపోయింది. తన ఐడెంటిటీని తామే రాసుకోవాలనే ఆకాంక్ష పెరిగింది. అలాగే విజయవంతం అవుతున్నారు. ఉద్యోగం చేసి పిల్లల కారణంగా కెరీర్‌లో విరామం వచ్చిన మహిళలకు (35 నుంచి 45 ఏళ్ల మధ్య ఉన్న వారికి) వారి సామర్థ్యం, ఆసక్తిని బట్టి 'రీ ఇగ్నైట్' ప్రోగ్రామ్ కింద సపోర్ట్ చేస్తున్నాం. పదివేల మంది విద్యార్థులను, 30 వేల మంది గ్రామీణ మహిళలను సాధికారత దిశలో నడిపించాలనేది ప్రస్తుతం మా కోవె ముందున్న లక్ష్యం".

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి
ఫొటోలు : మోర్ల అనిల్ కుమార్

ఇలా చేయండి

ఒక మహిళ వ్యాపారం కానీ పరిశ్రమ కానీ పెట్టినప్పుడు అది నిలదొక్కుకుని లాభాల బాట పట్టే వరకు దాదాపుగా మూడు నాలుగేళ్లు జీవితం మనది కాదు మన పరిశ్రమది అనుకుని శ్రమించాలి. మార్కెట్‌ని విశ్లేషించుకోవాలి. రెవెన్యూ మీద అవగాహన ఉండాలి. పెట్టుబడి, రాబడి మాత్రమే కాదు. రాబడికి ఆదాయానికి మధ్య తేడా తెలుసుకోవాలి.

● కౌంటర్‌లోకి వచ్చిన ప్రతిరూపాయి మనది కాదు. ఉద్యోగుల వేతనాలు, అద్దె, కరెంటు, పెట్టుబడి కోసం మనం ఇంటి నుంచి పెట్టిన డబ్బుకు కొంత జమ వేసుకోవడం, బ్యాంకు లేదా ఇతర అప్పులు అన్నీ పోగా మిగిలినదే ఆదాయం. అదే మనం సంపాదించినది, మన కోసం ఖర్చు చేసుకోగలిగినది.

● పరిశ్రమ కోసం ఒక మూలనిధి ఏర్పాటు చేసి ఏటా పదిశాతం లాభాలను మూలనిధిలో జమ చేయాలి. యంత్రాల రిపేరు వంటి అనుకోని ఖర్చులకు, పరిశ్రమ విస్తరణకు ఆ నిధి పనికొస్తుంది. కోవిడ్ దెబ్బకు తట్టుకుని నిలబడినవన్నీ మూలనిధి ఉన్న పరిశ్రమలే.

● మహిళలు గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే... పరిశ్రమ నిర్వహణ బరువైనప్పుడు అది లాభాల బాట పట్టడం కష్టం అని నిర్ధారించుకున్నప్పుడు దాని నుంచి వెంటనే మరొక దానికి మారిపోవాలి.

● మొదట్లో కష్టపడినన్ని గంటలు పదేళ్లు, పాతికేళ్లు కష్టపడలేరు. కాబట్టి ఇంట్లోనూ, పరిశ్రమలోనూ సపోర్టు సిస్టమ్‌ని అభివృద్ధి చేసుకోవాలి.

సైబర్ టాక్

లైక్స్ పేరుతో ట్రాప్


పార్ట్‌టైమ్ జాబ్స్ కావాలంటే ఈ లింక్‌పై ఒక్క క్లిక్ చేయండి..

సోషల్ మీడియాలో పోస్టులకు లైక్స్, కామెంట్స్, వ్యూస్

వచ్చేలా చేస్తే చాలు మీకు డబ్బే డబ్బే..

ఆన్‌లైన్‌లో సంపాదించండి అత్యంత సులభంగా .. అంటూ ఊదరగొట్టే ప్రకటనలకు సోషల్ ఇంజినీరింగ్ మోసాలకు వేదికగా మారింది టెలిగ్రామ్. చదువుకున్న గృహిణులు, విద్యార్థులను ట్రాప్ చేయడానికి స్కామర్లు టెలిగ్రామ్ యాప్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. తస్మాత్ జాగ్రత్త!!

•••



ఆన్‌లైన్ సంపాదన వైపు ఇప్పుడు నవతరం మొగ్గుచూపుతోంది. అదనపు ఆదాయం కోసం చూస్తున్నవారు ముఖ్యంగా టెలిగ్రామ్ యాప్ ద్వారా వచ్చే ప్రకటనల ఊబిలో కూరుకు పోతున్నారు. అపరిమితమైన సభ్యులుండే పెద్దగ్రూప్ చాట్ ఫీచర్‌కు టెలిగ్రామ్ సపోర్ట్ ఇవ్వడం వల్ల కూడా అధికంగా మోసాలు జరిగేందుకు ఆస్కారం ఇచ్చినట్లయింది.

పైసా వసూలు

ప్రముఖ పెట్టుబడి, కార్పొరేట్ ట్రేడింగ్ కంపెనీలకు చెందిన అధికారులుగా నటించే స్కామర్లు పెద్ద మొత్తంలో డబ్బును లాగేందుకు బాధితులను తరచు ప్రాసెసింగ్ ఫీజు, వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించమని, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు తప్పులు జరిగాయని ... ఇలా రకరకాల సాకులతో డబ్బు వసూలు చేస్తుంటారు.

సులభంగా నష్టం

మోసగాళ్లు టెలిగ్రామ్‌నే ఎక్కువగా ఉపయోగించడానికి కారణాలున్నాయి. వాటిలో..

● టెలిగ్రామ్ వినియోగదారులు వర్చువల్‌గా దేశీ విదేశీ నంబర్లతో సైన్ అప్ అవ్వచ్చు. తమ గుర్తింపును దాచవచ్చు.

● టెలిగ్రామ్ యూజర్లు మల్టిపుల్ అకౌంట్స్‌ను సులభంగా క్రియేట్ చేయవచ్చు. దాంతో సైబర్ పరిశోధకులకు నేరస్థుడిని ట్రాక్ చేయడం, గుర్తించడం కష్టమవుతుంది.

● పైరేటెడ్ సినిమాలు, సాఫ్ట్‌వేర్ ఫైల్స్ సులభంగా షేర్ అవుతాయి. వీటిద్వారా ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లుతుంది.

● యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్‌లను నేరస్థులు లీక్ చేయడానికి యాక్సెస్ ఇస్తుంది.

● చట్టవిరుద్ధమైన లేదా నకిలీ అవుట్‌లెట్‌ల కోసం లగ్జరీ బ్రాండ్లను ఈ గ్రూప్ ద్వారా విక్రయిస్తుంటారు.

● మోసపూరిత స్కీమ్‌లు అధికంగా ఉంటాయి. ఇవి ప్రధానంగా మెసేజింగ్ ద్వారా తమ అప్లికేషన్స్‌లోకి లాగుతాయి.

● స్కామర్లు తమను తాము చట్టబద్ధమైన ఏజెంట్లుగా లేదా వివిధ కార్పొరేషన్ ఉద్యోగులుగా చూపించుకుంటారు.

● స్కామర్లు బాధితులను ఆకర్షించడానికి తరచు ప్రముఖ ఛానెళ్ల నకిలీ వెర్షన్లను సృష్టిస్తారు. ఈ గ్రూప్‌లకు ఒకేవిధమైన పేర్లు, ప్రొఫైల్ ఫొటోలు ఉంటాయి. చట్టబద్ధమైన వాటితో సరిపోలే విధంగా యూజర్ పేర్లతో ఉంటాయి.

● ప్రమోషన్లు, ఉచిత బహుమతులు, రాజకీయ నాయకుల ఆధారిత పథకాలతో కూడిన స్కామ్‌లకు అమాయకులు బలవుతుంటారు.

● ఏదోవిధమైన సమస్యను సృష్టించడం, ఆ సమస్యను పరిష్కరించడానికి మీ డిజిటల్ (ల్యాప్‌టాప్ లేదా ఫోన్) పరికరాల రిమోట్ కంట్రోల్ తీసుకోవడం... ఈ ప్రక్రియలో మీ వ్యక్తిగత, ఆర్థిక సమాచారం కాస్తా స్కామర్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది.

● స్కామర్లు తమను తాము బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ నిపుణులుగా చెప్పుకుంటారు. క్రిప్టో పెట్టుబడులపై రాబడిని హామీగా చూపుతారు. దీంతో బాధితులు వీటిపట్ల మొగ్గుచూపుతారు. అందుకు తగినట్టుగా పెట్టుబడి పెరుగుతున్నట్టుగా గ్రాఫ్‌లు, చార్ట్‌లు చూపుతారు. అయితే, బాధితుడు తమ డ్యాష్‌బోర్డ్‌లో ఉన్న మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోలేడు. ఆ తర్వాత స్కామర్లు కనిపించరు. ఎంత మొత్తుకున్నా, స్కామర్లు గ్రూప్‌లో మరోసారి స్పందించరు.

● ఈ స్కామ్‌లో స్కామర్లు చట్టబద్ధమైన టెక్ సపోర్ట్ ఏజెంట్ల మాదిరిగా నటిస్తారు. స్కామర్లు సమస్యను పరిష్కరించడానికి బాధితుల ల్యాప్‌టాప్ లేదా పరికరాన్ని రిమోట్ కంట్రోల్‌గా తీసుకుంటారు. ఈ ప్రక్రియలో బాధితుల వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సేకరిస్తారు.

● బాధితులు తమకు ఫొటోలు లేదా వీడియోలు పంపమని అడుగుతారు. రొమాన్స్ ఫ్రాడ్‌కు కూడా పాల్పడతారు.

● ఉచిత క్రిప్టో కరెన్సీ లేదా టోకెన్‌లను పంపిణీ చేస్తామని నకిలీ ఎయిర్‌డ్రాప్ ప్రచారాలను సృష్టిస్తారు.

● నకిలీ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన బహుమతులతో తమవైపు ఆకర్షించేలా చేస్తారు. దీనిద్వారా యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని పొందుతారు.

ఇవీ భద్రతా చర్యలు

● కనీసం పది పెద్ద, చిన్న అక్షరాలు, సంఖ్యలు, చిహ్నాలతో కూడి ప్రత్యేకమైన, ఊహించడానికి కష్టంగా ఉండే పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలి.

● https://www.unshorten.it or https://www.checkshorturl.com ను ఉపయోగించిన మీకు వచ్చిన లింక్స్ యుఆర్ఎల్ లు సరైనవేనా అని ధ్రువీకరించండి.

● తెలియని వారి నుంచి వచ్చే లింక్స్ క్లిక్ చేయడానికి, డౌన్‌లోడ్ చేయడానికి ముందు వెబ్‌లింక్‌ను ఒకటికి రెండుసార్లు చెక్ చేయాలి.

● యూజర్ తమ ప్రొఫైల్‌కి వెళ్లి స్క్రీన్ మూలలో ఉన్న మూడు చుక్కలపై క్లిక్ చేసి 'బ్లాక్ యూజర్'ని ఎంచుకోవాలి.

● పరిచయం ఉన్నవారితోనే చాట్‌ను కొనసాగించండి.

● పెట్టుబడులపై అధిక రాబడి లేదా ఉచిత బహుమతులు వంటి నిజమని అనిపించే ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండండి.

● టెలిగ్రామ్‌లో టెక్స్ట్ చేస్తున్నప్పుడు లేదా వాయిస్ చాట్ చేస్తున్నప్పుడు స్క్రీన్ షేరింగ్ ఎప్పుడూ చేయకూడదు.

టెలిగ్రామ్‌లో మోసపోతే..

● abuse@telegram.org లో మీకు జరిగిన మోసాన్ని రిపోర్ట్ చేయండి. స్కామర్ గురించి @notoscamకు నివేదించండి.

● https://cybercrime.gov.in/లో ఫిర్యాదును నమోదు చేయండి. ఆన్‌లైన్‌లో నష్టపోతే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేసి రిపోర్ట్ చేయండి.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



ప్రపంచ నంబర్‌వన్ జోడీకి బోపన్న ద్వయం షాక్

రెండు నెలల వ్యవధిలో రెండోసారి ప్రపంచ నంబర్‌వన్ జోడీని బోల్తా కొట్టిస్తూ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ జోడీ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్ వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) ద్వయంపై గెలిచింది. మార్చిలో ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ ఫైనల్లో కూలాఫ్-స్కుప్‌స్కీ జంటను ఓడించి బోపన్న ద్వయం విజేతగా నిలిచింది.

నిశాంత్ దేవ్ సంచలనం



ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ నిశాంత్ దేవ్ సంచలన విజయంతో శుభారంభం చేశాడు. తాష్కెంట్‌లో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో బుధవారం జరిగిన 71 కేజీల తొలి రౌండ్ బౌట్‌లో నిశాంత్ దేవ్ 5-0తో సర్ఖాన్ అలియెవ్ (అజర్‌బైజాన్)పై గెలుపొందాడు. 2021 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నిశాంత్ దేవ్ క్వార్టర్ ఫైనల్ చేరగా... ఇదే టోర్నీలో అలియెవ్ కాంస్య పతకం సాధించాడు.

ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ అథ్లెట్ టోరి బోవి హఠాన్మరణం



ఫ్లోరిడా: ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ మహిళా అథ్లెట్ టోరి బోవి (అమెరికా) హఠాన్మరణం చెందింది. ఫ్లోరిడాలోని ఆమె నివాసంలో విగతజీవిగా పడి ఉన్నట్లు గుర్తించారు. ఆమె మరణానికి గల కారణాలను ఇంకా వెల్లడి కాలేదు. కొంత కాలంగా ఆమె మానసిక ఒత్తిడితో బాధపడుతోందని సమాచారం. 32 ఏళ్ల టోరి బోవి 2016 రియో ఒలింపిక్స్‌లో 4x100 మీటర్ల రిలేలో స్వర్ణం, 100 మీటర్లలో రజతం, 200 మీటర్లలో కాంస్య పతకం సాధించింది. 2015 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో కాంస్యం నెగ్గిన ఆమె... 2017లో లండన్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది. అంతే కాకుండా 4x100 మీటర్ల రిలే పసిడి పతకం సొంతం చేసుకున్న అమెరికా జట్టులో సభ్యురాలిగా ఉంది. డైమండ్ లీగ్ మీట్‌లో ఆమె నాలుగుసార్లు 100 మీటర్లలో, నాలుగుసార్లు 200 మీటర్లలో స్వర్ణ పతకాలను సాధించింది. 2019లో దోహా వేదికగా జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన టోరి బోవి 100 మీటర్ల విభాగంలో సెమీఫైనల్‌కు చేరినా ఆమె సెమీఫైనల్ రేసులో పోటీపడలేదు. ఈ మెగా ఈవెంట్‌లోనే ఆమె లాంగ్‌జంప్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఆమె మరో అంతర్జాతీయ ఈవెంట్‌లో పోటీపడలేదు.

ఐపీఎల్ టోర్నీ మిగతా మ్యాచ్‌లకు రాహుల్ దూరం!



న్యూఢిల్లీ: లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్ తొడ కండరాల గాయంతో... పేస్ బౌలర్ జైదేవ్ ఉనాద్కట్ భుజం గాయంతో ఈ ఐపీఎల్ సీజన్‌లోని మిగిలిన మ్యాచ్‌లకు దూరం కావడం ఖాయమైంది. బెంగళూరుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ రాహుల్ గాయపడ్డాడు. రాహుల్‌కు గురువారం ముంబైలో స్కానింగ్ చేసి గాయం తీవ్రతను పరిశీలిస్తారు. వచ్చే నెలలో లండన్‌లో ఆస్ట్రేలియాతో జరిగే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో తలపడే భారత జట్టులో రాహుల్, ఉనాద్కట్ సభ్యులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరి విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని బీసీసీఐ భావిస్తోంది.

ముంబై మెరుపులు

- 6 వికెట్లతో పంజాబ్‌పై విజయం
- చెలరేగిన ఇషాన్ కిషన్, సూర్య



సూర్య



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ ఇషాన్ కిషన్

మొహాలి: మూడు రోజుల క్రితం 213 పరుగుల లక్ష్యం...4 వికెట్లే కోల్పోయి 3 బంతులు మిగిలి ఉండగానే ఛేదన...ఇప్పుడు లక్ష్యం 215 పరుగులు...4 వికెట్లే కోల్పోయి 7 బంతులు ఉండగానే ఛేదన... ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ ముంబై ఇండియన్స్ మెల్లగా తమ స్థాయి ఏమిటో చూపిస్తోంది. మ్యాచ్ మ్యాచ్‌కూ మెరుపు ప్రదర్శనతో చెలరేగుతున్న ఆ జట్టు మరోసారి బ్యాటింగ్ బలంతో కీలక విజయాన్ని అందుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 6 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. లివింగ్‌స్టోన్ (42 బంతుల్లో 82 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), జితేశ్ శర్మ (27 బంతుల్లో 49 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు వేగంతో పరుగులు సాధించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 53 బంతుల్లోనే అభేద్యంగా 119 పరుగులు జోడించారు. అనంతరం ముంబై 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 216 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (41 బంతుల్లో 75; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (31 బంతుల్లో 66; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) మూడో వికెట్‌కు 55 బంతుల్లోనే 116 పరుగులు జత చేసి గెలుపులో కీలకపాత్ర పోషించారు.

మెరుపు భాగస్వామ్యం...

ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (9) విఫలం కాగా, మరో ఎండ్‌లో కెప్టెన్ శిఖర్ ధావన్ (20 బంతుల్లో 30; 5 ఫోర్లు) కొన్ని చక్కటి షాట్లు ఆడటంతో పవర్‌ప్లేలో పంజాబ్ స్కోరు 50 పరుగులకు చేరింది. శిఖర్, మాథ్యూ షార్ట్ (26 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్)లను తక్కువ వ్యవధిలో చావ్లా వెనక్కి పంపడంతో స్కోరు 11.2 ఓవర్లలో 95/3 వద్ద నిలిచింది. అయితే ఆ తర్వాత పంజాబ్ జోరు మొదలైంది. ఆర్చర్ ఓవర్లో జితేశ్ మూడు ఫోర్లతో దూకుడు మొదలు పెట్టగా, అర్షద్ ఓవర్లో లివింగ్‌స్టోన్ మూడు ఫోర్లు బాదాడు. ఈ క్రమంలో 32 బంతుల్లో లివింగ్‌స్టోన్ అర్ధసెంచరీ పూర్తయింది. అతని బ్యాటింగ్‌లో ఆర్చర్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్ హైలైట్‌గా నిలిచింది. ఈ ఓవర్ తొలి మూడు బంతుల్లో వరుసగా 6, 6, 6తో చెలరేగిన లివింగ్‌స్టోన్ ఆఖరి బంతికీ ఫోర్ కొట్టడంతో స్కోరు 200 దాటింది. ఈ ఓవర్లో మొత్తం 27 పరుగులు రావడం విశేషం.

రోహిత్ విఫలం...

తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ (0)ను డకౌట్ చేసి రిషి ధావన్ ముంబైని దెబ్బ తీశాడు. అయితే ఇషాన్, గ్రీన్ (18 బంతుల్లో 23; 4 ఫోర్లు) ధాటిగా ఆడి ఇన్నింగ్స్‌ను నడిపించారు. అర్ష్‌దీప్ ఓవర్లో 2 ఫోర్లు కొట్టిన ఇషాన్, రిషి ఓవర్లో రెండు సిక్సర్లు బాదాడు. గ్రీన్ వికెట్ కోల్పోయిన జట్టు పవర్‌ప్లే ముగిసేసరికి 54 పరుగులు చేసింది. ఈ దశలో ఇషాన్, సూర్యకుమార్ అద్భుత బ్యాటింగ్ ముంబైని గెలుపు దిశగా నడిపించింది. 29 బంతుల్లో ఇషాన్, 23 బంతుల్లో సూర్యకుమార్ హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నారు. కరన్ ఓవర్లో సూర్య వరుసగా 6, 6, 4, 4తో చెలరేగాడు. ఆ తర్వాత అర్ష్‌దీప్ ఓవర్లో ఇషాన్ వరుసగా సిక్స్, 2 ఫోర్లు బాదాడు. వీరిద్దరిని 8 పరుగుల వ్యవధిలో అవుట్ చేసి పంజాబ్ ఊపిరి పీల్చుకుంది. అయితే 23 బంతుల్లో 37 పరుగులు చేయాల్సిన ఈ స్థితిలో ముంబైకి ఎలాంటి ఇబ్బంది ఎదురు కాలేదు. తిలక్ వర్మ (10 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (10 బంతుల్లో 19 నాటౌట్; 3 ఫోర్లు) కలిసి జట్టును గెలిపించారు. అర్ష్‌దీప్ వేసిన 17వ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4, 6తో సత్తా చాటిన తిలక్...అర్ష్‌దీప్ తర్వాతి ఓవర్లోనే భారీ సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించడం విశేషం.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి) ఇషాన్ కిషన్ (బి) అర్షద్ 9; శిఖర్ ధావన్ (స్టంప్డ్) ఇషాన్ కిషన్ (బి) చావ్లా 30; షార్ట్ (బి) చావ్లా 27; లివింగ్‌స్టోన్ (నాటౌట్) 82; జితేశ్ (నాటౌట్) 49; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 214.** **వికెట్ల పతనం:** 1-13, 2-62, 3-95. **బౌలింగ్:** గ్రీన్ 2-0-15-0, అర్షద్ 4-0-48-1, ఆర్చర్ 4-0-56-0, చావ్లా 4-0-29-2, కార్తికేయ 3-0-24-0, ఆకాశ్ 3-0-37-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) షార్ట్ (బి) రిషి 0; ఇషాన్ (సి) రిషి (బి) అర్ష్‌దీప్ 75; గ్రీన్ (సి) చహర్ (బి) ఎలిస్ 23; సూర్యకుమార్ (సి) అర్ష్‌దీప్ (బి) ఎలిస్ 66; డేవిడ్ (నాటౌట్) 19; తిలక్ వర్మ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (18.5 ఓవర్లలో 4 వికెట్లకు) 216.** **వికెట్ల పతనం:** 1-0, 2-54, 3-170, 4-178. **బౌలింగ్:** రిషి ధావన్ 3-0-20-1, అర్ష్‌దీప్ 3.5-0-66-1, స్యామ్ కరన్ 3-0-41-0, ఎలిస్ 4-0-34-2, రాహుల్ చహర్ 3-0-30-0, హర్‌ప్రీత్ 2-0-21-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	9	6	3	0	12	0.532
లక్నో	10	5	4	1	11	0.639
చెన్నై	10	5	4	1	11	0.329
రాజస్తాన్	9	5	4	0	10	0.800
బెంగళూరు	9	5	4	0	10	-0.030
ముంబై	9	5	4	0	10	-0.373
పంజాబ్	10	5	5	0	10	-0.472
కోల్‌కతా	9	3	6	0	6	-0.147
హైదరాబాద్	8	3	5	0	6	-0.577
ఢిల్లీ	9	3	6	0	6	-0.768

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ x కోల్‌కతా (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



లక్నో, చెన్నై మ్యాచ్ వర్షార్పణం

ఫలితం రాకపోవడంతో రెండు జట్లకు చెరో పాయింట్



బదోని

లక్నో: ఐపీఎల్ 16వ సీజన్‌లో తొలిసారి మ్యాచ్ వర్షార్పణమైంది. లక్నో సూపర్ జెయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య బుధవారం జరిగిన మ్యాచ్‌కు అకాల వర్షం అంతరాయం కలిగించడంతో అర్ధంతరంగా ముగిసింది. మైదానం తడిగా ఉండటంతో 15 నిమిషాలు ఆలస్యంగా మొదలైన ఈ మ్యాచ్‌లో చెన్నై జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దాంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు 19.2 ఓవర్లలో 7 వికెట్లకు 125 పరుగులు సాధించింది. ఈ దశలో వర్షం రావడంతో ఆట నిలిచిపోయింది. వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో ఫలితం నిర్ణయించేందుకు చెన్నై ఇన్నింగ్స్‌ను కనీసం ఐదు ఓవర్ల పాటైనా నిర్వహించేందుకు సాధ్యపడలేదు. దాంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఫలితంగా రెండు జట్లకు చెరో పాయింట్ లభించింది. చెన్నై బౌలర్ల దెబ్బకు ఒకదశలో లక్నో 44 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే ఆయుశ్ బదోని (33 బంతుల్లో 59 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (31 బంతుల్లో 20) ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించి ఆదుకోవడంతో లక్నో జట్టు స్కోరు 100 పరుగులు దాటింది.

'సీల్డ్ కవర్‌లో అఫిడవిట్ ఇస్తాం'

- సుప్రీంకోర్టుకు మహిళా రెజ్లర్ల విజ్ఞప్తి
- ప్లేయర్లను కలిసిన పీటీ ఉష



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై తాము చేసిన లైంగిక ఆరోపణల విషయంలో మహిళా రెజ్లర్లు తమ వాదనలకు సంబంధించి కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే తాము ఈ సమాచారాన్ని గురువారం సీల్డ్ కవర్‌లో అందిస్తామని ఏడుగురు రెజ్లర్లు సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడిన బెంచీ దీనికి అంగీకరించింది. ఈ అఫిడవిట్ కాపీని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు కూడా అందించేందుకు తాము సిద్ధమని, అయితే దీనిని బహిరంగపర్చవద్దని రెజ్లర్ల తరఫు న్యాయవాది కోరారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉంది కాబట్టి విచారణాధికారికి మాత్రం దీనిని అందించవచ్చా అని మెహతా అడగ్గా... అభ్యంతరం లేదని బెంచీ సభ్యులు స్పష్టం చేశారు. గత శుక్రవారం బ్రిజ్‌భూషణ్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

హామీ ఏమీ లేదు!

భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష ఎట్టకేలకు రెజ్లర్లను కలిసింది. గత వారం రెజ్లర్ల నిరసన కారణంగా దేశం పరువు పోతోందంటూ వ్యాఖ్య చేసి విమర్శలపాలైన ఉష తాజా భేటీ ఆసక్తిని రేపింది. వారితో ఏం చర్చించిందనే అంశంపై పూర్తి స్పష్టత లేకున్నా... అధికారికంగా ఐఓఏ అధ్యక్షురాలి హోదాలో ఉష నుంచి రెజ్లర్లకు ఎలాంటి హామీ మాత్రం లభించలేదు. 'ఆలస్యంగానైనా ఉష ఇక్కడకు రావడాన్ని స్వాగతిస్తున్నాం. తాను గతంలో చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని, ఐఓఏ అధ్యక్షురాలికంటే ముందు తాను అథ్లెట్‌నని ఆమె చెప్పారు. మాకు న్యాయం కావాలని, రెజ్లింగ్ మేలు కోసమే ఇదంతా చేస్తున్నామని చెప్పాం. మా పరిస్థితి చూస్తే బాధేస్తుందంటూ సంఘీభావం తెలిపారు. అయితే తక్షణ పరిష్కారం గురించి మాత్రం ఆమె ఏమీ చెప్పలేదు' అని రెజ్లర్లు వెల్లడించారు. మరోవైపు ఉషపై ఒక మహిళ దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఉషపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెంపదెబ్బ కొట్టినట్లుగా ఒక వీడియో కనిపిస్తున్నా... దానిపై స్పష్టత లేదు.

మరోవైపు బుధవారం రాత్రి రెజ్లర్లు నిరసన చేస్తున్న జంతర్ మంతర్ వద్దకు ఢిల్లీ పోలీసులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. అక్కడి నుంచి రెజ్లర్లను తరలించడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, రెజ్లర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది.

సినిమా



"'అల్లరి'తో మొదలైన నా కెరీర్‌లో 'ఉగ్రం' 60వ చిత్రం. ఈ ప్రయాణంలో ఎత్తుపల్లాలు ఉన్నాయి. గెలుపు, ఓటములను ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలో నేర్చుకున్నాను. 60 సినిమాలు చేయడం అంత సులభం కాదు.. ప్రేక్షకుల ఆదరణ వల్లే ఇది సాధ్యపడింది. ఈ ప్రయాణంలో బాపుగారు, కె. విశ్వనాథ్‌గారు వంటి లెజెండరీ దర్శకులతో పాటు, వంశీగారు, కృష్ణవంశీగార్లతో పని చేసే చాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను" అని 'అల్లరి' నరేశ్ అన్నారు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్, మిర్నా మీనన్ జంటగా సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన చిత్రం 'ఉగ్రం'. ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'అల్లరి' నరేశ్ పంచుకున్న విశేషాలు.

మహర్షితో ఆ ధైర్యం వచ్చింది

- 'అల్లరి' నరేశ్

● మహేశ్‌బాబుగారి 'మహర్షి' సినిమాకి ముందు నేను చేసిన పాత్రలు వినోదాత్మకంగా ఉంటాయి. 'మహర్షి'లో నా పాత్ర సీరియస్‌గా, సింపతీగా ఉన్నా ప్రేక్షకులకు బాగా నచ్చింది. దాంతో ఇలాంటి పాత్రల్లోనూ ఆడియన్స్ ఆదరిస్తారనే ధైర్యం నాకు కలిగింది. రచయితలకు కూడా నమ్మకం కలగడంతో నా కోసం కామెడీ కాకుండా సీరియస్‌గా ఉండే కొత్త కథలు రాయడం మొదలు పెట్టారు. అలా వచ్చిన 'నాంది' హిట్ అయింది. ఇప్పుడు 'ఉగ్రం' తర్వాత మరిన్ని కొత్త కథలు నా కోసం రాస్తారనే నమ్మకం ఉంది. ● కామెడీ పాత్రలు చేయడం సులభం అనుకుంటారందరూ. కానీ చాలా కష్టం. కామెడీ చేసేవారు ఏ పాత్రయినా చేయగలరు. 'రంగమార్తాండ'లో బ్రహ్మానందంగారు, 'విడుదల' చిత్రంలో సూరి అద్భుతంగా చేశారు. 'ఉగ్రం విషయానికి వస్తే దర్శకుడు విజయ్ నా ప్లస్సుల కంటే మైనస్సులు ముందుగా నాకు చెప్పడంతో జాగ్రత్తలు తీసుకొని 'ఉగ్రం' చేశాను. మనల్ని దర్శకుడు నమ్మితే దాని ఫలితం వేరేలా ఉంటుంది. నన్ను క్రిష్‌గారు నమ్మడంతో 'గమ్యం', సముద్రఖనిగారు నమ్మడంతో 'శంభో శివ శంభో' వచ్చాయి. ఇప్పుడు విజయ్‌కి నాపై ఉన్న నమ్మకంతో 'నాంది, ఉగ్రం' వచ్చాయి. ● 'ఉగ్రం' ఐదేళ్ల టైమ్ లిమిట్‌లో జరుగుతుంది. ఎస్ఐ శిక్షణలో ఉన్నప్పుడు ఒక అమ్మాయిని ప్రేమించడం, ఆ తర్వాత పెళ్లి, ఒక కూతురు.. ఇలా మూడు వేరియేషన్స్‌లో ఉండే శివకుమార్ పాత్రలో కనిపిస్తాను. యాక్షన్ సీన్స్‌ని డూప్ లేకుండా చేశాను. ● మనకి సమస్య వస్తే పోలీస్ దగ్గరికి వెళ్తాం. అదే పోలీస్‌కి సమస్య వస్తే ఏం చేస్తాడు? ఎలా ట్రీట్ చేస్తాడనేది 'ఉగ్రం'లో ఉంటుంది. సస్పెన్స్, యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో స్క్రీన్ ప్లే చాలా ఆసక్తిగా ఉంటుంది. ● కామెడీ, సీరియస్.. ఏదీ సేఫ్ జోనర్ కాదు. 'సుడిగాడు, బెండు అప్పారావు, కితకితలు' వంటి హిట్ సినిమాలు చూసినప్పుడు 'నరేశ్ సినిమా బావుంది అన్నారు కానీ నరేశ్ కామెడీ బాగా చేశాడనలేదు'. కానీ 'గమ్యం, శంభో శివ శంభో, మహర్షి' చూశాక 'నరేశ్ బాగా నటించాడు' అన్నారు. కామెడీ చేసేవాళ్లంటే ఇండస్ట్రీలో, ఆడియన్స్‌లో ఎక్కడో చిన్న చూపు ఉంది. ఈ విషయంలో నాకెక్కడో చిన్న గిల్ట్ ఫీలింగ్ ఉంది. ● 'వివాదాల జోలికి వెళ్లొద్దు, ఎవరి గురించి చెడుగా మాట్లాడొద్దు' అని మా నాన్న ఈవీవీ సత్యనారాయణగారు చెప్పారు. నాన్నగారు చెప్పినట్లు నాకు పని తప్ప మరో ఆలోచన లేదు. ఈవీవీగారి బ్యానర్‌లో నాన్నగారి మార్క్ సినిమాలు చేయాలి. సరైన కథ కుదిరితే నిర్మిస్తాను. నా సోదరుడు ఆర్యన్ రాజేశ్ తనని తాను నిరూపించుకునేందుకు సరైన కథ కోసం ఎదురు చూస్తున్నాడు. నాకు దర్శకత్వం ఆలోచన ఉంది కానీ అందుకు టైమ్ పడుతుంది.. అయితే నేను దర్శకత్వం వహించే మూవీలో నేను నటించను. ● నా సినిమాల్లో 'సుడిగాడు'కి సీక్వెల్ తీయొచ్చు. ఆ మూవీకి పని చేసిన అనిల్ రావిపూడి మొన్న కలసినప్పుడు 'సుడిగాడు 2' చేద్దామా? అన్నాడు. 'నేను రూటు మార్చితే మళ్లీ కామెడీవైపు తీసుకెళ్తారా?' అని సరదాగా అన్నాను. నాన్నగారి చివరి రోజుల్లో 'అలీబాబా అరడజను దొంగలు' మూవీకి సీక్వెల్‌గా 'అలీబాబా డజను దొంగలు' సినిమా చేద్దామనుకున్నాం.. కానీ, కుదరలేదు. ప్రస్తుతం నేను, ఫరియా అబ్దుల్లా ఒక సినిమా చేస్తున్నాం. సుబ్బుగారి దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నాను. 'జెండా' అనే కథని కొన్నాను.. నేనే నిర్మిస్తా. అలాగే విజయ్‌తో మరో సినిమా ఉంటుంది.

ఇక షురూ



● విజయ్ దేవరకొండ, శ్రీలీల

కొత్త సినిమాకు శ్రీకారం చుట్టారు విజయ్ దేవరకొండ. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కుతున్న సినిమా బుధవారం ఆరంభమైంది. నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) స్క్రిప్ట్‌ను చిత్ర యూనిట్‌కు అందజేశారు. ప్రగతి ప్రింటర్స్ ఎండీ పరుచూరి మహేంద్ర కెమెరా స్విచ్చాన్ చేయగా, హానరరీ జనరల్ కాన్సిల్ ఆఫ్ సౌత్ కొరియా చుక్కపల్లి సురేశ్ క్లాప్ ఇచ్చారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ జూన్‌లో ఆరంభం కానుంది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: గిరీష్ గంగాధరన్.

నేను హీరో కాదు.. విలన్ కాదు



● జగపతిబాబు

"గతంలో నేను చేసిన 'శివ రామరాజు' చిత్రం అన్నదమ్ముల కథే. ఆ సినిమా చూశాక విడిపోయిన 24 కుటుంబాలు మళ్లీ కలిశాయి. 'రామబాణం' కూడా చాలా మంచి ఉద్దేశంతో చేసిన సినిమా" అని నటుడు జగపతిబాబు అన్నారు. గోపీచంద్, డింపుల్ హయతి జంటగా శ్రీవాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాత. ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ మూవీలో కీలక పాత్ర చేసిన జగపతిబాబు విలేకరులతో చెప్పిన విశేషాలు.

● ఇండస్ట్రీలో ఇప్పుడు హారర్, యాక్షన్, థ్రిల్లర్ సినిమాలు ఎక్కువగా వస్తున్నాయి... సెంటిమెంట్ తగ్గింది. నెగిటివిటీ పెరిగింది. సినిమా ఎంత క్రూరంగా ఉంటే అంత బావుంటోంది.. అందుకే నేను సక్సెస్ అయ్యాను (నవ్వుతూ). అయితే అంత నెగిటివిటీలోనూ పాజిటివిటీ ఉందని చెప్పడానికి 'రామబాణం' వస్తోంది. ● సెకండ్ ఇన్నింగ్స్‌లో నేనిప్పటి వరకూ 70కిపైగా పాత్రలు చేశా. అయితే చెప్పుకోడానికి ఏడెనిమిది సినిమాలే ఉన్నాయి. కొందరు నన్ను సరిగ్గా వాడుకోలేదు. కానీ 'రామబాణం' విషయంలో అలా కాదు. ఈ చిత్రాన్ని బలంగా మలిచాడు శ్రీవాస్. ఇందులో ఆర్గానిక్ ఫుడ్ ప్రాధాన్యతని చక్కగా చూపించాం. ● నేను హీరో కాదు.. విలన్ కాదు.. యాక్టర్‌ని. అందులోనూ డైరెక్టర్స్ యాక్టర్‌ని. మన నుంచి వాళ్లు ఏం రాబట్టుకోవాలనుకుంటున్నారో వారి కళ్లు చూస్తే అర్థమౌతుంది. నాకు ఎప్పుడైనా కథే ముఖ్యం. కాంబినేషన్ కాదు. పాత్ర నచ్చకపోతే కుదరదని చెబుతున్నాను. ● సెకండ్ ఇన్నింగ్స్‌తో నా జీవితమే మారిపోయింది. హీరో అనేది పెద్ద బాధ్యత.. ఒత్తిడి ఉంటుంది. కానీ, ఇప్పుడు ఆ ఒత్తిడి లేకపోవడంతో నటనపైనే దృష్టి పెడుతున్నాను. ● చిన్న సినిమా అనేది ఉండదు. హిట్ అయితే అదే పెద్ద సినిమా అవుతుంది. నాకు డబ్బు ముఖ్యం కాదు.. పాత్ర, సినిమా ముఖ్యం. సల్మాన్ ఖాన్‌తో చేసిన 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' తర్వాత బాలీవుడ్ నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి. గాడ్ ఫాదర్ లాంటి పాత్ర చేయాలని ఉంది. అలాగే 'గాయం'కి మరో స్థాయిలో ఉండే పాత్ర చేయాలనే ఆసక్తి ఉంది. ప్రస్తుతం నేను చేస్తున్న నాలుగైదు సినిమాలు పెద్ద బ్యానర్స్‌లోనివే.

కస్టడీ నాకు స్పెషల్ ఫిల్మ్

- నాగ చైతన్య



● పవన్ కుమార్, శ్రీనివాసా, నాగచైతన్య, కృతి, వెంకట్ ప్రభు

"ఎప్పటికప్పుడు ట్రెండ్ మారుతోంది. మూసధోరణి సినిమాలను ప్రేక్షకులు రిజెక్ట్ చేస్తున్నారు. అందుకే నా ప్రతి సినిమాకు కొత్త వేరియేషన్ చూపించాలనుకుంటున్నా. ఇందులో భాగంగానే 'కస్టడీ' సినిమా చేశాను. గతంలో నేను తమిళ దర్శకులతో చేసిన సినిమాలను తెలుగులో మాత్రమే తీశాం. కానీ 'కస్టడీ' సినిమాలోని ప్రతి సీన్‌ని తెలుగు, తమిళ భాషల్లో తీశాం. నా తొలి తమిళ చిత్రం 'కస్టడీ'. అందుకే ఇది నాకు స్పెషల్ ఫిల్మ్. ఈ సినిమా నాకో టర్నింగ్ పాయింట్ అవుతుందని ఆశిస్తున్నాను" అన్నారు నాగచైతన్య. వెంకట్‌ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీశెట్టి జంటగా నటించిన చిత్రం 'కస్టడీ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన 'కస్టడీ' సినిమా ప్రెస్‌మీట్‌లో నాగచైతన్య మాట్లాడుతూ– "ఓ సింపుల్ కానిస్టేబుల్ చేతిలో ఉన్న ఓ పవర్‌ఫుల్ నిజం కోసం అతను ఎంత దూరమైనా వెళ్తాడు.. అంటూ వెంకట్‌ప్రభుగారు చెప్పిన స్టోరీ లైన్ నాకు బాగా నచ్చి 'కస్టడీ' ఒప్పుకున్నాను. వెంకట్‌ప్రభుగారి ట్రేడ్ మార్క్ స్క్రీన్ ప్లే తెలుగు ప్రేక్షకులకు కొత్తగా ఉంటుందని నమ్ముతున్నాను. అలాగే ఆయన 'కస్టడీ' స్టోరీ సింపుల్‌గా ఉంటుందని చెబుతున్నారు కానీ మా సినిమాలో చాలా లేయర్స్ ఉన్నాయి. అలాగే నా సినిమాకు ఇళయరాజా, యువన్‌శంకర్‌గార్లు మ్యూజిక్ ఇవ్వడం అనేది నా కల నిజమైనట్లు ఉంది" అని అన్నారు. "సాధారణంగా సినిమాల్లో విలన్‌ని హీరో, హీరోని విలన్ చంపాలనుకుంటారు. కానీ విలన్ చనిపోకుండా హీరో కాపాడడమే 'కస్టడీ' స్టోరీ లైన్. తెలుగులో నా తొలి చిత్రం 'కస్టడీ'. నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్ ఫిల్మ్ ఇది. కథను, నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన చైతూ, నిర్మాతలకు ధన్యవాదాలు" అన్నారు వెంకట్ ప్రభు. "ఈ సినిమా కథ విన్నప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. ఆడియన్స్ కూడా ఇదే ఫీలవుతారని ఆశిస్తున్నాను" అన్నారు కృతీశెట్టి. "'కస్టడీ' బిజినెస్ పట్ల హ్యాపీగా ఉన్నాం. ప్రేక్షకుల స్పందనను బట్టి కన్నడ, హిందీ భాషల్లో కూడా విడుదల చేస్తాం" అన్నారు శ్రీనివాసా చిట్టూరి.

> అభిమానులకు మంచి సక్సెస్ ఇవ్వాలనే అనుకుంటాం. వారి అభిమానం, ప్రేమలకు మేం తిరిగి ఇచ్చేది ఒక మంచి సినిమాయే. రీసెంట్‌గా మా నుంచి వచ్చిన కొన్ని సినిమాలకు మంచి రిజల్ట్ రాలేదు. యాక్టర్స్ కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజం. ఈ టైమ్ (బ్యాడ్ ఫేస్ అని పరోక్షంగా చెబుతూ..) వెళ్లిపోతుంది. తప్పకుండా మేం తిరిగి పుంజుకుంటాం. ఫ్యాన్స్ ఆశించే ఫలితం 'కస్టడీ' నుంచి రాబోతుందని నమ్ముతున్నాను. నాన్నగారి 'శివ' సినిమా అంటే అందరి ఆడియన్స్‌లానే నాకు చాలా గౌరవం. కస్టడీలో నా క్యారెక్టర్ పేరు శివ అయినప్పటికీ 'శివ' సినిమా మీద ఉన్న గౌరవంతో మా సినిమాకు ఆ టైటిల్ పెట్టలేదు.
> - నాగచైతన్య

పెళ్లికి తేదీ కుదిరింది



● పవిత్ర, నరేశ్

వీకే నరేశ్, పవిత్రా లోకేష్‌ల 'మళ్లీ పెళ్లి'కి థియేటర్స్‌లో ముహూర్తం కుదిరింది. నరేశ్, పవిత్ర, వనితా విజయ్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మళ్లీ పెళ్లి'. ఎమ్ఎస్ రాజు దర్శకత్వంలో విజయకృష్ణ మూవీస్‌పై వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 26న విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది చిత్ర యూనిట్. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: అరుల్ దేవ్, కెమెరా: ఎమ్ఎన్ బాల్ రెడ్డి.

నటుడు-దర్శక-నిర్మాత మనోబాల కన్నుమూత



ప్రముఖ తమిళ నటుడు, దర్శక-నిర్మాత మనోబాల (69) బుధవారం చెన్నైలో కన్నుమూశారు. దర్శకుడు భారతీరాజా వద్ద సహాయ దర్శకుడిగా కెరీర్ ఆరంభించారు మనోబాల. మరోవైపు నటుడిగానూ కొనసాగారు. 'ఆగాయ గంగై' (1982) చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అయ్యారు. ఆ తర్వాత మనోబాల దర్శకత్వం వహించిన చిత్రాల్లో రజనీకాంత్ హీరోగా ఘన విజయం సాధించిన 'ఊర్ కావలన్' ఒకటి. ఇంకా విజయకాంత్, ప్రభు, కార్తీక్ తదితర హీరోలతో మనోబాల దాదాపు 25 చిత్రాలకు దర్శకత్వం వహించారు. కన్నడంలో 'డిసెంబర్ 31', అలాగే తన దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'ఎన్ పురుషన్‌దాన్ ఎనక్కు మట్టుమ్‌దాన్'ని హిందీలో 'మేరా పతి సిర్ఫ్ మేరా హై'గా రీమేక్ చేశారు. మూడు చిత్రాలు నిర్మించారు. 200లకు పైగా చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా చేశారు. తెలుగులో మనోబాల నటించిన చిత్రాల్లో 'కథానాయకుడు', 'గగనం', 'మహానటి', 'దేవదాస్', గత సంక్రాంతికి విడుదలైన 'వాల్తేరు వీరయ్య' ఉన్నాయి. ఇక చెన్నైలోని సాలిగ్రామంలో నివసిస్తున్న మనోబాల ఇటీవల అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరి, ఆరోగ్యంగా ఇంటికి తిరిగొచ్చారు. అకస్మాత్తుగా బుధవారం ఉదయం ఇంటి వద్దే కన్ను మూశారు. మనోబాలకు భార్య, ఓ కొడుకు ఉన్నారు. ఆయన మృతికి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, నటులు కమల్‌హాసన్, రజనీకాంత్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కాగా మనోబాల భౌతిక కాయానికి గురువారం చెన్నైలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	161	61,193
నిఫ్టీ ▼	58	18,090

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,144	▲	63
డోజోన్స్	33,735	▲	50
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,788	▲	15
డాక్స్	15,815	▲	88
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,323	▲	37
నికాయ్ (మంగళవారం ముగింపు)	29,158	▲	35

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై			
బంగారం (99.9 గ్రాములు)	61,044	▲	627
బంగారం (99.5 గ్రాములు)	60,800	▲	624
వెండి (కిలో)	75,282	▲	1,056

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

ఫెడ్ 0.25% వడ్డీ పెంపు

5 శాతం దాటిన ఫండ్స్ రేట్లు



న్యూయార్క్: రెండు రోజుల సమీక్ష తదుపరి యూఎస్ ఫెడరల్ రిజర్వ్ మరోసారి 0.25 శాతం వడ్డీ రేటును పెంచింది. దీంతో తాజాగా ఫెడ్ ఫండ్స్ రేట్లు 5–5.25 శాతానికి చేరాయి. 2022 మార్చి నుంచి నిరంతరంగా రేట్ల పెంపును చేపడుతున్న ఫెడ్ ఏడాది కాలంలోనే యూఎస్ వడ్డీ రేట్లను 0 నుంచి 5 శాతానికి చేర్చింది! ఈ బాటలో గత సమీక్షలోనూ వేగాన్ని తగ్గించి పావు శాతం రేట్ల పెంపును చేపట్టింది. ఇందుకు ధరల అదుపు ప్రధాన పాత్ర పోషించింది. అయితే ఫెడ్ ద్రవ్యోల్బణ లక్ష్యం 2 శాతంకాగా.. 2023 మార్చికల్లా 5 శాతంగా నమోదైంది. దీంతో ఫెడ్ మరోసారి రేట్ల పెంపునకే కట్టుబడింది. కాగా.. ఇటీవల సిలికాన్ వ్యాలీ, ఫస్ట్ రిపబ్లిక్ తదితర బ్యాంకుల దివాలాతో తలెత్తిన బ్యాంకింగ్ సంక్షోభం, మార్చిలో రెండేళ్ల కనిష్టానికి చేరిన ఉపాధి కల్పన, 2020 డిసెంబర్ తదుపరి అత్యధికంగా 1.8 మిలియన్ ఉద్యోగాల కోత వంటి అంశాలు ఫెడ్ వడ్డీ రేట్ల పెంపునకు చెక్ పెడుతున్నాయి. దీంతో ఫెడ్ ఇకపై రేట్ల పెంపును నిలిపివేయడం లేదా తగ్గించే వీలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏడాదికో ఎయిర్‌లైన్స్ కనుమరుగు

- చతికిలపడుతున్న విమానయాన సంస్థలు
- 1994 నుంచి ఇప్పటి వరకు 27 మూత
- కింగ్ ఫిషర్, జెట్, గో ఫస్ట్ కీలకం



న్యూఢిల్లీ/ముంబై: దేశ విమానయాన రంగం ఎయిర్‌లైన్స్ సంస్థలకు కలిసిరావడం లేదు. దీనికి నిదర్శనంగా గడిచిన మూడు దశాబ్దాల కాలంలో 27 సంస్థలు కనుమరుగయ్యాయి. 1994లో మొదటిసారి దేశంలో ప్రైవేటు విమానయాన సంస్థలు (ఎయిర్‌లైన్స్ కంపెనీలు) కార్యకలాపాల నిర్వహణకు అనుమతించారు. ఆ తర్వాత రెండేళ్లకు అంటే 1996లో తొలి వికెట్ పడింది. ఈస్ట్ వెస్ట్ ట్రావెల్స్ అండ్ ట్రేడ్ లింక్ 1996 నవంబర్‌లో కార్యకలాపాలను (ఆరంభించిన రెండేళ్లకు) మూసివేసింది. అదే ఏడాది మోడిలుఫ్ట్ కార్యకలాపాలు కూడా నిలిచిపోయాయి. ఇలా మొత్తం మీద 27 సంస్థలు (సగటున ఏడాదికొకటి) వ్యాపార కార్యకలాపాలను మూసివేయడం, దివాలా తీయడం లేదా ఇతర సంస్థల్లో విలీనం కావడం, కొనుగోళ్లతో కనుమరుగు కావడం చోటు చేసుకుంది. కరోనా రాక ముందు 2019లోనూ జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. దివాలా పరిష్కారంలో భాగంగా ఓ కన్సార్షియం జెట్ ఎయిర్‌వేస్‌ను సొంతం చేసుకున్నప్పటికీ కార్యకలాపాలు ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది. అదే ఏడాది జెట్‌లైట్ (సహారా ఎయిర్‌లైన్స్) కూడా మూతపడింది. జూమ్ ఎయిర్ పేరుతో కార్యకలాపాలు నిర్వహించే జెక్సస్ ఎయిర్ సర్వీసెస్, డెక్కన్ చార్టర్డ్ ప్రైవేటు లిమిటెడ్, ఎయిర్ ఒడిశా ఏవియేషన్ 2020లో మూసివేయగా, 2022లో హెరిటేజ్ ఏవియేషన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి.

17 ఏళ్లకు గో ఫస్ట్

2020లో కరోనా మహమ్మారి కారణంగా ఎయిర్‌లైన్స్ కంపెనీలు తమ కార్యకలాపాలను కొన్ని నెలల పాటు నిలిపివేయాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా పాక్షిక సర్వీసులకే పరిమితమయ్యాయి. దీని కారణంగా ఎయిర్‌లైన్స్ సంస్థలకు నష్టాలు పెరిగాయి. ఆ తర్వాత డిమాండ్ అనూహ్యంగా పుంజుకున్నప్పటికీ, గో ఫస్ట్ సంస్థకు చెందిన సగం విమానాలు ప్రాట్ అండ్ విట్నీ ఇంజన్లలో సమస్యలతో పార్కింగ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. దీంతో సగం సర్వీసులనే నడుపుతూ చివరికి కార్యకలాపాలు మొదలు పెట్టిన 17 ఏళ్ల తర్వాత గో ఫస్ట్ దివాలా పిటిషన్ దాఖలు చేసింది. జెట్ ఎయిర్‌వేస్ తర్వాత దివాలా పరిష్కారం కోసం ఎన్‌సీఎల్‌టీకి ముందుకు వెళ్లిన రెండో సంస్థ ఇది.

2012లో కింగ్‌ఫిషర్

ప్రముఖ సంస్థగా పేరొంది, పెద్ద ఎత్తున విమానయాన కార్యకలాపాలు నిర్వహించిన కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్ మూతపడడం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 50 విమానాలతో వందలాది సర్వీసులు నిర్వహిస్తూ, ఎంతో మందికి ఉపాధి కల్పించిన ఈ సంస్థ 2012లో మూతపడడంతో బ్యాంకులకు రూ.9,000 కోట్లకు పైగా నష్టం ఏర్పడింది.

డిమాండ్‌కు తక్కువేమీ లేదు

ఒకవైపు భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్‌గా గుర్తింపు తెచ్చుకుంటుంటే, మరోవైపు ఒక్కో ఎయిర్‌లైన్ సంస్థ మూతపడుతుండడం సంక్లిష్టతలకు అద్దం పడుతోంది. కానీ, ఎయిర్‌లైన్స్ సేవలకు ఏటేటా డిమాండ్ పెరుగుతూనే ఉంది. 2023 మొదటి మూడు నెలల్లో దేశీ ఎయిర్‌లైన్స్ సంస్థలు 3.75 కోట్ల మంది ప్రయాణికులను చేరవేశాయి. అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 52% అధికం.

గుత్తాధిపత్యానికి బాటలు..

ప్రభుత్వరంగంలోని ఎయిర్ ఇండియాను టాటాలు గతేడాది జనవరిలో కొనుగోలు చేయడం తెలిసిందే. దీంతో ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో అలయన్స్ ఎయిర్ ఒక్కటే ఉంది. దీని సేవలు నామమాత్రమే. ఇక ప్రధానంగా సేవలు అందించే సంస్థలుగా ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్, విస్తారా, ఏయిరేషియా, ఆకాశ ఎయిర్ ఉన్నాయి. ఇందులో ఆకాశ ఎయిర్ రాకేశ్ జున్‌జున్‌వాలా ఆరంభించినది. ఇది చాలా తక్కువ సర్వీసులకే పరిమితమైంది. ఎయిర్ ఏషియా, విస్తారా టాటాల జాయింట్ వెంచర్‌లు, వీటిని ఎయిర్ ఇండియాలో విలీనం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అదే జరిగితే అప్పుడు ప్రధానంగా సేవలు అందించేవి ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్ అని చెప్పుకోవచ్చు. స్పైస్‌జెట్ కూడా తీవ్ర ఆర్థిక సమస్యల్లో ఉంది. భారీ నష్టాలతో, రుణ భారంతో నడుస్తోంది. ఒకవేళ ఇది కూడా మూతపడితే అప్పుడు ఎయిర్ ఇండియా, ఇండిగోతో దేశ ఎయిర్‌లైన్స్ మార్కెట్ మోనోపలీగా మారిపోతుందన్న ఆందోళన వినిపిస్తోంది. అంతేకాదు, సేవలపైనా దీని ప్రభావం పడుతుందని అంటున్నారు.

కోల్ ఇండియా చీఫ్‌గా పీఎం ప్రసాద్!

పీఈఎస్‌బీ సిఫారసు



రాంచీ: కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బాధ్యతలకు తెలుగు వ్యక్తి పోలవరపు మల్లికార్జున ప్రసాద్ ఎంపికయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థల ఎంపిక వ్యవహారాల బోర్డ్ (పీఈఎస్‌బీ) ఏడుగురు అధికారులను ఇంటర్వ్యూ చేసి పీఎం ప్రసాద్ పేరును సిఫారసు చేసింది. ఎఫ్ఎస్ఐబీ సిఫారసుకు ప్రధాని అధ్యక్షతన గల కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. ప్రసాద్ ప్రస్తుతం రాంచీ కేంద్రంగా పనిచేస్తున్న కోల్ ఇండియా అనుబంధ సంస్థ సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (సీసీఎల్) సీఎండీగా పనిచేస్తున్నారు. 2019లో ఆయన భారత్ కోకింగ్ కోల్ (బీసీసీఎల్) సీఎండీగా కూడా ఎంపికయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బీఈ మైనింగ్‌లో గ్రాడ్యుయేటింగ్ తదుపరి 1984లో ఆయన సీఐఎల్‌లో తన కెరీర్‌ను ప్రారంభించారు. అటు తర్వాత అంచెలంచెలుగా విభిన్న హోదాల్లో పనిచేస్తూ, కోల్ ఫీల్డ్స్‌లోని వివిధ రంగాల్లో అపార అనుభవాన్ని గడించారు.

భారత్ 'సేవలు' పటిష్టం

- ఏప్రిల్‌లో 13 ఏళ్ల గరిష్ట స్థాయి
- 62కు ఎస్అండ్‌పీ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం ఏప్రిల్‌లో గణనీయమైన ఫలితాన్ని నమోదుచేసుకుంది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 13 నెలల గరిష్ట స్థాయిలో 62కు ఎగసింది. మార్చిలో సూచీ 57.8 వద్ద ఉంది. కొత్త వ్యాపారాల్లో వృద్ధి, మార్కెట్ పరిస్థితుల సానుకూల వంటి అంశాలు ఈ పటిష్ట ఫలితానికి కారణమని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. నిజానికి ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల సూచీ గడచిన 21 నెలల్లో వృద్ధి శ్రేణిలోనే ఉంది. భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో సేవల రంగం మెజారిటీ వాటాను కలిగిఉన్న సంగతి తెలిసిందే. కాగా, ఇంకా ఉపాధి అవకాశాలు ఈ రంగంలో భారీగా పుంజుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకు సంబంధించిన సర్వే పేర్కొంది.

ఇదిలావుండగా, తయారీ, సేవల రంగం రెండూ కలిపిన ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ కూడా ఏప్రిల్‌లో 61.6గా నమోదయ్యింది. మార్చిలో సూచీ 58.4 వద్ద ఉంది.

వచ్చే నెలలో హోండా 'ఎలివేట్'

న్యూఢిల్లీ: హోండా కార్స్ ఇండియా కొత్త ఎస్‌యూవీ పేరును 'ఎలివేట్'గా ప్రకటించింది. దీన్ని వచ్చే నెలలో భారత్‌లో ఆవిష్కరించనున్నట్లు వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్ల కోసం రూపొందించిన ఈ మోడల్‌ను ముందుగా భారత్‌లోనే లాంచ్ చేస్తున్నట్లు పేర్కొంది.



హోండా ప్రస్తుతం దేశీయంగా సిటీ, అమేజ్ పేరిట రెండు మోడల్స్‌ను మాత్రమే విక్రయిస్తోంది. భారీగా వృద్ధి చెందుతున్న ఎస్‌యూవీ విభాగంలో ఎలివేట్‌తో రీ–ఎంట్రీ ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవాలని కంపెనీ భావిస్తోంది. ప్యాసింజర్ వాహనాల విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా 47% దాకా ఉంది.

ఫెడ్ ప్రకటనకు ముందు అప్రమత్తత

- సూచీల వరుస ర్యాలీకి బ్రేక్
- సెన్సెక్స్ నష్టం 161 పాయింట్లు
- 18,100 దిగువకు నిఫ్టీ



ముంబై: అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య పరపతి విధాన వైఖరి ప్రకటనకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో స్టాక్ సూచీల వరుస ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ షేర్ల బలహీన ట్రేడింగ్ సైతం ఒత్తిడిని పెంచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందడంతో ఉదయం సెన్సెక్స్ 80 పాయింట్ల పతనంతో 61,275 వద్ద, నిఫ్టీ 34 పాయింట్లు నష్టపోయి 18,114 వద్ద మొదలయ్యాయి. ఇటీవల వరుస ర్యాలీ క్రమంలో బ్యాంకింగ్, మెటల్, ఐటీ షేర్లు భారీ ఎత్తున లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఒక దశలో సెన్సెక్స్ 330 పాయింట్లు క్షీణించి 61,024 వద్ద, నిఫ్టీ 106 పాయింట్లు పతనమైన 18,042 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఆఖర్లో కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో కొంతమేర నష్టాలు తగ్గాయి. ఫలితంగా సెన్సెక్స్ 161 పాయింట్లు నష్టపోయి 61,193 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 58 పాయింట్లు పతనమై 18,100 స్థాయి దిగువన 18,090 వద్ద నిలిచింది. దీంతో సెన్సెక్స్ ఎనిమిది రోజులు, నిఫ్టీ ఆరు రోజుల వరుస ర్యాలీకి అడ్డుకట్ట పడినట్లైంది. ఎఫ్ఎంసీజీ, మీడియా, రియల్టీ షేర్లు రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,338 కోట్ల షేర్లను కొనుగోలు చేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.584 కోట్ల షేర్లను అమ్మేశారు. సెన్సెక్స్ 161 పాయింట్ల పతనంతో బీఎస్ఈలో రూ.1.63 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. ఆసియా మార్కెట్లు 0.50% నుంచి ఒకటిన్నర శాతం దాకా నష్టపోయాయి.

భవిత
పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్-2023

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఐదు ప్రాంతీయ విద్యా సంస్థ(ఆర్ఐఈ)ల్లో వివిధ ఉపాధ్యాయ విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎన్‌సీఈఆర్‌టీ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్–2023 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది.

» **రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ఐఈ):** అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్, షిల్లాంగ్.

ఆర్ఐఈ క్యాంపస్ వివరాలు

» బీఎస్సీ బీఈడీ(నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు)–భువనేశ్వర్, మైసూరు.
» బీఏ బీఈడీ(నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్)–భువనేశ్వర్, మైసూరు.
» ఎంఎస్సీఈడీ(ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్)–మైసూరు.
» బీఎడ్(రెండేళ్లు)–అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్, షిల్లాంగ్.
» బీఈడీ–ఎంఈడీ(మూడేళ్లు)–భోపాల్.
» ఎంఈడీ(రెండేళ్లు)–అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్.
» **అర్హత:** హయ్యర్ సెకండరీ/+2/సీనియర్ సెకండరీ, డిగ్రీ, పీజీ, బీఈడీ.
» **ఎంపిక విధానం:** ప్రవేశపరీక్ష, కౌన్సెలింగ్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తు తేదీలు:** 25.04.2023 నుంచి 06.06.2023 వరకు.
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** 25.06.2023 నుంచి రూ.02.07.2023 వరకు.
» **ప్రవేశ పరీక్ష తేది:** 02.07.2023.
» **వెబ్‌సైట్:** www.cee.ncert.gov.in

తెలంగాణ గురుకులాల్లో 4,006 టీజీటీ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం,మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమం, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల్లో రెగ్యులర్ ప్రాతిపదికన ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 4,006.
» **సబ్జెక్టులు:** తెలుగు, సంస్కృతం, ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్, గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్.
» **సొసైటీ వారీగా ఖాళీలు:** టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్–728, టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ –218, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్–2379, టీఎంఆర్ఈఐఎస్–594, టీఆర్ఈఐఎస్–87.
» **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈడీ, టీపీటీ, హెచ్‌పీటీతోపాటు టెట్/సీటెట్ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** రూ.42,300 నుంచి రూ.1,15,270.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష (పేపర్–1,2,3), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.04.2023 నుంచి 27.05.2023.
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

సీటెట్ జూలై- 2023

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ).. కేంద్రీయ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(సీటెట్)కు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఉపాధ్యాయ వృత్తిని కెరీర్‌గా ఎంచుకునే వారి కోసం సీబీఎస్ఈ ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తోంది. సీటెట్ స్కోర్‌ను కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

» సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) జూలై–2023
» **అర్హత:** బీఈడీ, డీఎడ్ ఉత్తీర్ణత ఉండాలి.
» **పరీక్ష విధానం:** పేపర్–1, పేపర్–2. పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో ఉంటుంది. పేపర్–1 ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ బోధించే వారి కోసం; పేపర్–2 ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించే వారి కోసం నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 26.05.2023
» **పరీక్ష తేదీ:** జూలై–ఆగస్టు, 2023 మధ్యలో ఉంటుంది.
» **వెబ్‌సైట్:** https://ctet.nic.in

సంగారెడ్డి జిల్లాలో వివిధ ఉద్యోగాలు

సంగారెడ్డిలోని మహిళలు,పిల్లలు,దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ.. ఒప్పంద ప్రాతిపదికన డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌లో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
» **పోస్టుల వివరాలు:** జిల్లా మిషన్ కోఆర్డినేటర్–01, జెండర్ స్పెషలిస్ట్–02, ఫైనాన్స్ లిటరసీ స్పెషలిస్ట్–01, మల్టీ–పర్పస్ స్టాఫ్–01.
» **వయసు:** 01.07.2023 నాటికి 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా సంక్షేమ అధికారి, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, కలెక్టరేట్, సంగారెడ్డి చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.05.2023.
» **వెబ్‌సైట్:** www.sangareddy.telangana.gov.in

ఐఐఎస్ఈఆర్‌ల్లో.. ఇంటిగ్రేటెడ్ బీఎస్+ఎంఎస్

» ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2023 నోటిఫికేషన్ విడుదల
» ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌ల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభం
» అయిదేళ్ల బీఎస్+ఎంఎస్, నాలుగేళ్ల బీఎస్ కోర్సులు
» ఏడు క్యాంపస్‌ల్లో దాదాపు రెండు వేల సీట్లు



ఐసర్ అప్టిట్యూడ్ టెస్ట్ 2023

దేశంలో పేరున్న విద్యాసంస్థలు.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్) క్యాంపస్‌లు! ఇంటర్ తర్వాత సైన్స్‌లో పరిశోధనల దిశగా అడుగులు వేయాలనుకునే విద్యార్థులకు ఇవి చక్కటి వేదికలు!! యువత భావి శాస్త్రవేత్తలుగా రాణించేలా బాటలు వేస్తున్న ఐఐఎస్ఈఆర్‌లు.. అయిదేళ్ల బీఎస్+ఎంఎస్, నాలుగేళ్ల బీఎస్ (ఇంజనీరింగ్/ఎకనామిక్ సైన్స్) కోర్సులను అందిస్తున్నాయి. 2023-24కు సంబంధించి ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌ల్లో ప్రవేశానికి ప్రకటన విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు, అందిస్తున్న కోర్సుల ప్రత్యేకత, ప్రవేశ విధానం తదితర వివరాలు...

ఏడు క్యాంపస్‌లు-1808 సీట్లు

ప్రస్తుతం దేశంలో ఏడు చోట్ల ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో.. అయిదేళ్ల బీఎస్+ఎంఎస్ కోర్సులో 1777 సీట్లు ఉన్నాయి. క్యాంపస్ వారీగా సీట్ల వివరాలు.. ఐఐఎస్ఈఆర్–భోపాల్ 240, బరంపూర్ 170, కోల్‌కత 250, మొహాలీ 250, పుణె 288, తిరువనంతపురం 320, తిరుపతి 200. వీటితోపాటు ఐఐఎస్ఈఆర్ భోపాల్‌లో నాలుగేళ్ల బీఎస్ ఇంజనీరింగ్ సైన్సెస్‌లో 60 సీట్లు, బీఎస్ ఎకనామిక్ సైన్సెస్‌లో 30 సీట్లు ఉన్నాయి.

అర్హత

2022 లేదా 2023లో ఇంటర్మీడియెట్(ఎంపీసీ, బైపీసీ)లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ కేటగిరీ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. 2023లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంటర్ డిసిప్లినరీ అప్రోచ్

ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు అందిస్తున్న బీఎస్+ఎంఎస్ కోర్సు.. మొత్తం పది సెమిస్టర్లుగా అయిదేళ్ల వ్యవధిలో ఉంటుంది. మొదటి రెండేళ్లు ఫౌండేషన్ కోర్సులో ఉమ్మడి సబ్జెక్టులు ఉంటాయి. ఆ తర్వాత మూడు, నాలుగు సంవత్సరాల్లో విద్యార్థులు ఎంచుకున్న మేజర్(బయాలజీ/కెమిస్ట్రీ/ఫిజిక్స్/మ్యాథమెటిక్స్) సబ్జెక్టులపై బోధన ఉంటుంది. వీటితోపాటు.. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న మైనర్ సబ్జెక్టులను కూడా ఎంచుకోవచ్చు. అయిదో సంవత్సరంలో పూర్తిగా రీసెర్చ్ యాక్టివిటీస్‌పైనా, థీసిస్ వర్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఐఐఎస్ఈఆర్–భోపాల్ క్యాంపస్‌లోని నాలుగేళ్ల బీఎస్ ఇంజనీరింగ్ సైన్సెస్‌లో.. మొదటి రెండేళ్లు ఉమ్మడి కరిక్యులం ఉంటుంది. ఆ తర్వాత రెండేళ్లు కెమికల్ ఇంజనీరింగ్ లేదా డేటాసైన్స్ అండ్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్ మేజర్ సబ్జెక్టులుగా బోధన సాగిస్తారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్టును మేజర్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది.

బీఎస్ ఎకనామిక్స్

ఐఐఎస్ఈఆర్–భోపాల్ క్యాంపస్‌లోనే అందిస్తున్న బీఎస్ ఎకనామిక్స్ కోర్సును మరింత వినూత్నమైనదిగా పేర్కొనొచ్చు. సైన్స్, హ్యూమానిటీస్ అంశాలు కలయికగా ఇంటర్ డిసిప్లినరీ అప్రోచ్‌తో దీని కరిక్యులం రూపొందించారు. ఫలితంగా విద్యార్థులకు ఒకే సమయంలో సైన్స్, హ్యూమానిటీస్‌లపై నైపుణ్యం లభిస్తుంది.

మొదటి ఏడాది బేసిక్ సైన్సెస్, కోర్ ఎకనామిక్స్‌కు సంబంధించి ప్రాథమిక అంశాలను బోధిస్తారు. ఆ తర్వాత మూడేళ్లు ఎకనామిక్ సైన్సెస్ సబ్జెక్ట్ స్పెషలైజేషన్స్‌పై బోధన ఉంటుంది. నాలుగేళ్లు పూర్తయిన తర్వాత విద్యార్థులు తమకు ఆసక్తి ఉంటే..బీఎస్+ఎంఎస్ కోర్సుగా కొనసాగొచ్చు. మరో ఏడాది మేజర్ సబ్జెక్టులలో రీసెర్చ్, థీసిస్ సమర్పించాలి. ఆ తర్వాత ఇంటిగ్రేటెడ్ బీఎస్+ఎంఎస్ సర్టిఫికెట్ అందిస్తారు.

మూడు మార్గాల్లో ప్రవేశాలు

- ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లలోని బీఎస్+ఎంఎస్, బీఎస్ కోర్సుల్లో మూడు మార్గాల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. అవి..
- **జేఈఈ–అడ్వాన్స్‌డ్ 2023 ర్యాంకు:** ఈ విధానంలో జేఈఈ–అడ్వాన్స్‌డ్‌లో 15వేల లోపు ర్యాంకు సాధించిన అభ్యర్థులు నేరుగా ఐఐఎస్ఈఆర్ అడ్మిషన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- **కేవీపీవై ఎస్ఏ ఉత్తీర్ణత:** ఈ విధానంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన ఎస్ఏ స్ట్రీమ్- 2021లో సైన్స్ సబ్జెక్టులలో ఉత్తీర్ణత సాధించిన వారు కూడా నేరుగా ఐఐఎస్ఈఆర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఐఏటీ ఛానెల్:** జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు పొందని వారు, అదే విధంగా కిశోర్ వైజ్ఞానిక ప్రోత్సాహన్ యోజన సర్టిఫికెట్ లేని విద్యార్థులు ఐఐఎస్ఈఆర్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించే మార్గమిది. దీనినే ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐఏటీ) ఛానెల్ అని పేర్కొంటారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ లేదా బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులు.

ఆప్టిట్యూడ్ టెస్ట్

- ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐఏటీ)లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్‌లలో ప్రతి సబ్జెక్ట్‌పై 15 ప్రశ్నలు చొప్పున మొత్తం 60 ప్రశ్నలతో ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు చొప్పున 240 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రతి తప్పు సమాధానానికి 1 మార్కు తగ్గింపు నిబంధన అమలు చేస్తారు.
- ఐఏటీలో పొందిన మార్కులు, నిర్దిష్ట కటాఫ్‌లు, అందుబాటులోని సీట్లను పరిగణనలోకి తీసుకుంటూ.. సీట్ల భర్తీ ప్రక్రియ చేపడతారు.

స్కాలర్‌షిప్

కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన ఉత్తీర్ణత ఆధారంగా ప్రవేశాలు ఖరారు చేసుకున్న విద్యార్థులకు–తొలి మూడేళ్లు నెలకు రూ.5వేల స్కాలర్‌షిప్ లభిస్తుంది. దీనికి అదనంగా ప్రతి ఏటా రూ.20 వేల కాంటింజెన్సీ గ్రాంట్ అందిస్తారు. ఆ తర్వాత రెండేళ్లను పీజీ స్థాయిగా పరిగణించి..నెలకు రూ.ఏడు వేల స్కాలర్‌షిప్, ఏడాది రూ.28 వేల కాంటింజెన్సీ గ్రాంట్‌ను అందిస్తారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు

ఐఏటీ కోసం విద్యార్థులు సీబీఎస్ఈ పదకొండు, పన్నెండు తరగతులకు సంబంధించి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను ఆధారంగా చేసుకుని అభ్యసనం సాగించాలి. గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తూ.. ఆయా అంశాలకు లభిస్తున్న వెయిటేజీని పరిగణనలోకి తీసుకోవాలి. వీటితోపాటు మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరవడం కూడా మేలు చేస్తుంది. అదే విధంగా జేఈఈ–మెయిన్, అడ్వాన్స్‌డ్ గత ప్రశ్న పత్రాల సాధన కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

బేసిక్స్‌పై పట్టు సాధిస్తూ

ఐఐఎస్ఈఆర్ ఐఏటీ ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు అన్ని సబ్జెక్ట్‌లలోని బేసిక్ కాన్సెప్ట్స్, ఫార్ములాలపై పట్టు సాధించాలి. ఆయా అంశాలను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ముఖ్యంగా ఫిజిక్స్‌లో న్యూమరికల్ టైప్ టాపిక్స్ చదువుతున్నప్పుడు అభ్యసనానికే పరిమితం కాకుండా.. ప్రాక్టీస్ చేయడం అలవర్చుకోవాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లు, ఫార్ములాలు, నిర్వచనాలను షార్ట్ నోట్స్‌గా రాసుకోవాలి. ఇది రివిజన్ సమయంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ఈ ర్యాంకులకే సీటు!


గత మూడేళ్ల గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే..జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో అయిదు వేల లోపు ర్యాంకుతో; కేవీపీవైలో రెండు వేలలోపు ర్యాంకుతో, ఐఏటీలోనూ మూడు వేల లోపు ర్యాంకుతోనే సీట్ల భర్తీ పూర్తవుతోంది. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు ఓపెన్ కేటగిరీతో పోల్చితే మరో అయిదు వందలు లేదా ఆరు వందల ఎక్కువ ర్యాంకులోపు సీటు లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 25.05.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** మే 28, 29
- **ఐఏటీ హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:** 10.06.2023
- **ఐఏటీ పరీక్ష తేది:** 17.06.2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://iiseradmission.in

'నెట్'స్పీడైతే.. బోధన 'వీఆర్'అవుద్ది!

- రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో 'వర్చువల్ రియాలిటీ'ల్యాబ్‌లకు అడ్డంకులు
- 'త్రీడీ' బోధన ప్రవేశపెట్టాలనుకున్న విద్యాశాఖ
- పాఠశాలల్లో పరిస్థితి, వనరులపై అధ్యయనం
- పాత కంప్యూటర్లు, స్లో ఇంటర్నెట్‌తో సమస్య ఉన్నట్టు గుర్తింపు.. దీనిపై ప్రభుత్వానికి విన్నవించనున్న అధికారులు
- పరిష్కారం లభిస్తే.. విద్యార్థులకు అద్భుతమైన బోధనకు చాన్స్



సాక్షి, హైదరాబాద్: మనుషులుగానీ, వస్తువులుగానీ మనం దగ్గరుండి చూసినట్టుగా.. అంతా మన కళ్ల ముందే ఉన్నట్టుగా అనిపించే సాంకేతికతే 'వర్చువల్ రియాలిటీ (వీఆర్)'. ప్రత్యేకమైన వీఆర్ హెడ్‌సెట్‌ను కంప్యూటర్‌కు అనుసంధానం చేసి, వీడియోలను ప్లే చేయడం ద్వారా అనుభూతిని పొందొచ్చు. ఈ సాంకేతికతతో విద్యా రంగంలో అద్భుతమైన ఫలితాలను పొందవచ్చు. ఉదాహరణకు ఒక విత్తనం మొలకెత్తడం నుంచి పెద్ద చెట్టుగా ఎదిగేదాకా కీలకమైన దశలన్నింటినీ కొన్ని నిమిషాల్లోనే స్పష్టంగా అవగాహన కలిగేలా 'వీఆర్'వీడియోలను విద్యార్థులకు చూపించవచ్చు. ఇందుకోసమే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 'వీఆర్'బోధన చేపట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. కానీ స్కూళ్లలో సరైన కంప్యూటర్లు, వేగవంతమైన ఇంటర్‌నెట్ లేకపోవడం సమస్యగా మారింది.

పరిశోధనలపై ఆసక్తి కలిగేలా..

అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని పాఠశాలల్లో 'వర్చువల్ రియాలిటీ, త్రీడీ'పద్ధతుల్లో బోధన అందించాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఇందుకోసం కేంద్రం 60%, రాష్ట్రాలు 40% నిధులు వెచ్చించేలా కార్యక్రమాన్ని రూపొందించింది. విద్యార్థుల్లో ఆలోచనను రేకెత్తించేలా, క్లిష్టమైన అంశాలు కూడా అత్యంత సులభంగా అర్థమయ్యేలా బోధన కొనసాగించేందుకు ఏర్పాట్లు చేసింది. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఇందుకు సంబంధించిన ప్రణాళికను కూడా రూపొందించింది. విద్యార్థి స్థాయిలోనే పరిశోధనల వైపు ఆసక్తి కలిగించేలా, పూర్తి అవగాహన వచ్చేలా అంశాలను ఎంపిక చేసింది. ఈ మేరకు 2023–24 నుంచే ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని కొన్ని స్కూళ్లలో 'వీఆర్'ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీని అమలుకు సంబంధించి ఇటీవల స్కూళ్లలో అధ్యయనం చేసింది.

పాత కంప్యూటర్లు.. స్లో ఇంటర్నెట్..

'వీఆర్–త్రీడీ'వంటి ఆసక్తికర బోధన పద్ధతులను అనుసరించేందుకు సిద్ధంగా ఉన్నా మౌలిక వసతుల కొరత ఇబ్బందిగా మారిందని అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం చాలా ప్రభుత్వ స్కూళ్లలో ఇంటర్నెట్ సదుపాయం అరకొరగా ఉందని.. వాడే కంప్యూటర్లు కూడా పాతవని, వాటితో వీఆర్ త్రీడీ పాఠాలు చెప్పడం కష్టమని అధ్యయన నివేదికలో పేర్కొన్నారు. వాస్తవానికి ఒక్కో పాఠశాలకు 20 హెడ్‌సెట్ల చొప్పున ఐదు బడుల్లో దీన్ని తొలుత ప్రారంభించాలని అనుకున్నారు. కానీ బోధనకు సంబంధించిన వీడియోలు డౌన్‌లోడ్ చేసుకోవాలంటే సమస్య ఏర్పడుతోందని గుర్తించారు. చాలా స్కూళ్లలో ఇప్పటికీ కనీసం 4జీ నెట్ కూడా లేదు. పాత కంప్యూటర్లు ఎక్కువ పరిమాణంలో ఉండే వీఆర్–త్రీడీ వీడియోలను సరిగా ప్లే చేయలేకపోతున్నాయి. ఇది పిల్లల్లో విసుగు కలిగిస్తుందని అధికారులు అంటున్నారు. ప్రధానంగా సామాన్య, సాంఘిక శాస్త్రాల బోధనలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తేలినట్టు వివరిస్తున్నారు. ఎక్కువ సామర్థ్యమున్న, వేగంగా పనిచేసే కంప్యూటర్లు, వేగవంతమైన ఇంటర్నెట్ ఉంటే తప్ప 'వీఆర్'బోధన అంశంలో ముందుకెళ్లడం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరనున్నామని.. సానుకూల స్పందన వస్తే విద్యార్థులకు అద్భుతమైన బోధన అందుతుందని అధికారులు చెప్తున్నారు.

క్లుప్తంగా...

'సాక్షి' పాత్రికేయులకు హైబిజ్ పురస్కారాలు



అవార్డులతో నాగ కిషోర్, పంతంగి రాంబాబు

సాక్షి, హైదరాబాద్: 'సాక్షి డెస్క్ సాగుబడి' ఇన్‌చార్జి పంతంగి రాంబాబు, సాక్షి టీవీ న్యూస్ ప్రజెంటర్ డి.వి.ఎన్. నాగకిషోర్ హైబిజ్ టీవీ మీడియా పురస్కారాలను అందుకున్నారు. హైటెక్స్‌లో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో హోం మంత్రి మహమూద్ అలీ నుంచి రాంబాబు ఉత్తమ ప్రింట్ అగ్రికల్చరల్ జర్నలిస్ట్ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఇంటిపంటలు, సిరిధాన్యాల వ్యాప్తి దిశగా ఆయన సాక్షి దినపత్రికలో 'సాగుబడి' పేజీని నిర్వహిస్తున్నారు. సాక్షి టీవీ న్యూస్ ప్రజెంటర్ నాగ కిషోర్ ఉత్తమ న్యూస్ ప్రజెంటర్‌గా అవార్డు అందుకున్నారు. అలాగే వివిధ పత్రికలు,సోషల్ మీడియా సంస్థలు, శాటిలైట్ చానళ్ల పాత్రికేయులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు కూడా పురస్కారాలు పొందారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి, సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ మార్కెటింగ్ కేఆర్పీ రెడ్డి, ఈవీ నర్సింహారెడ్డి – ఐఏఎస్ (వీసీ–ఎండీ టీఎస్ ఐఐసీ), నరేంద్ర రామ్ నంబుల (సీఎండీ – లైఫ్ స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్), పి.చక్రధరరావు (ప్రెసిడెంట్– ఐపీఈఎంఏ, పౌల్ట్రీ ఇండియా), ఎం.రవీందర్ రెడ్డి (డైరెక్టర్ మార్కెటింగ్–భారతి సిమెంట్స్), వి.రాజశేఖర్‌రెడ్డి (జనరల్ సెక్రటరీ– క్రెడాయ్), ఎం.రాజ్‌గోపాల్ (ఎండీ– హై బిజ్ టీవీ, తెలుగు నౌ), జె.సంధ్యారాణి (సీఈవో– హైబిజ్ టీవీ, తెలుగు నౌ) పాల్గొన్నారు.

మే 8 వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫీజు గడువు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫీజు గడువును పొడిగించారు. అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు మే 8వ తేదీ సాయంత్రం 5 గంటలవరకు ఫీజు చెల్లించే అవకాశం కల్పించారు. మే 29 నుంచి అడ్మిట్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, జూన్4న పరీక్ష ఉంటుందని గౌహతి ఐఐటీ వెల్లడించింది.


నగరవాసి అగర్వాల్‌కు భారత్ గౌరవ్ అవార్డు

12న బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రదానం



సాక్షి,హైదరాబాద్: బ్రిటిష్ పార్లమెంట్ వేదికగా అందించే ప్రతిష్టాత్మక 'భారత్ గౌరవ్ అవార్డ్'కు నగరవాసి, నేషనల్ చాంబర్స్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ వైస్ చైర్మన్ డాక్టర్ అజయ్ అగర్వాల్ ఎన్నికయ్యారు. వరల్డ్ కమ్యూని కేటర్స్ కౌన్సిల్ అధిపతిగా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెడ్‌గా, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ అధికారిగా ఆయన సేవలందించారు. బ్రిటిష్ పార్లమెంటులో ఏర్పాటు చేసిన వేదికలో హౌస్ ఆఫ్ లార్డ్స్ బారోనెస్ సందీప్ వర్మ, హౌస్ ఆఫ్ లార్డ్స్ రామి రేంజర్, పార్లమెంట్ సభ్యుడు వీరేంద్ర శర్మ సమక్షంలో 12న జరిగే ఈ అవార్డుల ప్రదానోత్సవానికి ప్రపంచవ్యాప్తంగా 20కిపైగా దేశాల నుంచి అవార్డు గ్రహీతలు కూడా హాజరుకానున్నారు.

క్రమబద్ధీకరణ కోసం కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ ప్రొఫెసర్స్ జేఏసీ ధర్నా నిర్వహించింది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట బుధవారం చేపట్టిన ఈ ధర్నాలో జేఏసీ చైర్మన్ డాక్టర్ ఎం.రామేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 11 విశ్వవిద్యాలయాల్లో 1335 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేస్తున్నారని, వీరందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

అడ్డగోలు అడ్మిషన్లు చెల్లవ్

ప్రైవేటు జూనియర్ కాలేజీలపై నిఘా పెట్టాలి

- గుర్తింపు వచ్చాకే ప్రవేశాలు
- ఈ ఏడాది నుంచి బయోమెట్రిక్ తప్పనిసరి
- జిల్లా అధికారులకు ఇంటర్ బోర్డ్ ఆదేశాలు
- మార్గదర్శకాలు అమలు చేయకుంటే కఠిన చర్యలు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంటర్మీడియట్ కాలేజీలపై ఇంటర్ బోర్డు మరింత దృష్టి పెట్టింది. అనుమతుల్లేకుండా అడ్డగోలుగా చేపట్టే అడ్మిషన్లు చెల్లవని స్పష్టంచేసింది. అలాంటి కాలేజీల వివరాలు సేకరించి తమకు పంపాలని జిల్లా ఇంటర్ అధికారులను ఆదేశించింది. ఇలాంటి కాలేజీలపై కఠిన చర్యలు తీసుకునేందుకు సన్నద్ధమవుతోంది. దీంతోపాటు ఈ ఏడాది సకాలంలో అనుబంధ గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ఈలోగా ఎక్కడా ఏ కాలేజీ అడ్మిషన్లు తీసుకోవడానికి వీల్లేదని, కాలేజీకి గుర్తింపు రాకపోతే బోర్డు బాధ్యత వహించదని స్పష్టంచేసింది. ప్రతీ ప్రైవేటు కాలేజీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి కచ్చితంగా పాటించాల్సిన నిబంధనలను పొందుపరుస్తూ మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. ఏటా బోర్డు నిబంధనలు ఉల్లంఘించే కాలేజీలపై గట్టి నిఘా ఉంచాలని, వాటి వివరాలను తమకు పంపాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్టు బోర్డు వర్గాలు తెలిపాయి.

మెరుగైన బోధన ఉండాల్సిందే..

ఎక్కడైతే అనుబంధ గుర్తింపు పొందుతారో, అక్కడే కాలేజీ నిర్వహించాలని, ఒకచోట అనుమతి, వేరొకచోట కాలేజీ ఉంటే పర్మిషన్ రద్దు చేస్తామని ప్రైవేటు ఇంటర్ కాలేజీలను బోర్డు హెచ్చరించింది. ఈ దిశగా వివరాలు సేకరించాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ అధికారులను ఆదేశించారు. నాణ్యమైన బోధనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఇది ఒక క్యాంపస్‌కే పరిమితం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. బోధన, బోధనేతర సిబ్బందిని నియమించేటప్పుడు వారి వివరాలను ఈ ఏడాది నుంచి బోర్డు ఆన్‌లైన్‌లో నమోదు చేయబోతోంది. విద్యాసంవత్సరం మొదట్లో నియమించిన అధ్యాపకులే చివరి వరకూ ఉండాలనే నిబంధన విధించింది. ఒకవేళ అధ్యాపకుడిని మారిస్తే ఆ విషయాన్ని బోర్డు అధికారులకు తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంటుంది. దీనివల్ల బోధన ఏ స్థాయిలో జరుగుతుందనేది అంచనా వేయొచ్చని అధికారులు చెబుతున్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

ఈ ఏడాది నుంచి సిబ్బంది బయోమెట్రిక్‌ను తప్పనిసరి చేయనున్నారు. ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో బోధించే అధ్యాపకులు విధిగా పీజీ చేసి ఉండాలి. వారి వివరాలు, ఆధార్, బయోమెట్రిక్‌కు అవసరమైన వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఫీడ్ చేస్తారు. విద్యా సంవత్సరం ముగిసే వరకూ వారి బయోమెట్రిక్ కొనసాగేలా చూస్తారు. ప్రతీ కాలేజీలో ప్రత్యేక మొబైల్ నంబర్ అందుబాటులో ఉండాలని, ఇది జిల్లా ఇంటర్ విద్యాధికారికి తెలపాలని సూచించారు. విద్యా సంవత్సరానికి సంబంధించి బోర్డు నిర్ణయించిన తేదీల్లోనే ప్రవేశాలు, తరగతులు జరగాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.

నీరా కేఫ్, క్యాంటీన్ ప్రారంభం

- ప్రారంభించిన మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, తలసాని
- పలువురు మఠాధిపతులు, స్వామీజీలతో కలసి నీరా సేవనం
- ఈ పానీయంలో ఆల్కహాల్ ఉండదు..మత్తు రాదు: శ్రీనివాస్‌గౌడ్



నీరా తాగుతున్న మంత్రులు శ్రీనివాస్ గౌడ్, తలసాని, మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, స్వామీజీలు

పంజగుట్ట: తాటి, ఈత చెట్ల నుంచి సేకరించే నీరాతోపాటు వాటి ఉప ఉత్పత్తులను విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లతో నిర్మించిన నీరా కేఫ్, క్యాంటీన్ హైదరాబాద్‌వాసులకు అందుబాటులోకి వచ్చాయి. నగరంలోని నెక్లెస్ రోడ్డులో ఏర్పాటు చేసిన నీరా కేఫ్, క్యాంటీన్‌లను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలసి బుధవారం ప్రారంభించారు. నీరాపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు, నీరా దేవతల పానీయం అని చెప్పేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మఠాధిపతులు, స్వామీజీలతో కలసి మంత్రులు ఈ సందర్భంగా నీరా తాగారు. నీరాలో ఎలాంటి ఆల్కహాల్ ఉండదని... ఇది తాగడంవల్ల మత్తు రాదని శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. ఇందులో పుష్కలంగా విటమిన్లు, క్యాల్షియం వంటి ఖనిజాలు ఉంటాయని చెప్పారు. సహజంగా లభించే పానియాలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని... వారికి గీత కార్మికుల ఆత్మగౌరవ ప్రతీకగా తీసుకొచ్చిన నీరా కేఫ్ చెంపపెట్టులాంటిదన్నారు.

నీరా వంటకాలు సైతం..

క్యాంటీన్‌లో నీరా విత్ బోటీ, నీరా విత్ తెలంగాణ వంటకాలు, నీరా విత్ బిర్యానీ, నీరా విత్ వెజ్ స్నాక్స్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నీరాతోపాటు తాటి బెల్లం, తాటి చక్కెర, తేనె, నీరాతో చేసిన 'బూస్ట్' పొడి కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. త్వరలోనే నీరా ఐస్‌క్రీం, తాటి ముంజ ఐస్‌క్రీంలను అందుబాటులోకి తెస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గీత కార్మికుల సంక్షేమానికి ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని... అందులో భాగంగానే రైతు బీమా తరహాలో గీత కార్మికులకు రూ. 5 లక్షల బీమా తీసుకొచ్చారని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా గౌడ కులస్తులకు వైన్ షాపుల్లో రిజర్వేషన్ కల్పించారని, ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని నెలకొల్పారని గుర్తుచేశారు. నీరా కేఫ్ ప్రారంభించినందుకు, గీత కార్మికులకు బీమా ప్రకటించినందుకు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటాలకు అఖిల భారత గౌడ సంఘం నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, గంగాధర్ గౌడ్, రాష్ట్ర పర్యాటక, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆంజనేయ గౌడ్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ స్కూళ్ల బడ్జెట్ ప్రతిపాదనలు పంపండి

పీఎం–ఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం కింద ఎంపిక చేసిన స్కూళ్లపై రాష్ట్రానికి కేంద్రం లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం–ఎస్‌హెచ్‌ఆర్‌ఐ) పథకం కింద తెలంగాణ నుంచి తొలివిడతగా ఎంపిక చేసిన 543 స్కూళ్లలో జాతీయ విద్యావిధానాన్ని (ఎన్‌ఈపీ) సమర్థంగా అమలు చేసేందుకు వీలుగా వార్షిక కార్యాచరణ ప్రణాళిక, బడ్జెట్ ప్రతిపాదనలను పంపాలని రాష్ట్రానికి కేంద్రం సూచించింది. ఈ పథకంలో భాగంగా అందించే నిధులను నిర్వహించేందుకు ప్రత్యేకంగా సింగిల్ నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు లేఖ రాసింది. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో గతేడాది పీఎం–ఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకానికి శ్రీకారం చుట్టిన కేంద్రం... గత వారం మొదటి విడతగా తెలంగాణ నుంచి 543 స్కూళ్లసహా దేశవ్యాప్తంగా 6,448 స్కూళ్లను ఎంపిక చేయడం తెలిసిందే. రాష్ట్రం నుంచి ఎంపికైన స్కూళ్లలో 56 ఎలిమెంటరీ పాఠశాలలు, 487 సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలలు ఉన్నాయి.

ఉచితంగా వర్క్‌బుక్స్, నోట్ పుస్తకాలు

ప్రైమరీ, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పంపిణీకి నిర్ణయం

- ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేత
- స్కూళ్లు తెరిచేనాటికి పాఠ్యపుస్తకాలు సిద్ధం చేయాలి
- విద్యా శాఖపై మంత్రి సబిత సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ ఏడాది నుంచి వర్క్‌బుక్స్, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను కూడా అందుబాటులోకి తేవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో విద్యాశాఖ పనితీరుపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 24 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి తెలిపారు. వర్క్ బుక్స్‌ను, నోటు పుస్తకాలను పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అందజేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులందరికీ ద్విభాషా పాఠ్యపుస్తకాలను పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి అందించాలని అదేశించారు. గత సంవత్సరం పాఠ్యపుస్తకాల పంపిణీ కోసం రూ.132 కోట్లు ఖర్చు చేయగా, రానున్న విద్యా సంవత్సరంలో రూ.200 కోట్లు వెచ్చించి పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దాదాపు రూ.150 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫామ్‌ను పాఠశాలల పునః ప్రారంభం నాటికి అందించాలని సూచించారు.

ఎమ్మెల్యేల చేతుల మీదుగా పుస్తకాల పంపిణీ

జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నందున బడిబాట కార్యక్రమం ఏర్పాటు చేసి అందులో స్థానిక శాసనసభ్యులను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని మంత్రి సబిత అధికారులకు చెప్పారు. స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ, పాఠ్య పుస్తకాల పంపిణీ, యూనిఫామ్‌లను విద్యార్థులకు అందజేసే విధంగా కార్యక్రమాల్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలకు హాజరయ్యే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలని మంత్రి సబిత అధికారులకు సూచించారు. మన ఊరు – మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులను జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్య సంచాలకురాలు దేవసేన తదితరులు పాల్గొన్నారు.

రామావతారంలో నృసింహుడు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం శ్రీస్వామి, అమ్మవారికి నిత్య కైంకర్యాలు జరిపించారు. ఆలయంలో అభిషేకాలు, నవకలశ స్నపనం, శ్రీస్వామి అమ్మవార్లకు లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం హనుమంత వాహనంపై శ్రీరామావతారం అలంకార సేవలో శ్రీస్వామివారిని ఊరేగించారు. అనుబంధ ఆలయమైన పాతగుట్ట ఆలయంలో సైతం జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

అటు వివాహం.. ఇటు నినాదం



'పంచాయతీ కార్యదర్శుల' జంట వినూత్న నిరసన

బోయినపల్లి(చొప్పదండి): తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలంటూ వధూవరులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. వివరాలివి. రాజన్న సిరిసిల్ల బోయినపల్లి మండలం రామన్నపేట జూనియర్ పంచాయతీ కార్యదర్శి నాగుల శ్రీకాంత్, కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శి మౌనిక వివాహం బుధవారం కరీంనగర్ జిల్లా కేశవపట్నంలో జరిగింది. పెళ్లితంతు అనంతరం వధూవంరులిద్దరూ.. 'జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలి..' అనే ప్లకార్డు ప్రదర్శించారు.

మా నాన్న భవిష్యత్తు కేసీఆర్ చేతిలో..

చిన్నారి వినూత్న నిరసన

రాయికల్ (జగిత్యాల): తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో పంచాయతీ కార్యదర్శులు విధులు బహిష్కరించి దీక్ష చేపట్టారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్బర్ బుధవారం తన మూడేళ్ల కూతురు అక్సాతో కలిసి వచ్చి దీక్ష శిబిరంలో పాల్గొన్నారు. 'నా భవిష్యత్ మా నాన్న చేతిలో ఉంది.. మా నాన్న భవిష్యత్ సీఎం కేసీఆర్ చేతిలో ఉంది'.. నినాదంతో చిన్నారి అక్సా ప్లకార్డు ప్రదర్శించి నిరసన తెలపడం ఆకర్షించింది.



తండ్రికి మద్దతుగా ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న చిన్నారి

మేడారం మహా జాతర తేదీలు ఖరారు

2024, ఫిబ్రవరి 21నుంచి 24వ తేదీ వరకు తెలంగాణ కుంభమేళా

- షెడ్యూల్‌ను ప్రకటించిన సమ్మక్క–సారలమ్మ పూజారులు

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర తేదీలు ఖరారయ్యాయి. రెండేళ్లకోసారి ఆదివాసీ, గిరిజన సంప్రదాయ పద్ధతిలో నిర్వహించే జాతరను ఈసారి 2024 ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించాలని పూజారుల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం షెడ్యూల్‌ను ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న మాఘశుద్ధ పంచమి బుధవారం రోజున మండమెలగడం, గుడి శుద్ధీకరణతో జాతర ప్రక్రియను ప్రారంభిస్తారు.

దాదాపు పది నెలల ముందే జాతర తేదీలు..

మేడారం మహాజాతర తేదీలను పూజారులు ఈసారి దాదాపు 10 నెలల ముందుగానే ప్రకటించారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గత అనుభవాల దృష్ట్యా ఈసారి జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సమ్మక్క–సారలమ్మ పూజారులు కోరుతున్నారు.

షెడ్యూల్ ప్రకటనకు ముందు పూజలు..


మేడారం మహాజాతర తేదీల ఖరారు కోసం బుధవారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సారయ్య, ప్రధాన కార్యదర్శి చందా గోపాల్, పూజారులు సిద్దబోయిన మునేందర్, సిద్దబోయిన మహేశ్, లక్ష్మణ్‌రావు, కాక వెంకటేశ్వర్లు, కాక భుజంగరావు, చందా రఘుపతి, కొక్కెర కృష్ణయ్య, కొక్కెర రమేశ్, భోజారావు, జనార్దన్, అరుణ్‌కుమార్‌లు సమావేశం అయ్యారు. కాగా, సమ్మక్క–సారలమ్మ మహాజాతర తేదీలను ప్రకటించే ముందు పూజారులు ఆనవాయితీగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే ఏడాది మహాజాతర విజయవంతంగా సాగాలని అమ్మవార్లను వేడుకున్నారు.



జాతర తేదీలు ఇవే..

- ఫిబ్రవరి 21: మాఘశుద్ధ ద్వాదశి బుధవారం సాయంత్రం గద్దెల మీదకు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు
- ఫిబ్రవరి 22: చిలకలగుట్ట నుంచి సమ్మక్క దేవత రాక.
- ఫిబ్రవరి 23: సమ్మక్క–సారలమ్మ అమ్మవార్లకు మొక్కుల సమర్పణ.
- ఫిబ్రవరి 24: మాఘశుద్ధ పౌర్ణమి శనివారం అమ్మవార్ల వన ప్రవేశం, మహా జాతర ముగింపు.
- ఫిబ్రవరి 28: మాఘశుద్ధ బహుళ పంచమి బుధవారం రోజున తిరుగువారం పండుగ

అనురాగ్ ప్రైవేట్ వర్సిటీకి మెడికల్ కాలేజీ



సాక్షి, హైదరాబాద్: అనురాగ్ ప్రైవేట్ యూనివర్సిటీకి మెడికల్ కాలేజీ మంజూరైంది. రాష్ట్రంలో ఒక ప్రైవేట్ యూనివర్సిటీకి అనుబంధంగా మెడికల్ కాలేజీ రావడం ఇదే తొలిసారి. 2023–24 వైద్య విద్యా సంవత్సరంలో 150 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేసేందుకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతించింది. మేడ్చల్‌లో ఏర్పాటు చేస్తున్న ఈ కాలేజీకి నీలిమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌గా పేరు పెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలన్నీ కాళోజీ నారాయణరావు ఆరోగ్య వర్సిటీ పరిధిలో ఉన్నాయి. అడ్మిషన్లు, పరీక్షలు యూనివర్సిటీ ఆధ్వర్యంలోనే జరుగుతాయి. కాగా, డీమ్డ్, ప్రైవేట్ వర్సిటీల పరిధిలోని మెడికల్ కాలేజీల్లో ప్రక్రియను కేంద్ర మెడికల్ కౌన్సిల్ కమిటీ (ఎంసీసీ) నిర్వహిస్తుంది. లేదంటే రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కౌన్సెలింగ్ జరుగుతుంది. ఫీజుల నిర్ణయానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల్లోని కాలేజీల్లో ఫీజులను అధ్యయనం చేసి, ఫీజును ఖరారు చేస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే 3 ప్రైవేటు, 7 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు సహా మొత్తం 10 కాలేజీలకు ఎన్ఎంసీ అనుమతి ఇచ్చింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.